RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



06 మార్చ్ 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:236

బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్...



## కార్పొరేషన్ చైర్మన్ పదవి కావాలంటే పదేళ్లు కాంగ్రెస్ పార్టీలో పని చేసి ఉండాలి

- పార్టీ అంతర్గత విషయాలు మీటింగ్‌లోనే చెప్పాలి
- గాంధీభవన్ బయట మాట్లాడొద్దు
- అసంతృప్తులకు మీనాక్షి నటరాజన్ అల్టిమేటం



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిమార్చి 5**ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ స్థితిగతులు, ఫలితాలపై రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ సమీక్షించారు. పార్టీ పరిస్థితిపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. కార్పొరేషన్ చైర్మ న్ పదవి కావాలంటే పదేళ్లు కాంగ్రెస్ పార్టీలో పని చేసి ఉండాలని, కార్యకర్తలను ఎలా వాడుకోవా లో తెలుసని, పార్టీ విజయం కోసం కష్టపడిన అం దరికీ న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన కొత్త వారిని కలుపుకు పోతామన్నారు. పార్టీ అంతర్గత విషయాలు మీటింగ్‌లోనే చెప్పాలని గాంధీభవన్ బయట మాట్లాడొద్దని ఆమె సూచించారు. అలాగే మంత్రులు తప్పొప్పులు కూడా మీటింగ్‌లోనే చె ప్పాలని అంతేకానీ ప్రత్యేక సమావేశాలు పెట్టడం సోషల్ మీడియాలో పెట్టడం వంటివి చేసి పార్టీ, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయొద్దన్నారు.పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఇకపై ఎవరైనా గొడవ పడినా, పార్టీపై బహిరంగంగా కామెంట్స్ చేసినా ఊరుకునే ప్రసక్తే లేదని నేతలకు ఆమె వార్నింగ్ ఇచ్చారు. ఇన్ చార్జీల వల్లే సమస్యలు వస్తే పదవి నుంచి తొలగిస్తామని ఆమె హెచ్చరించారు. నియోజక వర్గ ఇన్‌చార్జీలు బాధ్యతాయుతంగా వ్యవహరించి అందరినీ కలుపుకుపోవాలన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే లు ఎల్లవేళలా ప్రజలకు అందు బాటులో ఉండాలని ఆమె సూచించారు. పటాన్‌చెరులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తమను ఇబ్బంది పెడుతున్నారని కాట శ్రీనివాస్ గౌడ్ మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం కోసం కమిటీ వేసినా ఇప్పటివరకు రిపోర్టు ఇవ్వలేదంటూ ఆయన మీనాక్షి నటరాజన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించాలంటూ మీనాక్షి నటరాజన్‌కు కాట శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

**బిఆర్ఎస్ నేతలే అధికారం చెలాయిస్తున్నారు: మీనాక్షి ఎదుట నాయకుల ఆవేదన**

అధికారులు తమ మాట వినడం లేదని మరికొందరు నేతలు ఎమ్మెల్యే మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. ఇంకా బిఆర్ఎస్ నేతలే అధికారం చెలాయిస్తున్నారని నాయకులు ఆమె ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇందిరమ్మ ఇళ్లు అయినా తాము చెప్పిన వారికి ఇస్తే గౌరవం ఉంటుందని మీనాక్షి నటరాజన్‌కు పలువురు నేతలు విజ్ఞప్తి చేశారు.ఈ సమీక్షలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల ప్రజాపాలనలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మీనాక్షి నటరాజన్ చర్చించారు. చారిత్రాత్మక నిర్ణయాలైన కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపైనా ఆమె అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందని ఆమె ఆరా తీశారు. సంస్థాగతంగా పార్టీ నిర్మాణం, కమిటీల ఏర్పాటుపైనా కీలకంగా ఆమె చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు మీనాక్షి దిశానిర్దేశం చేశారు. పార్టీలో పాత, కొత్త నేతల మధ్య సమన్వయం లోపించకుండా ఐక్యంగా ముందుగు సాగాలని ఆమె హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె సూచించారు. ఈ సమీక్షలో ఏఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిసిసి అధ్యక్షులు, పోటీ చేసిన అభ్యర్థులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాలు చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, ఇతర నాయకులు



## మంత్రి కొండా సురేఖపై సోనియా గాంధీ ప్రశంసలు...

42 ఏళ్ల తర్వాత ప్రత్యేక సురేఖ ప్రత్యేక చొరవతో కాళేశ్వరం ఆలయంలో మహా కుంభాభిషేకం మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించడం హర్షణీమంటూ మంత్రికి సోనియా లేఖ తనకు త్రివేణి సంగమం పవిత్ర జలాలను, ప్రసాదాన్ని పంపించినందుకు ధన్యవాదాలు.తెలంగాణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రశంసించారు. దక్షిణ కాశీగా పేరొందిన తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆలయంలో 42 ఏళ్ల తర్వాత ప్రత్యేక చొరవతో సురేఖ మహా కుంభాభిషేకం నిర్వహించడమే ఇందుకు కారణం. కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించడం హర్షణీమంటూ మంత్రికి సోనియా లేఖ రాశారు. ఈ సందర్భంగా తనకు త్రివేణి సంగమం పవిత్ర జలాలను, ప్రసాదాన్ని పంపించినందుకు కొండా సురేఖకు లేఖ ద్వారా సోనియా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే కాళేశ్వర, ముక్తీశ్వరస్వామి స్థల విశిష్టతను, ప్రాశస్త్యాన్ని తెలియజేసినందుకు మంత్రిని అభినందించారు.కాగా, 1982లో తొలిసారి కాళేశ్వర, ముక్తీశ్వర ఆలయ జీర్ణోద్ధరణ జరిగిన సమయంలో ఇక్కడ మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత మళ్లీ 42 ఏళ్ల తర్వాత ఫిబ్రవరి 7 నుంచి 10వ తేదీ వరకు మహా కుంభాభిషేకం వేడుకలను నిర్వహించారు.

## మలక్‌పేటలో నర్సు శిరీష హత్య కేసులో ముగ్గురు అరెస్టు :ఏసీపీ శ్యాం సుందర్



**మలక్‌పేట ప్రజాబలం ప్రతినిధి:**మలక్‌పేట, మార్చి 5 మలక్‌పేటలో వివాహిత శిరీష హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఏసీపీ శ్యాం సుందర్ తెలిపారు. శిరీష భర్త వినయ్‌తో పాటు అతని సోదరి సరిత, మరో సోదరి కుమారుడు నిహాల్‌ను అదుపులోకి తీసుకున్నామని అన్నారు. కేసు వివరాలను మీడియా సమావేశం నిర్వహించి వెల్లడించారు.

పరస్పరం ఘర్షణ మార్చి ఒకటోన రాత్రి వినయ్ సోదరి సరిత, శిరీష మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగిందని, నర్సుగా పని చేస్తున్న శిరీష పలు చోట్ల ఉద్యోగాలు మానేసిందని తెలిపారు. తరచూ ఉద్యోగాలు ఎందుకు మానేస్తున్నావని, నిలకడ లేదా నీకు అని సరిత గట్టిగా నిలదీసిందని, నీ చరిత్ర మొత్తం నాకు తెలుసు, నీ సంగతి తేలుస్తా అంటూ శిరీష కూడా ఎదురు దాడికి దిగడంతో పరస్పరం ఘర్షణ పడ్డారని, ఆ తరువాత ఎవరి గదిలోకి వారు వెళ్లిపోయారని వివరించారు.

నిందితురాలిని రక్షించేందుకు వారిద్దరూ సాయం : గొడవ తరువాత శిరీషకు నిద్ర పట్టడం లేదని సరిత వద్ద ఉండే మత్తు ఇంజెక్షన్ అడిగిందని, అప్పటికే శిరీషపై కక్ష పెంచుకున్న సరిత మత్తు ఇంజెక్షన్ డోసు ఎక్కువగా ఇచ్చిందని అన్నారు. శిరీష మత్తులోకి జారుకున్న తరువాత దిండుతో ముఖంపై అదిమిపెట్టి ఊపిరాడకుండా చేసి చంపేసిందని, మరుసటిరోజు ఉదయం శిరీష భర్త, సోదరుడికి జరిగిన విషయం చెప్పింది. నిందితురాలిని రక్షించేందుకు వినయ్?తో పాటు మరో సోదరి కుమారుడు నిహాల్? అంబులెన్స్‌ను పిలిపించి ఆసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. సహజ మరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని, తన గురించి భర్తకు చెడుగా చెబుతుందని భయపడిన సరిత శిరీషను హతమార్చినట్టు దర్యాప్తులో తేలిందని ఏసీపీ వివరించారు. సరిత ఏ-1గా కేసు నమోదు చేశామని తెలిపారు."నర్సుగా పనిచేస్తున్న శిరీష పలుచోట్ల ఉద్యోగాలు మానేసింది. తరచూ ఉద్యోగాలు ఎందుకు మానేస్తున్నావని శిరీషను సరిత నిలదీసి తిట్టింది. నీ చరిత్ర అంతా నాకు తెలుసులే అంటూ సరితను శిరీష తిట్టింది. నీ గురించి అన్ని విషయాలు బయటపెడతానని సరితను శిరీష బెదిరించింది. శిరీష అలా అనటంతో సరిత మత్తు ఇంజెక్షన్ ఇచ్చి తర్వాత దిండుతో అదిమిపెట్టి చంపింది అని తెలిపారుహనుమకొండ జిల్లా పరకాలకు చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతి చెందడంతో చిన్న కూతురు శిరీష (32)ను కరీంనగర్‌కు చెందిన ఓ ప్రొఫెసర్ దత్తత తీసుకున్నారు. 2016లో నాగర్ కర్నూలు జిల్లా దోమలపెంటకు చెందిన వినయ్‌ను శిరీష ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ వివాహం ఇష్టం లేని ప్రొఫెసర్ కుటుంబం శిరీషను దూరంగా ఉంచారు. దంపతులిద్దరూ మలక్‌పేటలోని జమున టవర్స్‌లో జీవితం మొదలుపెట్టారు. ప్రైవేటు ఉద్యోగం చేసిన వినయ్ ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. శిరీష ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా ఉద్యోగం చేస్తోంది. 2019లో వారికి ఓ పాప జన్మించింది. అని తెలిపారు

## కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి

# అంజిరెడ్డి గెలుపు

- ఓటమి తేలడంతో కౌంటింగ్ హాలు నుండి వెళ్లిపోయిన నరేందర్ రెడ్డి
- బీజేపీ నేతలు, కార్యకర్తలు కలిసి తనను గెలిపించారన్న అంజిరెడ్డి
- మోదీ ప్రభావంతో బీజేపీ అభ్యర్థులం విజయాలు సాధిస్తున్నామని వ్యాఖ్య
- కాంగ్రెస్‌కు కౌంట్ డౌన్ ప్రారంభమైందన్న బండి సంజయ్




కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించారు. రెండో ప్రాధాన్యత ఓట్లతో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిపై విజయం సాధించారు. తన ఓటమి తేలడంతో నరేందర్ రెడ్డి కౌంటింగ్ హాలు నుండి బయటకు వెళ్లిపోయారు. కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మూడు రోజుల పాటు ఉత్కంఠగా సాగింది. బీజేపీ అభ్యర్థి విజయాన్ని ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి 78,635 ఓట్లు రాగా, రెండో స్థానంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి 73,644 ఓట్లు వచ్చాయి. 63,404 ఓట్లతో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మూడో స్థానంలో నిలిచారు.

**అందరూ కలిసి నన్ను గెలిపించారు: అంజిరెడ్డి**

బీజేపీ నేతలు, కార్యకర్తలంతా కలిసి తనను గెలిపించారని గెలుపొందిన అభ్యర్థి అంజిరెడ్డి అన్నారు. విజయం కోసం కృషి చేసిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభావంతో బీజేపీ అభ్యర్థులం విజయాలు సాధిస్తున్నామని అన్నారు.

**కాంగ్రెస్‌కు కౌంట్ డౌన్ ప్రారంభమైంది: బండి సంజయ్**

అంజిరెడ్డి గెలుపు కోసం చాలామంది కష్టపడ్డారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇక్కడ గ్రాడ్యుయేట్, టీచర్స్ రెండు ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థులే గెలిచారని, ఇది చాలా సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. కిషన్ రెడ్డి నేతృత్వంలో ఇది తమకు నాలుగో విజయమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది మంది ఎంపీలు, నిన్న టీచర్, నేడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. మోదీ నీతి, నిజాయతీతో కూడిన పాలనను గుర్తించి ప్రజలు పట్టం గడుతున్నారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు ఇన్నాళ్లు ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్నారని, ఇప్పుడు బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి కౌంట్ డౌన్ మొదలైందని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటూ బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల అమలు, ఉద్యోగాల భర్తీ, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. అంజిరెడ్డి గెలుపు నేపథ్యంలో కరీంనగర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. అక్కడకు వచ్చిన బండి సంజయ్‌కి అంజిరెడ్డి స్వాగతం పలికారు. బండి సంజయ్, అంజిరెడ్డిలను కార్యకర్తలు తమ భుజాలపై కూర్చోబెట్టుకొని ఊరేగించారు.

## భారత్ పై విధించిన ప్రతీకార సుంకాలు వచ్చే నెల నుంచి అమలు

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

వార్తా 2 లో

# గుర్తింపులేని హీరోలు

హృదయంలో ఊటగా ఎగిసిపడిన ఆనంద తరంగాలు చిరునవ్వు రూపంలో బయట పడతాయి. మనకు నచ్చిన వారితో మనసారా నవ్వడం ఓ అద్భుత అవకాశం. పకపక నవ్వితే నోటి దుర్వాసన వస్తుందేమో అంటూ వెనక్కి తగ్గడం సహజంగానే జరుగుతుంది. నోటి దుర్వాసన, పంటి అపరిశుభ్రతల మూలంగా పౌరసమాజంలో ముందుకుపోలేక, వెనక్కి తగ్గలేక సందిగ్ధంలో మునిగిపోతుంటాం. నోటి పరిశుభ్రత, దంతాల ఆరోగ్య పరిరక్షణలకు మనం తగు జాగ్రత్తలు తీసుకోవడం, దంత లేదా నోటి అనారోగ్యం కలిగితేనే డెంటిస్టును లేదా దంత వైద్యున్ని సంప్రదిస్తాం. వైద్య వృత్తిలో తగు ప్రాధాన్యం లేని దంత వైద్యుల సేవలను సమాజం తగు రీతిలో గుర్తించలేదు. అలాంటి దంత వైద్యులు అజ్ఞాత హీరోల వలె సమాజంలో "అన్‌సంగ్ హీరోల" వలె విలువైన సేవలను అందిస్తున్నారు. నోరు, దంతాలు, చిగుర్ల ఆరోగ్య పరిరక్షణలో అవిశ్రాంత సేవలను అందిస్తున్న డెంటిస్టుల అమూల్య సేవలను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 06 మార్చిన "జాతీయ దంత వైద్యుల దినోత్సవం" లేదా "నేషనల్ డెంటిస్ట్ డే"ను పాటించడం 2013 నుంచి ఆనవాయితీగా మారింది. దంతాలు, చిగుర్లు, నోటి పరిశుభ్రత కొరవడితే పలు రకాలైన అనారోగ్యాలు కలగడం, పంటి నొప్పులు బాధ పెట్టడం జరిగినపుడు దంత ఆరోగ్య పరిరక్షణ, నోటి పరిశుభ్రత, చిగుర్ల ఆరోగ్యం లాంటి అంశాలను సామాన్య ప్రజలకు అవగాహన కల్పించడం, తొలి దశలోనే రోగనిర్ధారణ చేయడం, చికిత్సలు, ముందు జాగిరత్తలు లాంటి అతి విలువైన సేవలను డెంటిస్టులు కల్పిస్తున్నారు. నోటి, దంత ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన, వ్యాధుల నివారణ, దంత అనారోగ్యాల చికిత్సలు, కాస్మటిక్ డెంటిస్ట్రీ, సంపూర్ణ ఆరోగ్య సిద్ధి లాంటి లక్ష్యాలను ఛేదించడంలో దంత వైద్యులు అంకితభావంతో అమూల్య సేవలను అందిస్తున్నారు. నిత్యం రెండు సార్లు ఉదయం/ రాత్రి నిద్రకు ముందు దంతాలను సాఫ్ట్ బ్రష్‌తో శుభ్రం చేసుకోవడం, ఆహార ఆహారానికి మధ్య ఏ రకమైన ఆహారం తీసుకోకపోవడం, దంతాల్లో ఆహారం చిక్కుకోకుండా జాగ్రత్త పడడం లేదా చిక్కుకున్న వాటిని శుభ్రం చేసుకోవడం నాలుకను శుభ్రం చేయడం, తిన్న తర్వాత నోటిని జాగ్రత్తగా శుభ్రం చేసుకోవడం లేదా నీటితో పుక్కిలించి ఉంచేయడం, ప్రతి 3 లేదా 4 మాసాలకు ఒకసారి టూత్ బ్రష్‌ను మార్చి వేయడం, ఓరల్ సెక్స్‌లో తగు రక్షణ తీసుకోవడం, ఆడుతున్న సమయాల్లో మౌత్ గార్డ్‌లను వాడడం, గర్భవతులు తప్పనిసరిగా ప్రసవానికి ముందు దంత వైద్యుల సలహాలు తీసుకోవడం, ఏడాదికి రెండు పర్యాయాలు దంత వైద్యులను సంప్రదించడం, పోషకాహారం తీసుకోవడం, అతి శీతల పదార్థాలకు దూరంగా ఉండడం, పొగాకు లాంటి దురలవాట్లకు దూరంగా ఉండడం లాంటి జాగ్రత్తలు దంత ఆరోగ్యాలకు పునాదులుగా పని చేస్తాయి. అంకితభావంతో అమూల్య సేవలను అందిస్తున్న డెంటిస్టులకు కృతజ్ఞతలు తెలపడం, తగు రీతిలో సన్మానాలు చేయడం, ఉచిత దంత వైద్య శిబిరాలను నిర్వహించడం, కృతజ్ఞతాపూర్వకంగా కానుకలు అందజేయడం, డెంటిస్టు వద్దకు వెళ్లడానికి ప్రణాళికలు వేసుకోవడం, విద్యాలయాల్లో అవగాహనలు కల్పించడం లాంటి కార్యక్రమాలను జాతీయ దంత వైద్యుల దినం వేదికగా చేయవచ్చు. ప్రతి ఏట 09 ఫిబ్రవరిన అంతర్జాతీయ దంత వైద్యుల దినం కూడా పాటించుట జరుగుతోంది. నేటి డిజిటల్ యుగంలో దంత వైద్యం నవ్య టెక్నాలజీలను ఆకళింపు చేసుకొని చికిత్సా పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులకు లోనవుతున్నది. మన ఆరోగ్య కర చిరునవ్వుకు కారణమైన తెర వెనుక హీరోలుగా దంత వైద్యులు చేస్తున్న నసేవలకు తగు విధంగా కృతజ్ఞతలు తెలియజేయడం మన కనీస ధర్మం. పౌర సమాజ నోటి శుభ్రతే లక్ష్యంగా డెంటిస్టులు చేస్తున్న సేవలను గుర్తించి మన కృతజ్ఞతలను, మన అభిమానాలను వారి పై కుమ్మరిద్దాం, ఆరోగ్యకర చిరు నవ్వులతో జీవితాంతం అనుక్షణం ఆస్వాదిద్దాం.

## హిందీ భాష వ్యాప్తికి మోటూరి ఎనలేని సేవలు

మోటూరి సత్యనారాయణ హిందీ భాష ప్రచారానికి ఎనలేని సేవలు అందించిన విద్యావేత్త. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన భారత రాజ్యాంగ సభలో సభ్యులు. 1966 వరకు రాజ్యసభ (భారత ప్రభుత్వ ఎగువ సభ) లో నామినే టెడ్ సభ్యులు. భారత రాజ్యాంగం లో హిందీని అధికారిక భాషగా మార్చడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. రాజభాష కమిషన్ సభ్యులుగా, స్వాతంత్ర్య సమర యోధులుగా, రాజ్యసభ సభ్యులు గా, హిందీ వికాస సమితి స్థాపకులు గా, హిందీ ప్రచార సభ ప్రధాన కార్యదర్శిగా, బహుభాషా వేత్తగా బహుముఖ సేవలు అందించిన ప్రతిభా శాలి. భారత ప్రభుత్వ పద్మశ్రీ, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత. మోటూరి సత్యనారాయణ (ఫిబ్రవరి 2, 1902 – మార్చి 6, 1995) 1902, ఫిబ్రవరి 2 వ తేదీన కృష్ణా జిల్లా దొండపాడు గ్రామంలో పెద పిచ్చయ్య, రత్తమ్మ దంపతు లకు జన్మించారు. ప్రాథమిక విద్య అనంతరం తెలుగు, సంస్కృతం అభ్యసించారు. ఆంధ్ర జాతీయ కళాశాలలో ఉన్నతులైన గురువుల వద్ద శిక్షణ పొంది హిందీ బాగా అభ్యసించారు. తర్వాత ఇంగ్లీషు, తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ మొద లైన భాషలు కూడా నేర్చుకున్నారు. ఆయనకు రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, ఐతిహాసిక, వైజ్ఞానిక, సాంకేతిక విషయాలలో లోతుగా ప్రవేశం ఉండేది. అయన హిందీ ప్రచారంతో జీవితాన్ని ప్రారంభించి క్రమంగా సంఘటకులుగా, కార్య దర్శిగా, చివరకు 1938లో హిందీ ప్రచార సభకు ప్రధాన కార్యదర్శి అయి 1961 వరకు కొనసాగారు. ఆ సంస్థ ప్రథమ ప్రధాన కార్యదర్శి పండిత హరి హర శర్మకు కుడి భుజంగా ఉండి సహకరించారు. అయన దూరదృష్టి, అవగాహన వల్లనే ఈ సభ హిందీ సాహిత్య సమ్మేళనం, ప్రయాగవారి బంధనం నుండి విముక్తి పొంది 1927లో స్వతంత్ర సంస్థగా ఆవిర్భవించింది. మోటూరి ప్రధాన కార్యదర్శిగా ఉన్నంతకాలం దక్షిణ భారత హిందీ ప్రచార సభ చరిత్రలో సువర్ణా క్షరాలతో లిఖింప దగినది. 1936లో ప్రచారసభకు 4 రాష్ట్రాలలో, 4 ప్రాంతీయ శాఖల నిర్మాణం అయన దూరదృష్టిని నిరూపిస్తుంది. మోటూరి సత్య నారాయణ... మహాత్మాగాంధీ, రాజేంద్ర ప్రసాద్ లకు అత్యంత విశ్వాస పాత్రులు. 1946లో జరిగిన సభ రజతోత్స వానికి బాపూజీ 12 రోజులు ఉండి సమావేశాలు జరిపించారు. ప్రతి దినం గాంధీ ప్రార్థనా సమావేశాలలో వేలాది మంది పాల్గొనేవారు. మద్రాసు కార్పొరేషన్ నుండి త్యాగరాయ నగరంలో సుమారు ఐదున్నర ఎకరాల భూమిని సంపాదించి అప్పటి అవసరాల కనుగుణంగా భవనాలను నిర్మిం చారు. ముద్రణాలయం, పుస్తక ప్రచురణ, పరీక్షలు నిర్వహించడం ద్వారా ఆదాయం సమకూర్చారు. హిందీ ప్రచారాన్ని పెంపొందించ డానికి ప్రతి రాష్ట్రంలోను, కొన్ని జిల్లాలలోను, మండలాల వారీగా సంరక్షకులను ఏర్పాటుచేసి నూతన ప్రణాళికల ద్వారా దక్షిణ భారత మంతా మారుమూలల వరకు హిందీని వ్యాపింప జేశారు. మోటూరి నేతృత్వ కృషి ప్రజలలో హిందీ పట్ల ప్రేమ, గౌరవం పెంచింది. 1942 లో క్విట్ ఇండియా ఉద్యమం లో జైలు శిక్ష అనుభ వించారు. స్వాతంత్ర్య సమర యోధులుగా తామ్రపత్ర గ్రహీతలయ్యారు. రాజకీయ రంగంలో కూడా విలువైన సేవలు అందించారు. భారత రాజ్యాంగ చట్టంలో 17వ భాగం రాజభాష అధ్యాయ నిర్మాణంలోను, దాని డ్రాఫ్టింగ్, రాజ్యాంగ సభలో నెగ్గించడంలో అయన కృషి, సహకారం ఎంతో ఉన్నాయి. రాష్ట్ర పతి ద్వారా 1954 నుండి 1966 వరకు వరుసగా రెండుసార్లు రాజ్య సభ సభ్యుడిగా నామినేట్ చేయ బడ్డారు. 1956లో రాజభాషా కమి షన్ కు సభ్యులుగా పని చేశారు. తెలుగు భాషా సమితి స్థాపక కార్యదర్శిగా "తెలుగు విజ్ఞాన సర్వస్వం" 16 భాగాలలో ప్రచురిం చారు. అదే విధంగా హిందీ వికాస సమితిని కూడా స్థాపించి హిందీలో "విశ్వవిజ్ఞాన సంహిత" పేరుతో హిందీ విజ్ఞాస సర్వస్వాలను ప్రచురింప చేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనను కళాప్రపూర్ణతో గౌరవిస్తే, కొన్ని విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్ తో సన్మానించాయి. భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ (1958), పద్మభూషణ్ (1962) పురస్కారాల్ని ఇచ్చి గౌరవించింది. అయన సేవలను పురస్కరించు కుని హైదరాబాదులో రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన 1957లో పెద్ద ఎత్తున అభినందన సభ జరిపి అభినందన గ్రంథం సమర్పించారు. ఆయన 1995 సంవత్సరం మార్చి 6 వ తేదీన పరమపదించారు.

# సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాత

రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు పిఠాపురం సంస్థానా న్ని పరిపాలించిన వారిలో చివరి వాడు. సాహిత్య చక్రవర్తి, కళా ప్రపూర్ణ, సాహిత్య పోషకులు, డాక్టర్ రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దర్ 1907–1948 పిఠాపురం సంస్థానా ధీదులుగా ప్రసిద్ధులు. ఆయన 1885, అక్టోబర్, 5 న మంగాయ మ్మ, రావు వేంకట మహీపతి గంగాధర రామారావు దంపతులకు జన్మించాడు. ఐదు సంవత్సరాల వయసు వచ్చే సమయానికి తండ్రి మరణించాడు. అప్పుడు గంగాధర రామారావు దత్తపుత్రుడు వారసు డు కాదని, రాజ్యాధికారం తనదే అని కోర్టుకు ఎక్కాడు. ఈ వ్యాజ్యం ఎక్కువ రోజులు నడిచి చివరకు విజయలక్ష్మి ఆయననే వరించింది. ఈ వ్యాజ్యం కోర్టులో ఉన్నంత కాలం, అనంతరం ఆయన మైనారి టీ తీరేవరకు ఈ సంస్థానం కోర్ట్ ఆఫ్ వార్డ్స్ అధీనంలో ఉంది. ఈ సమయంలో ఆయన మద్రాసు లోని న్యూయింగ్టన్ కళాశాలలో ఉండి విద్యాభ్యాసం చేశాడు. ఈ సమయంలోనే సంస్కృతం, తెలు గు, కన్నడం, తమిళం, ఆంగ్ల భాష లను నేర్చుకుని ఈ ఐదు భాషలలో ఉత్తమ గ్రంథాలను పఠించాడు. తెలుగు, ఇంగ్లీషు భాషలలో కవిత్వం చెప్పగలిగే నేర్పును సంపా దించాడు. తర్వాత నూజివీడు సంస్థానాధిపతియైన రాజా వెంకట రంగయ్యప్పారావు ప్రథమ పుత్రిక అయిన ఆండాళమ్మను 1906, ఏప్రిల్ 2 న వివాహం చేసుకున్నాడు. వంశాచారమును బట్టి ఆండాళమ్మ అత్తింటికి వచ్చిన వెంటనే చిన్నమాంబా దేవిగా తన పేరును మార్చుకున్నది. తర్వాత 1907, ఫిబ్రవరి 19 న పిఠాపురం సంస్థానపు సింహాసనాన్ని అధిష్టిం చాడు. 1948లో సంస్థానాలు, జమీందారీ వ్యవస్థ రద్దయ్యే వరకు ఇతడు పిఠాపురం మహారాజుగా వెలుగొందాడు. ఆయనకు చిన్న మాంబా దేవి ద్వారా మొదట 1910లో గంగాధర రామారావు అనే పుత్రుడు జన్మించాడు. తర్వాత వారికి సూర్యారావు అనే కుమారుడు, మంగయమ్మ, భావ యమ్మ, సీతాదేవి, కమలాదేవి అనే కుమార్తెలు కలిగారు. ఆయన కుమార్తె సీతాదేవి బరోడా సంస్థాన పు మహారాణి అయ్యింది. రాజా సూర్యారావు గారు 79 సంవత్స రాలు జీవించి 1964, మార్చి 6 వ తేదీన మరణించాడు. ఆయన తన తండ్రిచేత స్థాపించ బడిన పిఠాపురం హైస్కూలు, కాకినాడ కాలేజీలను అమితమైన ధనం వెచ్చించి అభివృద్ధి చేసి దక్షిణ ఆంధ్ర రాష్ట్రంలో అటువంటి విద్యాసంస్థలు మరొకటి లేదని పించాడు. కాకినాడ కాలేజీని ఫస్ట్ గ్రేడ్‌గా ఉద్ధరించి ఎన్నో భవనాలను కట్టించాడు. ఆ కాలేజీలో చదివే స్త్రీలకు, పేద విద్యార్థులకు ఉచితం గా చదువు చెప్పాడు. అంతే కాకుండా పట్టభద్రులై విదేశాలకు వెళ్లి, ఉన్నతవిద్య పొందగోరే వారికి సంపూర్ణ ధనసహాయం చేశాడు. పిఠాపురం హైస్కూలులో హరిజన విద్యార్థినీ విద్యార్థుల కోసం వసతి గృహాన్ని నెలకొల్పి దానికయ్యే వ్యయాన్ని అంతా తానే భరించా డు. వారికి ప్రైవేటు టీచర్లను కూడా ఏర్పరిచి అనేకమందిని వృద్ధిలోనికి తీసుకు వచ్చాడు. రాజమండ్రి లోని వీరేశలింగోన్నత పాఠశాల ఆయన పోషణతోనే నడిచింది. రఘుపతి వేంకటరత్నం నాయుడు ప్రేరణతో కాకినాడలో బ్రహ్మసమాజ ప్రార్థనా మందిరాన్ని, అనాథ శరణాలయాన్ని ఏర్పాటు చేశాడు. రాణీ చిన్నమాంబాదేవి కోరికపై కాకినాడ లేడీస్ క్లబ్‌కు 40 ఎకరాల స్థలాన్ని ఇచ్చాడు. రాణీ ఆధ్వర్యంలో పిఠా పురంలో ఘోషా స్కూలును నడిపాడు. 1920 ప్రాంతములో విశ్వకవి రవీంద్రనాథ టాగూరు పిఠాపురం సందర్శించి నప్పుడు ఇతడు సుమారు లక్షరూపాయలు పారితోషికంగా ఇచ్చాడు. ప్రాచ్య, పాశ్చాత్య విద్యలను సమదృష్టితో గౌరవించి వాటి అభివృద్ధికై ఎంతో ధనాన్ని వెచ్చించాడు. ఆయన ఔదార్యము తోనే తెలుగు దేశము లోని ఆనాటి ప్రతి సాహిత్య సంస్థ అభివృద్ధిని చెందింది. ఆంధ్ర భాషాభివర్ధినీ సమాజము, విజ్ఞాన చంద్రికా మండలి, ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాలలకు విశేషమైన ధన సహాయం చేశాడు. జయంతి రామయ్య స్థాపించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తును ప్రోత్సహించి సూర్యరాయాంధ్ర నిఘంటువు నిర్మాణానికి కారకుడైనాడు. అంతే కాకుండా ఎన్నో ప్రాచీన గ్రంథాలను పరిషత్తు ద్వారా లక్షల రూపాయలు వెచ్చించి ముద్రించారు. ఆయన సాహిత్య ప్రపంచానికి చేసిన సేవ అంతా ఒక ఎత్తు, సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాణానికి, ప్రచురణకు పాటుపడటం ఒక ఎత్తు. 1911, మే 12 న జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో జయంతి రామయ్య పంతులు నిఘంటు నిర్మాణానికి చేసిన ప్రతిపాదన విని, ఆ నిఘంటు నిర్మాణానికయ్యే మొత్తం వ్యయం భరించడానికి సంసిద్ధుడైనాడు. ఆ ప్రకటనకు సభలోని వారంతా ఆనంద పడ్డారు. జయంతి రామయ్య ఆధ్వర్యంలో ప్రారంభమైన నిఘంటువుకు "శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు" అని నామకరణం చేశారు. ఈ నిఘంటు నిర్మాణానికి కాశీభట్ట సుబ్బయ్య శాస్త్రి, తంజనగరము తేవప్పెరు మాళ్ళయ్య, పురాణపండ మల్లయ్య శాస్త్రి, పేరి పాపయ్య శాస్త్రి, శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి, కూచి నరసింహం, చర్ల నారాయణ శాస్త్రి, పిశుపాటి చిదంబర శాస్త్రి, వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి, దర్భా సర్వేశ్వర శాస్త్రి, పిశుపాటి విశ్వేశ్వర శాస్త్రి, ప్రయాగ వేంకటరామ శాస్త్రి, అమలాపురపు విశ్వేశ్వర శాస్త్రి, బులుసు వేంకటే శ్వర్లు, చిలుకూరి వీరభద్ర శాస్త్రి, దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, చెఱుకుపల్లి అప్పారాయ శాస్త్రి, ఇంద్రగంటి సూర్య నారాయణ శాస్త్రి, చిలుకూరి విశ్వనాథ శాస్త్రి, ఆకుండి వేంకట శాస్త్రి, ఓలేటి సూర్యనారాయణ శాస్త్రి, పాలెపు వెంకటరత్నం, సామవేదం శ్రీరామమూర్తి శాస్త్రి, పన్నాల వేంకటాద్రిభట్ట శర్మ, దివాకర్ల వేంకటావధాని మొదలైన పండితులు పాటుపడ్డారు. పిఠాపుర సంస్థాన చరిత్రలో రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు కాలం స్వర్ణయుగంగా చెప్పుకోవచ్చు. ఆయన సంస్థానం లో ఆస్థాన పండితులుగా శ్రీపాద లక్ష్మీనరసింహ శాస్త్రి (తర్కశాస్త్రం), తాతా సుబ్బరాయ శాస్త్రి (వ్యాకరణం), చిలుకూరి నారాయణ శాస్త్రి, వేదుల సూర్యనారాయణ శాస్త్రి, గుదిమెళ్ల వేంకట రంగాచార్యులు (విశిష్టాద్వైతము), వడలి లక్ష్మీనారాయణ శాస్త్రి (వేదం), దెందుకూరి నరసింహ శాస్త్రి (వేదాంతం), తుమురాడ సంగమేశ్వర శాస్త్రి (సంగీతం) మొదలైన దిగ్దంతులు ఉండేవారు. ఈ పండితుల సహకారంతో ఆయన ప్రతి యేటా పీఠికాపుర సంస్థాన విద్వత్పరీక్షల పేరుతో విజయ దశమి నవరాత్రి ఉత్సవాల సందర్భంలో శాస్త్ర పరీక్షలు నిర్వ హించి, ఉత్తీర్ణులైన వారిని కానుకల తో సత్కరించేవాడు. ప్రబంధ రచనలో కూడా పోటీలు నిర్వహించే వాడు. ఆనాటి సుప్రసిద్ధ పండితులు ఎందరో ఈ పరీక్షలలో బహూకృతులైనవారే. పానుగంటి లక్ష్మీనరసింహారావు, వేంకట రామకృష్ణ కవులు ఆయన ఆస్థాన కవులుగా ఉన్నారు. వీరు కాక చిలకమర్తి లక్ష్మీనరసింహం, కందుకూరి వీరేశలింగం, టేకుమళ్ళ అచ్యుత రావు, దేవగుప్తాపు భరద్వాజము, పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి, శొంఠి భద్రాద్రి రామ శాస్త్రి, వేంకట పార్వతీశ కవులు, దాసరి లక్ష్మణకవి, వేదుల రామచంద్రకీర్తి, శ్రీరాం వీరబ్రహ్మకవి, మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి, కూచి నరసింహము, నడకు దుటి వీరరాజు మొదలైన ఎందరో కవులు ఆయన చేత సన్మాన సత్కారాలనుఅందు కున్నారు. 1929, జనవరి 29 న మద్రాసు గవర్నరు వెల్లింగ్టన్ ప్రభువు ఆయనకు మహారాజా అనే బిరుదును ఇచ్చి గౌరవించాడు.1938, అక్టోబరు 1 వ తేదీన ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు గౌరవ డి.లిట్. పట్టాను ప్రదానం చేశారు.1953లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించారు. రాజా సూర్యారావు గారు 79 సంవత్సరాలు జీవించి 1964, మార్చి 6 వ తేదీన మరణించాడు.

## అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా గుండాల తహసీల్దార్ కార్యాలయం

## చనిపోయిన వ్యక్తుల భూములే టార్గెట్.

**ప్రజాబలం ప్రతినిధి**యాదాద్రిగుండాల తహసీల్దార్ కార్యాలయం అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా మారింది. గుండాల మండలంలోని నూనెగూడెం గ్రామానికి చెందిన కప్పరి రామకిష్టయ్య 2017లో మరణించాడు. ఆయన పేరున గుండాల రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 450లో 0.08 గుంటలు, 451లో 0.15, 452 లలో 0.08 గుంటల భూమి ఉన్నది. రామకిష్టయ్యకు సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఇందిరమ్మ వారసులుగా ఉన్నారు. సదరు భూమిని వారసులకు తెలియకుండా.. నూనెగూడెం గ్రామానికి చెందిన "మలిపెద్ది రజిత" తానే వారసురాలినని.. 0.31గుంటల భూమిని 2022లో రెవెన్యూ అధికారులతో కలిసి ఫౌతి విరాసత్ చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రామకిష్టయ్య వారసులు.. తహసీల్దార్ కార్యాలయంలో 2023 జనవరి 29న రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారు పట్టించుకోలేదు. ఫౌతి జరిగినట్లు తమకు నిజ ప్రతులు ఇవ్వాలని కోరినా ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కప్పరి రామకిష్టయ్య నుంచి మలిపెద్ది రజితకు ఫౌతి జరిగిన తర్వాత ఆమె నుంచి మలిపెద్ది సంజీవరెడ్డికి 0.08 గుంటలు, గండె నర్సయ్యకు 0.08 గుంటలు సేల్ డీడ్ ద్వారా విక్రయించారు. సంజీవరెడ్డి 0.08 గుంటల భూమిని తిరిగి తూనం రమేశ్ కు విక్రయించారని బాధితులు ఈసీలు చూపుతూ తమకు న్యాయం చేయాలని గుండాల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ నీలిమను వివరణ కోరగా.. తహసీల్దార్ జలకుమారి సెలవులో ఉన్నారని, ఫౌతి విషయం తనకు సోమవారం తెలిసిందని అన్నారు.

ఉన్నతాధికారులను సంప్రదించి రెండు రోజుల్లో డాక్యుమెంట్ వివరాలు అందజేస్తామని, పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు. కాగా, గుండాల రెవెన్యూ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారిందని, మారుమూల మండలంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. కొద్దిరోజుల కిందట ఇలాంటి ఘటనలోనే ఎన్ని ఎకరాల భూమి ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన విషయంలో తహసిల్దార్ జల

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం కరపత్రం విడుదల

**ప్రజాబలం ప్రతినిధి**నిర్మల్ మార్చి 5 మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఖానాపూర్ మండలంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకులు భాను బేగం అదిలాబాద్ జిల్లా నాయకురాలు రమ్య కళ ఆధ్వర్యంలో 115 వ కరపత్రం ను ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ . సుదాకార్ ,కార్యదర్శి కర్నాటి మల్లేష్ లు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుదాకార్ మాట్లాడుతూ శ్రామిక మహిళల పోరాటానికి చిహ్నం. అంతర్జాతీయ మహిళా దినోత్సవ మన్నారు.వందల ఏళ్ల కిందటే పని గంటలను తగ్గించాలని తాము అనుభవిస్తున్న దుర్భర పరిస్థితులను తామే మార్చుకోవడం కోసం మహిళలు వీధుల్లోకి వచ్చి కదం తొక్కిన రోజుకు గుర్తుగా మహిళా దినత్సోవం రూపొందించిందన్నారు. ఆ పోరాటాల స్ఫూర్తిని మరోసారి గుర్తు చేసుకుంటూ దేదీప్యమానమైన భవిష్యత్తు కోసం మహిళా సమాజం అడుగులు వేయడం కోసం సూర్తినికి పొందే రోజుగా దీన్ని నిర్వహించుకోవాల్సి ఉంటుంది. అయితే నేడు దురదృష్టవశాత్తు మహిళా దినోత్సవం అందించిన స్ఫూర్తి క్రమంగా కనుమరుగవుతున్నది. ఏ లక్ష్యం కోసం పోరు జరిగిందో, దేని కోసం పోరాటం జరగాలో అనే అంశాల కనీస ప్రస్తావన లేకుండా మహిళా దినోత్సవాల నిర్వహణ ఒక తంతుగా మారుతున్న పరిస్థితులు మార్చేసి మహిళలకు అందవలసిన స్ఫూర్తిని, వారికి చూపించాల్సిన నవయుగాన్ని కనుమరుగు చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సోషలిస్టు సమాజం వ్యవస్థాపకుడు కామ్రేడ్ లెనిన్ మహాశయుడు మహిళల సాధికారత గురించి చేసిన వ్యాఖ్యలను ఒక సారి గుర్తు చేసుకోవలసి ఉన్నది. మహిళా సమాజంలో నూతన వెలుగులు నిండాంటే స్త్రీలను వంటిల్లు అనే జీవరహిత వాతావరణం నుంచి బయటకు తెచ్చి సామాజిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం, రాజకీయాల్లోకి తీసుకుని రావడం చాలా ముఖ్యమన్న ఆలోచనలు విప్లవాత్మకమైనవి. "వంట గదికి పరిమితంగా చూడబడుతున్న మహిళలను అక్కడి నుంచి విముక్తం చేయకపోతే వారికి నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, సమానత్వాలు సాధ్యం కావనేది లెనిన్ ప్రతిపాదన. ప్రతి వంటకత్తె ఒక రాజకీయ వేత్త కావాలి అనే లోతైన అంశాలతో లెనిన్ అనేక ప్రసంగాలు, వ్యాసాలు కూడా రాశారు. ఇక్కడ మహిళలు రాజకీయ వేత్త కావాలి అంటే కేవలం పదవులు పొందడం కాదు, పదవుల కోసం ఉద్యమాలు నిర్వహించడమూ కాదు. 'సరైన రాజకీయ, ఆర్థిక, తాత్విక తుర్పుధాలును అలువల్చు కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఖానాపూర్ మండల అధ్యక్షులు పసుపుల మీన అమ్ముల కవిత ,ఎర్రన్న శిరీష ,పసుపుల మీనా,అరుణ ,అందుర్తి నర్సు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పనుల్లో బెజవాడ పోలీసులు

విజయవాడ, మార్చి 5, సోషల్ మీడియా, యూ ట్యూబర్లతో దోస్తీ చేస్తున్న బెజవాడ పోలీసులు ప్రజల వ్యక్తిగత గోప్యతతో చెలగాటాలు ఆడుతున్నారు. గత కొన్ని నెలలుగా సాగుతున్న ఈ వ్యవహారంలో కొందరు పోలీసులే వీడియోలు రికార్డు చేసి ప్రైవేట్ వ్యక్తులకు షేర్ చేయడం చర్చనీయాంశంగా మారింది.విజయవాడలో ట్రాఫిక్ చలాన్లు, నిబంధనల ఉల్లంఘన, హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపే వారిని పోలీసులు ప్రశ్నించే వీడియోలు ఇటీవల కాలంలో వైరల్ అవుతున్నాయి. మహిళలు, వృద్ధులు, ఉద్యోగుల వాహనాలను తనిఖీ చేసే సమయంలో నిబంధనల్ని ఉల్లంఘిస్తే వారికి జరిమానా విధిస్తున్నారు. జరిమానాలతో పాటు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారి వీడియోలను పోలీసులే సోషల్ మీడియాలో షేర్ చేయిస్తున్నారు.ట్రాఫిక్ నిబంధనల్ని కఠినంగా అమలు చేసే విషయంలో ఎవరికి అభ్యంతరం లేకున్నా, చలానాలను విధించే సమయంలో పోలీసులు బాడీ కెమెరాలతో రికార్డు చేస్తున్న వీడియోలు, మొబైల్ ఫోన్లలో రికార్డు చేసే వీడియోలను యూ ట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లతో షేర్ చేస్తున్నారు. ఈ తరహా వీడియోలు వైరల్ అవుతున్నాయి.తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని సైతం మీడియా ముందు ప్రవేశ పెట్టే సమయంలో ముసుగులు వేసి చూపించే పోలీసులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వారి విషయంలో వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ కూడళ్ల వద్ద సాధారణంగా విఐపి మూమెంట్ ఉంటే తప్ప పోలీసులు కనిపించరు. రద్దీ సమయాల్లో జనం ఎవరి బాధలు వారు పడాల్సిందే.ట్రాఫిక్ నియంత్రణ సంగతి ఎలా ఉన్నా నిత్యం ఉదయం, సాయంత్రం చలాన్లు రాయడం మాత్రం విధిగా చేపడుతున్నారు. ట్రాఫిక్ జరిమానాలు మార్చి 1 నుంచి గణనీయంగా పెరిగాయి. ఈ క్రమంలో ప్రతి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో పోటాపోటీగా చలాన్లు విధిస్తున్నారు. మద్యం సేవించి పట్టుబడే వారిని న్యాయస్థానంలో హాజరు పరిస్తే రూ.10వేల జరిమానాతో పాటు జైలు శిక్షలు కూడా విధిస్తున్నారు.ట్రాఫిక్ చలాన్లు వసూలు చేసే క్రమంలో పోలీస్ అధికారులు ఉద్దేశ పూర్వకంగా వాటిని సొంత పబ్లిసిటీ కోసం వాడుకుంటున్నారు. కానిస్టేబుళ్లతో వీడియోలు తీయించుకుని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు షేర్ చేస్తున్నారు. ఆ వీడియోల్లో హెల్మెట్ పెట్టుకోని యువతీ యువకుల్ని పోలీసులు మందలించడం, హెచ్చరించడం వంటివి కూడా ఉంటున్నాయి. జరిమానాలు చెల్లించక పోతే వాహనాలను సీజ్ చేస్తున్నారు.పోలీసులు రికార్డు చేసే వీడియోలను న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా మాత్రమే పరిగణించాల్సి ఉండగా పబ్లిసిటీ కోసం సోషల్ మీడియా వేదికలపై షేర్ చేయడం, వారి ముఖాలను అందరూ గుర్తించేలా షేర్ చేస్తున్నారు. పోలీసుల అధికారిక హ్యాండిల్స్‌లో కూడా మహిళలు, మైనర్ల ఫోటోలను ముఖాలను గుర్తించేలా షేర్ చేస్తున్నారు. పోలీసుల తనిఖీల సందర్భంగా యువతులు, విద్యార్థినులు, మహిళల్ని ప్రశ్నిస్తున్న ఫోటోలను బహిరంగ వేదికలపై షేర్ చేస్తున్నారు.విజయవాడ సీపీగా కాంతి రాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీలు ఉన్న సమయంలో సొంత పబ్లిసిటీ కోసం కొన్ని యూ ట్యూబ్ ఛానళ్లను ప్రోత్సహించారు. పర్సనల్ వీడియోలతో పబ్లిసిటీ చేయించడం, యువతలో గుర్తింపు తెచ్చుకోవడం కోసం వీటిని కొందరు అధికారులు ఉపయోగించే వారు. ఈ తరహా వీడియోలకు మిలియన్లలో వ్యూలు, వేలల్లో లైక్‌లు వస్తున్నాయి తద్వారా అయా ఛానళ్లకు భారీగా ఆదాయం కూడా లభిస్తోంది. ఏపీ పోలీస్ శాఖ వీడియోలను బయటి వారికి షేర్ చేయడం వాటితో ప్రైవేట్ వ్యక్తులకు ఆదాయం పొందడంపై అధికారులు కిమ్మనడం లేదు.పోలీస్ అధికారులు విధుల్లో ఉన్న సమయాల్లో క్లోజప్ షాట్స్, డ్రోన్ షాట్స్ తో సినిమాటిక్ ఎఫెక్ట్‌లతో పబ్లిసిటీ చేయించుకునే వారు. ఆ తర్వాత అధికారులు మారినా మిగిలిన వారు కూడా వాటిని అనుసరించడం మొదలు పెట్టారు. సీఐ స్థాయి అధికారుల నుంచి డీసీపీల వరకు ఇదే బాట పట్టారు. ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగమని తెలిసినా తీవ్ర నేరాలకు పాల్పడినట్టు సోషల్ మీడియాలో దోషులుగా చిత్రీకరిస్తున్నారు. ట్రాఫిక్ చలాన్ల విధించే సమయంలో రికార్డు చేస్తున్న వీడియోలను సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై షేర్ చేయడంపై విజయవాడ ట్రాఫిక్ డీసీపీ వివరణ కోరినా స్పందించలేదు.

# 5 ఎమ్మెల్సీ ఎన్నికలకు భారీగా ఆశావహులు

విజయవాడ, మార్చి 5, ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది. గ్రాడ్యుయేట్లు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడం, ఎమ్మెల్యేల కోటా భర్తీకి నోటిఫికేషన్ వెలువడటంతో అభ్యర్థుల ఎంపిక కసరత్తు మొదలైంది. జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని అంగీకారం కుదిరింది.ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక నేపథ్యంలో సోమవారం అసెంబ్లీలోని సీఎం ఛాంబర్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో నాగబాబు అభ్యర్థిత్వం ఖరారైనట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు సహా పలు అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు, అభ్యర్థుల ఎంపికపై ఇద్దరూ కొద్ది సేపు చర్చించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.ప్రస్తుతం ఎన్ని కలు జరగనున్న ఐదు స్థానాల్లో ఒక దానిని నాగబాబుకు ఇవ్వాలని నిర్ణయించారు. రాజ్యసభ ఎన్నికల సమయంలోనే నాగబాబు పేరు చర్చకు వచ్చింది. అంతకు ముందు టీటీడీ ఛైర్మన్ రేసులో కూడా వినిపించింది. రాజ్యసభ ఎన్నికల సమయంలో నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని ప్రకటించారు. సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కూర్చుని ఉండగా.. పవన్ కల్యాణ్ ఆయన వద్దకు వెళ్లారు.అసెంబ్లీలో కొద్ది నిమిషాలు మాట్లాడుకున్న తర్వాత ఇద్దరూ కలిసి సీఎం ఛాంబర్‌కు వెళ్లారు. బడ్జెట్లో వివిధ శాఖలకు కేటాయింపుల పై పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలు ముఖ్యమంత్రితో చెప్పినట్టు తెలుస్తోంది.మే నెల నుంచి ప్రారంభించే తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రహదా రుల పనులు చాలా వరకు చేశామని.. తాగునీటి సరఫరాపై ఎక్కువ దృష్టి పెట్టామని చంద్రబాబుకు పవన్ వివరించారు.ఉపాధి హామీ ద్వారా రాష్ట్రానికి ఎక్కువ నిధులు రాబట్టుకుని పెద్దఎత్తున పనులు చేయాల్సిన అవసరంపై చర్చించారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రికి పవన్ కల్యాణ్ సూచించారు.ప్రస్తుతం మండలిలో జనసేన తరపున పిడుగు హరిప్రసాద్ ఎమ్మెల్సీగా ఉన్నారు. అదే సామాజిక వర్గానికి చెందిన నాగబాబును ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. మంత్రి వర్గంలో ప్రస్తుతం పవన్‌తో పాటు కందుల దుర్గేష్ ఉన్నారు. నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని ఇప్పటికే ప్రకటించడంతో మూడో మంత్రి పదవి కూడా జనసేనలో అదే సామాజిక వర్గానికి దక్కనుంది.టీడీపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఆశిస్తున్న వారి జాబితా భారీగా ఉంది. ఎన్నికల పొత్తులో భాగంగా సీట్లు దక్కని వారంతా ఎమ్మెల్సీ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో మాజీ మంత్రులు కూడా ఉన్నారు. చంద్రబాబును, లోకేష్‌ను ప్రసన్నం చేసుకోడానికి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, అశోక్ బాబు వంటి నేతలుఎమ్మెల్సీ స్థానం కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.ఎమ్మెల్సీ ఆశిస్తున్న పలువురు నేతలు అసెంబ్లీలో చక్కర్లు కొడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను ప్రసన్నం చేసుకోవాలని తహతహలాడుతున్నారు. ఖాళీ అవుతున్న ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ సోమవారం మొదలైంది.యనమల రామకృష్ణుడు, బీటీ నాయుడు, ఆశోక్బాబు, దువ్వారపు రామారావు, జంగా కృష్ణమూర్తిల పదవీకాలం ఈ నెల 28తో ముగుస్తోంది. శాసనసభలో కూటమి పార్టీలకే అన్ని స్థానాలను దక్కించుకునే అవకాశం ఉంది. ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో మిగిలిన నాలుగు స్థానాలపై పోటీ తీవ్రంగా ఉంది. బీజేపీ కూడా ఒక స్థానాన్ని కోరే అవకాశం ఉంది.మాజీ మంత్రులు కేఎస్ జవహర్, పీతల సుజాత, కేఈ ప్రభాకర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, విశాఖకు చెందిన మహ్మద్ నజీర్ అసెంబ్లీలో దర్శనం ఇచ్చారు. దువ్వారపు రామారావుకు మళ్లీ అవకాశం కల్పించాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరాలని విశాఖ జిల్లాకు చెందిన ఎమ్మె ల్యేలు రాత్రి సమావేశమై నిర్ణయించారు. శాసనసభ ఎన్నికల్లో పొత్తులతో పోటీ చేసే అవకాశం కోల్పోయిన వారంతా ఎమ్మెల్సీ కోసం పోటీపడుతున్నారు.

# జనసేనలో ఇమడలేకపోతున్న బాలినేని

ఒంగోలు, మార్చి 5 వైసీపీ మాజీ నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి రాజకీయంగా పునరాలోచనలో పడినట్లు తెలిసింది. 2024 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలయిన తర్వాత బాలినేని శ్రీనివాసులు రెడ్డి వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన అనూహ్యంగా జనసేన కండువా కప్పుకున్నారు. జనసేనలో చేరిన తర్వాత తనకు ప్రాధాన్యత దక్కుతుందని బాలినేని భావించారు. కానీ పెద్దగా ప్రయారిటీ దక్కకపోవడంపై ఇటీవల ఆయన తన సన్నిహితులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు తెలిసింది. ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్ష పదవి కూడా తాను సూచించిన వారికి ఇవ్వకపోడంపై బాలినేని శ్రీనివాసులు రెడ్డి కొంత మనస్థాపానికి గురయ్యారని చెబుతున్నారు. ఇటీవల వైసీపీకిచెందిన కార్పొరేటర్లను జనసేనలో చేర్చినప్పటికీ తనకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆయన మనస్తాపానికి గురయినట్లు తెలిసింది బాలినేని శ్రీనివాసులు రెడ్డి కాంగ్రెస్, తర్వాత వైసీపీలో సుదీర్ఘకాలం పనిచేశారు. ఒంగోలు శాసనసభ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1999, 2004, 2009, 2012, 2019 ఎన్నికలలో ఆయన ఒంగోలు నియోజకవర్గం నుంచి గెలిచారు. అయితే టీడీపీ, జనసేన కూటమి ఏర్పాటుతో 2014 ఎన్నికల్లో దారుణ ఓటమి చవి చూశారు. కానీ ఈవీఎంలలో తేడా ఉందని ఆయన ఎన్నికల కమిషన్ ను, న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ విషయంలో వైసీపీ పార్టీ నాయకత్వం తనకు అండగా నిలబడలేదన్న అసంతృప్తితో బాలినేని ఉన్నారు. మరొక వైపు మంత్రివర్గ విస్తరణలో తనను తొలగించడంపై కూడా బాలినేని శ్రీనివాసులు రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి అసంతృప్తితో ఉన్న ఆయనకు తన బంధువు వైవీ సుబ్బారెడ్డి నుంచి కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. జగన్ వద్ద వైవీకి ప్రాధాన్యత పెరుగుతుండటంతో ఆయన తట్టుకోలేకపోయారు. సన్నిహితులు, కుటుంబ సభ్యులు వారిస్తున్నా ఆయన వినకుండా వైసీపీని వదిలి వెళ్లారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి దగ్గర బంధువు అయిన బాలినేని శ్రీనివాసులు రెడ్డి పార్టీని వీడటంతో జగన్ కు కొంత ఇబ్బంది అయినప్పటికీ ఆయనను ఆపే ప్రయత్నం మాత్రం చేయలేదు. ఆ కోపం మీద జనసేనలో చేరారు. కానీ జనసేనలోనూ తన మాట చెల్లుబాటు కాకపోవడం, జిల్లాలోనూ, ఒంగోలు నియోజకవర్గంలోనూ ఎవరూ తనను పట్టించుకోవడం లేదన్న బాధ బాలినేనిలో కనపడుతుంది.. అయితే జనసేన నుంచి బయటకు వచ్చేందుకు బాలినేని శ్రీనివాసులు రెడ్డి ఇప్పట్లో ప్రయత్నించకపోవచ్చు. ఇంకా ఎన్నికలకు సుదీర్ఘ సమయం ఉండటంతో తాను బయటకు వచ్చినా ప్రయోజనం ఉండదని ఆయనకు తెలుసు.

అదే సమయంలో జనసేన లో ఉంటే కొంత సేఫ్ గా ఉంటానని బాలినేని భావిస్తుండవచ్చు. బాలినేని శ్రీనివాసులు రెడ్డిపై ఇప్పటికే ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కత్తులు నూరుతున్నారు. ఆయన నుంచి తనతో పాటు క్యాడర్ ను కాపాడుకోవాలంటే జనసేన లో కొన్నాళ్లు కాలం వెళ్లదీయక తప్పదని సన్నిహితుల వద్ద బాలినేని శ్రీనివాసులు రెడ్డి చెప్పినట్లు తెలిసింది. అయితే ఆయన వైసీపీలో మళ్లీ చేరతారన్న ప్రచారం మాత్రం ఒంగోలులో ఊపందుకుంది. కానీ కొంతకాలం వెయిట్ చేసిన తర్వాత మాత్రమే బాలినేని నిర్ణయంతీసుకునే అవకాశముందనిఆయనసన్నిహి?తుల తెలిపారు.

**కాణిపాకం లో రోజా పూజలు**

చిత్తూరు జిల్లాలోని కాణిపాకం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం స్వయంభు వెలసిన వరసిద్ధి వినాయక స్వామి ని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు మాజీ మంత్రి రోజా.ఈ సందర్భంగా స్వామి వారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశాసి వేద మంత్రాలతో మాజీ మంత్రి రోజా పండితులు ఆశీర్వదించారు.

# గందరగోళంగా మారిన టౌన్ ప్లానింగ్

నెల్లూరు, మార్చి 5, ఏపీ మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పేది ఒకటి ఆ శాఖలో జరిగేది మరొకటి? ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణ రంగానికి ఊతం ఇచ్చేలా పలు నిర్ణయాలను .నారాయణ ప్రకటించారు. వంద గజాల్లోపు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మొదలుకుని అపార్ట్‌మెంట్ల నిర్మాణం వరకు భవన నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు పలు నిర్ణయాలను ప్రకటించారు. అయితే మంత్రి నారాయణ చెప్పిన వాటిలో ఇప్పటి వరకు ఒక్క నిర్ణయం కూడా అమలు కాలేదు. తాజాగా గత వారం హైకోర్టు ఆదేశాలతో? పురపాలక శాఖ భవన నిర్మాణ నిబంధనలు మరింత కఠినతరం చేసింది.ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విషయంలో ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల్ని ఉల్లంఘిస్తే మరింత కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పిన దానికి ఆ శాఖలో క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలకు పొంతన కుదరడం లేదు. దీనిపై భవన నిర్మాణ రంగంలో ఉన్న వారి నుంచి బహిరంగంగానే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.తాజాగా భవన నిర్మాణదారుల కోసం అందుబాటులోకి వచ్చిన కొత్త సాఫ్ట్ వేర్ తీసుకొచ్చినట్టు మంత్రి నారాయణ ప్రకటించారు. 18 మీటర్ల ఎత్తు లోపు నిర్మించే భవనాలకు స్వీయ ధ్రువీకరణ పత్రం సరిపోతుందని టౌన్ ప్లానింగ్ అధికారులతో సంబంధం లేకుండా సరైన పత్రాలు సమర్పిస్తే ఆటోమెటిక్ గా అనుమతులు మంజూరవుతాయని ప్రకటించారు. ఈ విధానం 2019 నాటికి విజయవాడలో అమల్లో ఉంది. అయితే ఆటోమేటిక్ అనుమతుల జారీ విధానాన్ని పూణేకు సంబంధించిన కంపెనీకి అప్పట్లో అప్పగించారు. ప్రభుత్వం భవన నిర్మాణదారులకు ఎవరి జోక్యం లేకుండా ఈ అనుమతులు జారీ చేసే ఉద్దేశంతో సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెడితే అందులో కూడా టౌన్ ప్లానింగ్ వేలు పెట్టింది.కార్పొరేషన్ల పరిధిలో అధికారుల్ని ప్రసన్నం చేసుకుంటేనే ఆన్‌లైన్‌లో అనుమతి జారీ అయ్యేలా మార్పులు చేశారు. దీంతో గత ఐదేళ్లలో భవన నిర్మాణదారులు నరకం అనుభవించారు. అన్ని రకాల ఫీజులు చెల్లించినా కొర్రీలు వేసి ముప్పు తిప్పలు పెట్టేవారు. మునిసిపల్ కమిషనర్లను కూడా ఖాతరు చేయకుండా టౌన్ ప్లానింగ్ విభాగం వ్యవహరించేది.

సెల్ఫ్ సర్టిఫికేషన్ సరిపోతుందా??

భవన నిర్మాణాలకు అనుమతుల విషయంలో స్వీయ ధృవీకరణ సరిపోతుందని గత నెలలో జీవో జారీ చేశారు. ఆ తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విషయంలో మరికొన్ని నిబంధనలు విధించారు.తాజాగా రిజిస్టర్డ్ ఇంజినీర్లు,ఆర్కిటెక్ట్ లు యజమానుల సమక్షంలో ఆన్ లైన్ లో సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇస్తే సరిపోతుందని ప్రకటించారు. భవన నిర్మాణ అనుమతులను త్వరితగతిన జారీ చేసేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి నారాయణ చెబుతున్నారు. ౦ఖఆఖటా పోర్టల్ లో సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానం అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. అయితే భవన నిర్మాణాలను కొనసాగించడానికి కార్పొరేషన్ల పరిధిలో మార్టగేజ్ చేయాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే తనఖా పెట్టిన భాగాలను జప్తు చేయడంతో పాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విడుదల కాదు.ఏపీలో 2019 నాటికి 250కు మించిన స్థలంలో 18మీటర్ల ఎత్తు వరకు భవనాలను నిర్మించుకనే వెసులుబాటు ఉంది. ఆ తర్వాత నిర్ణత బాండ్లను చెల్లించి ఆరో అంతస్తు నిర్మాణం చేపట్టేందుకు కూడా వైసీపీ ప్రభుత్వంలో అనుమతులిచ్చారు. దీంతో 250-30గజాల్లోపు స్థలాల్లో ఆరంతస్తుల వరకు నిర్మాణాలను చేపట్టే అవకాశం లభించింది.ఇకపై 18 మీటర్ల లోపు లేదా ఐదంతస్తుల లోపు భవనాల నిర్మాణాల అనుమతులకు స్వీయ ధృవీకరణ పత్రం ఇస్తే సరిపోతుందని ...టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి అవసరం లేకుండానే భవన నిర్మాణాలకు పర్మిషన్ వచ్చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది.భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్ టీపీలు,ఇంజినీర్లు లేదా ఆర్కిటెక్ట్ ల సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి స్వీయ ధృవీకరణ(అఫిడవిట్)ఇవ్వాల్సి ఉంటుందని మెలిక పెట్టారు. గత నెలలోనే భవన నిర్మాణ అనుమతులకు కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది.భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీ చేసేలా ఈ కొత్త విధానాన్ని సర్కార్ అందుబాటులోకి తీసుకొచ్చిందని మంత్రి నారాయణ చెబుతున్నారు. సెల్ఫ్ సర్టిఫికేషన్ ద్వారా నిర్మాణాలకు అనుమతులిచ్చేందుకు అవసరమైన సాఫ్ట్ వేర్ ను ౦ఖఆఖటా పోర్టల్ లోకి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ విధానం ఆమోదం పొందిన లేఅవుట్లు, గ్రామ కంఠం,సర్కులేషన్ ప్లాన్లు ఉన్న ప్రాంతాలు,1985 కు ముందు నిర్మించిన భవనాల పునర్మిణానానికి ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు.

టౌన్ ప్లానింగ్‌పై తీవ్ర విమర?శలు..

ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళిక విభాగం పనితీరుపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా విజయవాడ, విశాఖపట్నం వంటి మునిసిపల్ కార్పొరేషన్లలో భవన నిర్మాణాలకు అనుమతులు, ప్లాన్ మంజూరు అంటే ముడుపులతో కూడుకున్న వ్యవహారంగా మారిపోయింది. ఏ ఫీజు ఎంత వసూలు చేస్తారనే వివరాలు ఎవరికి దొరకవు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది చెప్పినంత చెల్లించాల్సిందే. నిర్ణీత ఫీజులు చెల్లించినా టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ప్రసన్నం చేసుకోకపోతే వారిని ముప్పు తిప్పలు పెడతారు. ప్లాన్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే దగ్గర నుంచి దానికి ఫీజులు జనరేట్ అయ్యే వరకు రకరకాల కొర్రీలు వేసి వేధింపులకు గురి చేస్తుంటారు.ఇక ఖాళీ స్థలాలు కట్టే నిర్మాణాలకు ఆ స్థలం కొన్నప్పటి నుంచి వేకెంట్ ల్యాండ్ టాక్స్ వసూలు చేస్తారు. మధ్యలో ఎందరి చేతులు మారినా అది రికార్డుల్లో ఎక్కినప్పటి నుంచి నిర్మాణదారులు పన్ను చెల్లించాల్సి వస్తోంది. భవన నిర్మాణాలు పూర్తై అవి అమ్ముడుపోయే వరకు ఖాళీగా ఉన్న కాలానికి కూడా ఏపీలో పన్నులు వసూలు చేస్తున్నారు.పాత ఇళ్లను కూల్చి నిర్మాణాలు చేపడితే నిర్మాణం జరిగే సమయానికి కూడా వేలకు వేలు పన్నులు వసూలు చేస్తున్నారు. పాత ఇళ్లకు ఇంటి పన్నులు, డ్రైనేజీ, వాటర్ టాక్స్‌లు చెల్లిస్తూ, కొత్త నిర్మాణాలను చేపడితే ఆ కాలానికి కూడా పన్నులు వసూలు చేస్తున్నారు.అదే సమయంలో కొత్త నిర్మాణాలకు నిబంధనల మేరకు ఫీజులు జనరేట్ చేస్తూ అవే కనెక్షన్లను కొత్తగా ఇస్తున్నట్టు అదనపు వసూళ్లు చేస్తున్నారు. ఒక పాత భవనాన్ని కూల్చి కొత్త నిర్మాణం చేపడితే పాత భవనానికి, కొత్త నిర్మాణానికి కలిపి రెండు వేర్వేరు పన్నుల్ని ఏపీలో మునిసిపల్ కార్పొరేషన్లు వసూలు చేస్తున్నాయి. నిర్మాణదారుల సమస్యల్ని పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు.

# అరకు నుంచి అమెరికాకు కాఫీ

విశాఖపట్టణం, మార్చి 5,అరకు కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్ లభించింది. ఇది ఆదివాసీ రైతులకు ఎంతో మేలు చేయనుంది. ఆర్గానిక్ సర్టిఫికేషన్ ద్వారా అరకు కాఫీని యూరప్‌కు ఎగుమతి చేసే అవకాశం వచ్చింది. దీని ద్వారా దాదాపు 2600 మంది రైతులకు లబ్ధి జరగనుంది. అసలు అరకు కాఫీకి ఎందుకంత డిమాండ్.. ఆర్గానికి సర్టిఫికేషన్ అంటే ఏంటీ.. దాని వల్ల కలిగే లాభాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.అరకు కాఫీని గిరిజన రైతులు సేంద్రియ ఎరువులు ఉపయోగించి పండిస్తారు. రసాయన మందులు వాడకుండా సహజ పద్ధతుల్లో పండించడం వల్ల ఇది మరింత రుచికరంగా, ఆరోగ్యకరంగా ఉంటుంది. సముద్ర మట్టానికి 3600 అడుగుల ఎత్తులో సిల్వర్ ఓక్, మిరియాల చెట్ల మధ్య ఈ కాఫీ తోటలు పెరుగుతాయి. ఈ ప్రత్యేకమైన వాతావరణం వల్ల కాఫీ గింజలకు ఒక ప్రత్యేకమైన రుచి, సువాసన వస్తాయి. అరకులో అరబికా రకం కాఫీని పండిస్తారు. ఈ రకం కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉందిఅరకు కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉంది. దీని రుచి, నాణ్యతకు గాను అనేక అవార్డులు కూడా లభించాయి. అరకు కాఫీ సాగులో గిరిజన రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి శ్రమ, నైపుణ్యం వల్లనే ఈ కాఫీ అంత రుచికరంగా ఉంటుంది. అరకు లోయలో మహిళలు పండిస్తున్న కాఫీలో చక్కటి పరిమళం ఉందని గతంలో ఐరాస ప్రతినిధులు ప్రశంసలు కురిపించారు. కాఫీ సాగు ద్వారా ఆర్థిక సామాజిక విప్లవాన్ని తీసుకురావడంలో అరకు మహిళల కీలక పాత్ర ఉందని, అరకు మహిళలు భారత నారీశక్తికి చిహ్నాలని ఐకాస ప్రతినిధులు కొనియాడారు. అరకు కాఫీ ప్రత్యేకమైన సుగంధ లక్షణాలు కలిగి రుచికి ప్రసిద్ధి చెందింది.ఆర్గానిక్ సర్టిఫికేషన్ వల్ల అరకు కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గుర్తింపు లభిస్తుంది. ఆర్గానిక్ సర్టిఫికేషన్ వల్ల యూరప్, అమెరికా వంటి దేశాలకు అరకు కాఫీని ఎగుమతి చేసే అవకాశం పెరుగుతుంది. ఆర్గానిక్ కాఫీకి సాధారణ కాఫీ కంటే ఎక్కువ ధర లభిస్తుంది. ఇది గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. ఆర్గానిక్ కాఫీలో రసాయన ఎరువులు, పురుగు మందులు ఉండవు. కాబట్టి ఇది ఆరోగ్యానికి మంచిది. ఆర్గానిక్ వ్యవసాయం పర్యావరణానికి హాని కలిగించదు. ఇది నేల, నీరు, గాలి కాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఆర్గానిక్ కాఫీ సాగు గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది.అరకు కాఫీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. కాఫీ తాగడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఇది జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఈ కాఫీ తాగడం వల్ల టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కాఫీ తాగడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కాఫీలో కెఫీన్ ఉంటుంది. ఇది శక్తిని పెంచుతుంది, అలసటను తగ్గిస్తుంది. అరకు కాఫీ ఆర్గానిక్ గుర్తింపు పొందడం వల్ల గిరిజన రైతులకు, పర్యావరణానికి, వినియోగదారులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

# ఎకరం 50 కోట్లు

# అమ్మకానికి 500 ఎకరాలు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిది మార్చి 5** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. హైదరాబాద్ గచ్చిబౌలిలో 400 ఎకరాల సర్కార్ భూమిని వేలం వేయాలని భావిస్తోంది. శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి గ్రామం పరిధిలో ఈ భూమి ఉండగా.. టీజీఐఐసీకి ద్వారా విక్రయించేందుకు ప్రయత్నిస్తుంది. సంక్షేమ పథకాల అమలు, ఇతర ఇవసరాల కోసం డబ్బు సమీకరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అంతర్జాతీయ స్థాయి లేఔట్‌ను అభివృద్ధి చేసి.. వేలం ద్వారా భూములను విక్రయించేందుకు కన్సల్టెంట్ నియామకానికి టెండర్లు పిలిచింది. ఈ నెల 15 వరకు బిడ్ల దాఖలుకు గడువిచ్చారు.డిసెంబర్ 2023లో కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మొదటి భూ వేలం ఇదే కానుంది. ఈ వేలం ద్వారా ప్రభుత్వం రూ. 20,000 కోట్లకు పైగా సేకరించాలని భావిస్తోంది. కంచ గచ్చిబౌలి గ్రామంలోని సర్వే నంబర్ 25(ఖ) వద్ద ఉన్న 400 ఎకరాల స్థలంలో 'మాస్టర్ ప్లాన్ లేఅవుట్'ను అభివృద్ధి చేయాలని ౧ఉఐఐఅ యోచిస్తోంది. ఈ భూమిని అభివృద్ధి చేసి దశలవారీగా విక్రయించనున్నారు. అత్యంత ఖరీదైన వెస్ట్ జోన్ పరిధిలో, ఐటీ కంపెనీలకు అతి సమీపంలోని ఈ భూమి ఉంది. హైటెక్ సిటీ నుంచి 7-8 కి.మీ, పంజాగుట్ట క్రాస్‌రోడ్స్ నుండి 15-18 కి.మీ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి 22 కి.మీ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దాదాపు 33 కి.మీ దూరంలో ఈ స్థలం ఉంది. అక్కడి లేఔట్లలో గజానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు పలికే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తుంది. ఎకరాల్లో అయితే ఎకరం రూ. 50 కోట్లు పలుకుతుందని అంచనా.లేఔట్ మాస్టర్ ప్లాన్ తయారీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వేలం ద్వారా ప్లాట్ల విక్రయాలు తదితర కార్యక్రమాల నిర్వహణ కోసం తాజాగా.. రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్‌ని ఆహ్వానించారు. క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్ (క్యూసీబీఎస్) పద్ధతిలో బిడ్డర్‌ను ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, భూమలు వేలం ద్వారా వచ్చే రూ.20 వేల కోట్లను రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సహా ఇతర పథకాల కోసం వెచ్చించనున్నట్లు తెలిసింది.

# వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ పదవి...

విజయవాడ, మార్చి 5, విజయవాడ టీడీపీ నేత వంగవీటి రాధాకు రెండు మూడు రోజుల్లో గుడ్ న్యూస్ అందనుంది. ఆయనకు ఎమ్మెల్సీగా చేయడానికి అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ప్రస్తుతం ఏపీలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ పోస్టులు ఖాళీ అవుతున్న నేపథ్యంలో బెజవాడ నేతగా ఆయన పేరును టీడీపీ అధినాయకత్వం పరిగణనలోకి తీసుకునే అవకాశాలు వంద శాతం ఉన్నాయి. ఇప్పటికే వంగవీటి రాధాకు ఈ మేరకు సిగ్నల్స్ కూడా అందినట్లు తెలిసింది. గత ఎన్నిల్లో టిక్కెట్ దక్కకపోయినా కూటమి పార్టీ లకోసం పనిచేయడాన్ని వంగవీటి రాధాకు ప్లస్ పాయింట్ గా మారింది. పార్టీని నమ్ముకుని ఉండటం, ఓటమిపాలయినా పార్టీని అంటిపెట్టుకుని ఉండటంతో చంద్రబాబు వంగవీటి రాధాకు ఫస్ట్ ప్రయారిటీ ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చారని తెలిసింది. వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ సీటు ఇచ్చినా కాపు, కమ్మ సామాజికవర్గాలకు ఒకే స్థానంతో ఇచ్చినట్లవుతుందని భావిస్తున్నారు. వంగవీటి రాధా గత రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నా ఒకసారి మాత్రమే ఎమ్మెల్యేగా గెలిచారు. అది కూడా 2004లో కాంగ్రెస్ నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఆయన అధికార పార్టీలో ఉండటం. ఆ తర్వాత వంగవీటి రాధా 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి ఓటమిపాలయ్యారు. ప్రజారాజ్యం నుంచి తర్వాత 2014లో వైసీపీలో చేరారు. అప్పుడూ ఓటమి పాలయ్యారు. పార్టీ కూడా అధికారంలోకి రాలేకపోయింది. 2019 ఎన్నికలకు ముందు ఆయన టీడీపీలో చేరి మరోసారి తన జెండాను మార్చేశారు. అయితే 2019ఎన్నికల్లో వంగవీటి రాధాకు టిక్కెట్ కేటాయించలేదు. ఇక అప్పటి నుంచి రాధా రాజకీయంగా ఇబ్బంది పడుతూనే ఉన్నారు. వంగవీటి ఇంటి పేరుకు ఉన్న బ్రాండ్ ఇమేజ్ తో ఆయన రాధా మంచి పేరున్నా ఆయనకు కలిసొచ్చే సమయం కోసం ఇప్పటి వరకూ వెయిట్ చేస్తున్నారు. ఎన్నికలు పూర్తయి తొమ్మిది నెలలు గడిచినా పెద్దగా యాక్టివ్ గా లేకపోయినా అలాగే పార్టీకి విధేయుడిగా ఉంటూనే వస్తుండటం ఆయనకు కలిసి వచ్చే అంశంగా చెప్పాలి. జనసేన నుంచి నాగబాబు పేరు ఎమ్మెల్సీ పదవికి ఖరాయింది. అయితే ఈ సమయంలో వంగవీటి రాధాకు ఇస్తారా? లేదా? అన్న చర్చ కూడా జరిగింది. కానీ నాగబాబు వేరు. వంగవీటి రాధా వేరు. ఇద్దరినీ వేర్వేరుగా చూడాలంటున్నారు. రంగా అభిమానులు ఎక్కువగా ఉన్న ఏపీలో ఆయన తనయుడికి ఎమ్మెల్సీ అవకాం కల్పిస్తే వారు కూడా రాజకీయంగా తమకు ఉపయోగపడతారని చంద్రబాబు అంచనా.అందుకే వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ పదవి ఫిక్స్ అయిందని టీడీపీ వర్గాల్లో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. నాలుగు స్థానాల్లో ఒకటి వంగవీటి రాధాకు కేటాయించిన కారణంగా భవిష్యత్ లో పార్టీకి మరింత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వస్తే టీడీపీ అధినాయకత్వం ఎమ్మెల్సీ చేస్తామని చెప్పినా ఆ పార్టీ అధికారంలోకి రాలేకపోవడంతో వంగవీటి రాధా చట్టసభలకు దూరంగానే ఉన్నారు. వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడానికి నారా లోకేశ్ కూడా సుముఖంగా ఉన్నారు. ఇటీవల ఆయన ఆరోగ్యం బాగాలేనప్పుడు స్వయంగా చంద్రబాబు, లోకేశ్ లు వెళ్లి పరామర్శించి వచ్చారు. గత ఎన్నికల్లో ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించిన చంద్రబాబు ఈ జాబితాలోనే వంగవీటి రాధాపేరు ఎంపిక చేయాలని నిర్ణయానికి వచ్చారంటున్నారు. అమరావతి రైతుల ఉద్యమానికి కూడా రాధా సహకరించారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని రాధాను ఎమ్మెల్సీగా ఎంపిక చేయడమే మంచిదని అని పార్టీ వర్గాలు కూడా అభిప్రాయ పడుతున్నాయి. శాసనమండలిలో ఎమ్మెల్సీ పదవులన్నీ కూటమికే రానుండటంతో అందులోతొలి జాబితాలోనే వంగవీటి రాధా పేరు ఉందన్నది పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. ఈరోజు, రేపట్లో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని చెబుతున్నారు. వివాదాలకు దూరంగా ఉండే వంగవీటి రాధా కు పదవి ఇవ్వడం వల్ల కూటమి మొత్తానికి ఉపయోగకరమని మూడు పార్టీలు విశ్వసిస్తున్నాయి.

# టీడీపీలోకి మల్లన్న
# గ్రేటర్ కోసం కసరత్తు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిది మార్చి 5,** ఆంధ్రప్రదేశ్‌లో విజయం తర్వాత తెలుగుదేశం పార్టీ కేడర్ జోష్‌లో ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వడానికి చంద్రబాబు ప్లాన్ చేస్తున్నట్టు పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతోంది. తెలంగాణలో పార్టీని యాక్టివ్ చేయాలని ఇక్కడి నేతలు చాలా రోజులుగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.మరో 10 నెలల్లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలపై టీడీపీ ఫోకస్ పెట్టినట్టు సమాచారం.

ఇందుకు సంబంధించి ఇప్పటికే గ్రౌండ్ వర్క్ కూడా ప్రారంభం అయినట్టు తెలుస్తోంది. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కోసం పనిచేసిన పొలిటికల్ కన్సల్టెన్సీ 'షోటైమ్'.. ఇప్పుడు హైదరాబాద్‌లో కార్యాకలాపాలు ప్రారంభించిందిహైదరాబాద్‌లో ఆఫీసు ఏర్పాటు చేసిన షోటైమ్ ప్రతినిధులు.. టీడీపీ కోసం గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలే ట్రార్గెట్‌గా ఆ సంస్థ ప్రతినిధులు పని చేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా గతంలో టీడీపీ విజయం సాధించిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ సానుభూతిపరులను వీరు కలుస్తున్నారు. టీడీపీ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేయబోతోందని.. అందరూ గతంలో లాగా యాక్టివ్ అవ్వాలని సూచించినట్టు తెలిసింది.ఎల్బీనగర్, మహేశ్వరం, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుతం గ్రౌండ్ వర్క్ చేస్తున్నట్టు సమాచారం. ఇక్కడ చేస్తున్న వర్క్, పురోగతి గురించి ఎప్పటికప్పుడు చంద్రబాబుకు తెలియజేస్తున్నట్టు తెలుస్తోంది. ఎన్నికలకు ఇంకా 10 నెలలు సమయం ఉండటంతో ముఖ్యనేతలు డైరెక్ట్‌గా ఇన్వాల్వ్ అవ్వడం లేదని తెలుస్తోంది. ఎన్నికలు సమీపించాక.. నారా లోకేష్ ఫోకస్ పెడతారని విశ్వసనీయంగా తెలిసింది.ప్రస్తుతం ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా ఈ మూడు పార్టీలు కలిసి పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా వెస్టర్న్ హైదరాబాద్‌లో టీడీపీ, జనసేన ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈస్టర్న్ హైదరాబాద్‌లో బీజేపీ ఇంపాక్ట్ ఉండే ఛాన్స్ ఉంది. దీంతో మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తే.. ఏపీలో మాదిరిగా విజయం సాధిస్తామని.. హైదరాబాద్‌కు చెందిన టీడీపీ సీనియర్ నేత ఒకరు చెప్పారుఇటీవల తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది. దీంతో ఆయన టీడీపీలో చేరవచ్చనే ప్రచారం జోరుగా సాగుతోంది. కొత్త పార్టీ కూడా పెడతారనే ప్రచారం జరిగినా.. తెలుగుదేశం వైపే మొగ్గుచూపే అవకాశం ఉందని అంటున్నారు. అటు టీడీపీ మల్లన్నను చేర్చుకోవడానికి చర్చలు జరిపినట్టు వార్తలు వచ్చాయి.

మల్లన్న పార్టీలో చేరితే ప్లస్ అవుతుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు. ఆయకే తెలంగాణ టీడీపీ అధ్యక్ష పదవీ ఇవ్వొచ్చనే వార్తలు కూడా వచ్చాయి.గతేడాది టీడీపీ సభ్యత్వ కార్యక్రమం చేపట్టింది. దీనికి తెలంగాణలోనూ మంచి స్పందన లభించింది. తెలంగాణ నుంచి లక్షా 21 వేల మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. దీంట్లో దాదాపు హైదరాబాద్ నుంచే ఎక్కువ మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందుకే చంద్రబాబును కలుస్తున్న తెలంగాణ నేతలు.. పార్టీపై ఫోకస్ పెట్టాలని కోరుతున్నారు.

# సీనియర్లకు మొండి చేయి...

కాకినాడ, మార్చి 5, తెలుగుదేశం పార్టీ నాయకత్వం ఆలోచన పూర్తిగా మారింది. పార్టీ పది కాలాల పాటు అధికారంలోకి రావాలంటే యువతకు అవకాశాలు ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు కనపడుతుంది. చట్ట సభల్లో ఏ పోస్టు ఖాళీ అయినప్పటికీ దానికి యువకులను ఎంపిక చేయాలన్న ఉద్దేశ్యంతో ఉంది. టీడీపీలో కష్టపడితే పదవులు వస్తాయన్న సంకేతాలను బలంగా పంపడానికే ఈ రకమైన నిర్ణయం పార్టీ హైకమాండ్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సీనియర్ నేతల సేవలను ఇప్పటి వరకూ వినియోగించుకున్నా వారిని పార్టీ సేవలకే ఉపయోగించుకోవాలని డిసైడ్ అయినట్లు సమాచారం. ఎలాంటి మొహమాటాలు లేకుండా సీనియర్లను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టాలని భావిస్తున్నారు. పార్టీ ఏర్పడి దాదాపు యాభై ఏళ్లు కావస్తుండటంతో సీనియర్ నేతలు టీడీపీలో పాతుకుపోయి ఉన్నారు. వారు మర్రిచెట్టులాగా తయారయ్యారన్న విమర్శలు క్యాడర్ నుంచి ఎదురవుతున్నాయి. వారు తప్పించి నియోజకవర్గాల్లోనూ, మరే పదవుల్లోనూ మరొకరికి స్థానం దక్కదన్న బలమైన అభిప్రాయం ద్వితీయ శ్రేణి నేతల్లో ఉంది. 2019 నుంచి 2024 వరకూ యువనేతలే ఎక్కువగా పార్టీకి కష్టపడ్డారు. చంద్రబాబు నిర్వహించిన అనేక సభలకు జనసమీకరణను కూడా వారే దగ్గరుండి చూశారు. సీనియర్ నేతలు పెద్దగా ఆ ఐదేళ్లు పార్టీని పట్టించుకోలేదన్న అభిప్రాయం బలంగా ఉంది. సీనియర్ నేతలకు ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాలు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ అందులోనూ యువతకే ప్రాధాన్యత ఇవ్వాలని దాదాపుగా డిసైడ్ అయినట్లు తెలిసింది. ఇప్పటికే కొందరు తమంతట తామే రాజకీయాల నుంచి తప్పుకోగా, మరికొందరు పదవుల కోసం ప్రయత్నిస్తున్నారు. వారు పార్టీకి భారంగా మారారన్న వాదన బలంగా వినిపిస్తుంది. నియోజకవర్గాల్లో క్యాడర్ ను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, అలాగే తమ రాజకీయాల కోసం పార్టీని బలి చేస్తున్నారన్న వాదన మాత్రం అధినాయకత్వం జరిపిన సర్వేల్లోనూ వెల్లడి కావడంతో ఇక సీనియర్లకు చెక్ పెట్టాలన్న నిర్ణయానికి పార్టీ అధినాయకత్వం వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అవుతున్న నాలుగు ఎమ్మెల్సీ స్థానాలను కూడా యువకులకే ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. పార్టీ క్యాడర్ మనోభిప్రాయాలను గౌరవిస్తూ భవిష్యత్ నేతలను తయారు చేసుకునే పనిలో సైకిల్ పార్టీ ఉందనే చెప్పాలి. ఇక నారా లోకేశ్ యుగం కావడంతో యువతకే ప్రాధాన్యం ఇస్తారు. అందులో ఎలాంటి సందేహం లేదు. మంత్రి వర్గం కూర్పులోనే ఈ విషయం స్పష్టమయింది. యువత అయితే పార్టీని నమ్ముకుని పనిచేయడమే కాకుండా తమకు వచ్చిన పదవితో సంతృప్తి పడతారని, అదే సీనియర్ నేతలయితే ఎమ్మెల్సీ పదవి వచ్చినా తమకు మంత్రి పదవి దక్కలేదన్న అసంతృప్తితో నిత్యం ఉంటారన్న భావన అధినాయకత్వంలోనే ఉంది. అందుకే ఈ నాలుగు సీట్లలోనూ తాను ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు భర్తీ చేస్తారంటున్నారు. సీనియర్ నేతలకు పొలిట్ బ్యూరో లో స్థానం కల్పించకుండా, పార్టీ సలహాలు, సూచనలకు మాత్రమే పరిమితం చేయాలని హైకమాండ్ డిసైడ్ అయింది.

# మీనాక్షి మార్క్.. సమీక్షలు షురూ...



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిది మార్చి 5,**ఏఐసీసీ కొత్త ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పనితీరుపై సమీక్షలు నిర్వహించనున్నారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గ స్థాయిలో పార్టీ పనితీరును తెలుసుకునేందుకు గాంధీభవన్‌లో 4వ తేదీ నుంచి సమీక్షలు నిర్వహించారు. తొలుత మంగళవారం మెదక్, మల్కాజిగిరి పూర్తి చేయగా రెండో రోజు బుధవారం కరీంనగర్, ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల నేతలందరితో సమీక్షించారు.టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగే సమీక్షలకు.. ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీలు, ఇతర ముఖ్యనేతలందరూ రావాలని ఇప్పటికే ఆహ్వానాలు వెళ్లాయి. మీనాక్షి నటరాజన్ ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమితులైన తరవాత.. నిర్వహించబోతున్న తొలి సమీక్ష సమావేశాలు కావడంతో వీటికి ప్రాధాన్యం ఏర్పడింది.అటు గాంధీభవన్‌కు చాలామంది నేతలు క్యూకడుతున్నారు. ఎమ్మెల్యేలు ఎన్నుకునే ఎమ్మెల్సీ ఎన్నికలకు నలుగురు అభ్యర్థులను ఈ నెల 10లోగా పార్టీ ప్రకటించాల్సి ఉంది. వీటికి సంబంధించి పెద్దసంఖ్యలో నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ఇన్‌ఛార్జిని ప్రసన్నం చేసుకునేందుకు, తమ పనితీరును వివరించేందుకు నేతలు గాంధీభవన్ చుట్టూ తిరుగుతున్నారు.తెలంగాణ అసెంబ్లీ ఇటీవల ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపింది. ఆ మేరకు కాంగ్రెస్‌లో పదవుల భర్తీ ఉంటుందని నేతలు చెబుతున్నారు. ప్రధానంగా మాల, మాదిగ వర్గాల నేతలకు ఎమ్మెల్సీ టికెట్లు, నామినేటెడ్, మంత్రి పదవుల భర్తీలో ఎస్సీ వర్గీకరణ ప్రకారం ప్రాధాన్యమిస్తారని ప్రచారం జరుగుతోంది. అటు తమకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని రెండు సామాజిక వర్గాల నేతలు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం.మాల, మాదిగలకు సంబంధించి.. ఒక వర్గానికి అవకాశమిస్తే మరో వర్గానికి ప్రభుత్వ సలహాదారు లేదా రాబోయే మంత్రివర్గ విస్తరణలో సర్దుబాటు చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఇక బీసీలకు ఎమ్మెల్సీ టికెట్లలో రెండు ఇవ్వాలని ఈ వర్గాల నేతలు పట్టుబడుతున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక పూర్తయితే ఏయే వర్గాలకు అవకాశం ఇస్తారనేది తేలుతుంది.ఇటు మిగిలిన సామాజిక వర్గాలకు నామినేటెడ్, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ పదవులు ఇస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. పీసీసీ రాష్ట్ర కార్యవర్గ కూర్పు కూడా ఈ నెల 20లోగా పూర్తవుతుందని నేతలు అంచనా వేస్తున్నారు. పార్టీ పరిస్థితులు, సమస్యలు, పరిష్కార మార్గాలపై ఆయా నేతలపై మీనాక్షి నటరాజన్ చర్చించనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటి నుంచే ఆమె ఫోకస్ చేశారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమావేశాలు నిర్వహించనున్నారు. దీని తర్వాత జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కార్యకర్తలతో భేటీ కావాలని భావిస్తున్నట్లు గాంధీ వర్గాలు చెబుతున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామ స్థాయిలో జరగడంతో వాటిపై తొలుత దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం అయితే ఓటు బ్యాంక్ చెదిరిపోకుండా ఉంటుందన్నది హైకమాండ్ ఆదేశాలు. ఆ విధంగా ఆమె అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది.రాష్ట్ర ఇన్‌ఛార్జిగా నియమితులైన తర్వాత మీనాక్షి నిర్వహిస్తున్న ఫస్ట్ సమీక్ష సమావేశాలు ఇవే. నేతలు సైతం వీటికే ప్రాధాన్యం ఇస్తున్నారు. మరో ఐదు ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. పెద్ద సంఖ్యలో నేతలు టికెట్లు ఆశిస్తున్నారు. కొత్త ఇన్‌ఛార్జిని ప్రసన్నం చేసుకునేందుకు నేతలు సైతం సిద్ధమవుతున్నవారు.దీని తర్వాత సామాజిక వర్గాలకు నామినేటెడ్, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ రాష్ట్ర కార్యవర్గ పదవులు ఇస్తారనే వార్తలు లేకపోలేదు. పీసీసీ కార్యవర్గ కూర్పు ఈ నెల 20లోగా పూర్తి అవుతుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నామినేటెడ్ పదవుల్లో పెండింగ్ లో ఉన్నవాటిని భర్తీ చేయడానికి జిల్లాలవారీగా ఈనెల 10లోగా అర్హులను గుర్తించాలని ఇప్పటికే ఆదేశాలు వెళ్లాయి. దీనిపై ఇన్‌ఛార్జి మంత్రులు ఆయా వివరాలు సేకరిస్తున్నారు. మొత్తానికి పార్టీ బలోపేతంపై చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు మీనాక్షి నటరాజన్.నామినేటెడ్ పదవుల్లో మిగిలిన వాటిని భర్తీ చేయడానికి జిల్లాల వారీగా ఈ నెల 10లోగా అర్హులను గుర్తించాలని.. ఇన్‌ఛార్జి మంత్రులకు పీసీసీ ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. వారు ఆ వివరాలు సేకరిస్తున్నారు.

# వరంగల్ రైతుల ఆందోళన

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిది మార్చి 5,** మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించిన పనుల్లో భాగంగా.. రెవెన్యూ అధికారులు భూముల సర్వేకు వెళ్లారు. వారిని అడ్డుకుని రైతులు నిరసన చేపట్టారు. జై జవాన్.. జై కిసాన్ అంటూ రోడ్డెక్కి నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న మామునూరు సీఐ ఒంటేరు, ఇతర పోలీస్ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. కానీ తమకు న్యాయం జరిగేదాక భూముల సర్వే ముందుకు కదలనివ్వబోమని రైతులు స్పష్టం చేశారు. దీంతో మామునూరు ఎయిర్ పోర్టు సమీపంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వరంగల్ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, ఎమ్మార్వో నాగేశ్వరరావు ఇతర అధికారులు అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.మామునూరు ఎయిర్ పోర్టు పునరుద్ధరణకు తాము వ్యతిరేకం కాదని భూములు కోల్పోతున్న రైతులు స్పష్టం చేశారు. ఇక్కడ భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎయిర్ పోర్టు కింద భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని, అంతేగాకుండా విమానాశ్రయం పునరుద్ధరణలో భాగంగా నక్కలపల్లి రహదారిని క్లోజ్ చేస్తున్నారని.. తమకు ప్రత్యామ్నాయంగా మరో రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇక్కడి రైతుల డిమాండ్ ను ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించని లేని పక్షంలో భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఎయిర్ పోర్టు భూసేకరణపై గతంలో నిర్వహించిన సమావేశం సందర్భంగా జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ రైతులకు హామీ ఇచ్చారని.. బహిరంగ మార్కెట్ ప్రకారం రేటు చెల్లిస్తామని చెప్పారని రైతులు చెబుతున్నారు. ఆ లెక్క ప్రకారం మామునూరు ఎయిర్ పోర్టు చుట్టుపక్కల రూ.5 కోట్లకుపైగా ధర పలుకుతోందని, దాని ప్రకారమే అన్నదాతలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులు కోరుకున్న ప్రకారం వ్యవసాయ భూములు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడేమో తమకు ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండానే సర్వే మొదలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.నక్కలపల్లి, గుంటూరుపల్లి, గాడిపల్లి, నల్లకుంట గ్రామాలకు చెందిన రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టడంతో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. రైతుల ధర్నాకు ఎలాంటి అనుమతి లేదని, వెంటనే ఆందోళన విరమించాల్సిందిగా సూచించారు. కానీ తమ జీవనోపాధికి సంబంధించిన అంశం కావడంతో అన్నదాతలు రోడ్డుపై నినాదాలతో హోరెత్తించారు. దాదాపు 200 మంది వరకు పోలీసులు మోహరించడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొనగా.. తమకు న్యాయం జరిగేంతవరకు ఎయిర్ పోర్టుకు భూములు ఇచ్చేది లేదని అక్కడి రైతులు స్పష్టం చేస్తున్నారు. విమానాశ్రయ పునరుద్ధరనకు ఇంకో 253 ఎకరాలు సేకరించాల్సి ఉండగా.. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

## మహిళలు రాజకీయ సామాజిక సాధనలో ముందు ఉండాలి.

కమాన్ పూర్. మహిళలు ఆర్థిక రాజకీయ సామాజిక సాధనలో ముందు ఉండాలి అని శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు జి జ్యోతి అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి వనజా రాణి అన్నారు. ఈ మేరకు రొంపి కుంట గ్రామంలో అంగన్వాడి టీచర్ గుమ్మడి శారద ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముందస్తు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్యోతి మరియు వనజారాణిలు ముఖ్యఅతిథిగా హాజరై బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8న జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం ఒకటే రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకోవడం జరుగుతుంది. అలాగే ఈ దినోత్సవాన్ని మొదట అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం గా పిలిచేవారు అని పేర్కొన్నారు. ప్రాంతాల్లో ఈ ఆచరణ మహిళలకు గౌరవం గుర్తింపునిస్తుందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా మహిళల రాజకీయ సామాజిక హక్కుల పోరాటంపై జాగృతి పెంచే విధంగా జరుపుకోవడం జరుగుతుంది. అలాగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు సెలవు దినంగా ప్రకటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, రజియా, రాజమణి, సంధ్య, సుల్తానా, సృజన, అనిత, రమ, శారద తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షం కమలమేనా...

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిది మార్చి 5,** తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏం జరిగింది? రాబోయే రోజుల్లో రాజకీయ పరిణామాలు ఏ విధంగా ఉండబోతున్నాయి? బీజేపీకి అంతర్గతంగా బీఆర్ఎస్ మద్దతు ఇచ్చినట్టేనా? ఈ ఎన్నికల్లో బోర్లా పడిందెవరు? బీఆర్ఎస్ కోట క్రమంగా బద్దలువుతున్నట్లేనా? అవుననే సంకేతాలు ఆ పార్టీ నేతల నుంచి బలంగా వినిపిస్తున్నాయి.తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు దాదాపుగా వెలువడ్డాయి. కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీల్లో బీజేపీ మద్దతుదారు మల్క కొమరయ్య గెలిచారు. దీంతో ఆ పార్టీ నేతలు ఫుల్‌ఖుషీగా ఉన్నారు. బీజేపీ గెలుపు తర్వాత మీడియా ముందుకొచ్చేశారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రధాని నరేంద్రమోదీ పట్ల నమ్మకంతో ఈ తీర్పు వచ్చిందన్నారు సంజయ్. ఈ గెలుపు టీచర్లకు, మోదీకే అంకితమన్నారు. ఇది మామూలు విజయం కాదన్నారు. దేశ వ్యాప్తంగా మేధావి వర్గమంతా మోదీ పట్ల నమ్మకంతో ఉన్నారు. బడ్జెట్‌లో ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు వల్లే ఈ తీర్పు ఇచ్చారని చెప్పుకొచ్చారు.ఆనాడు కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా ఎమ్మెల్సీగా ఏవీఎన్ రెడ్డిని గెలిపించారన్నారు కేంద్రమంత్రి సంజయ్. 317 జీవోపై బీజేపీ కార్యకర్తలు చేసిన పోరాటాలు, లాఠీ ఛార్జ్ గుర్తుంచుకున్న ఉపాధ్యాయులు కొమరయ్యను గెలిపించారని తెలిపారు. హేళన చేసిన వారందరీ చెంప చెళ్లుమన్పించేలా తీర్పు ఇచ్చారన్నారు.బండి సంజయ్ చెప్పిన పాయింట్‌లో కీలకమైనది ఉద్యోగులకు పన్ను మినహాయింపు. ఎన్నికల్లో దీని ప్రభావం బాగానే కనిపించింది. ఇది ఎవరు నమ్మినా నమ్మకపోయినా ముమ్మాటికీ నిజం. ఎందుకంటే ఉపాధ్యాయులంతా ఆ పన్ను పరిధిలో వారే కావడం బీజేపీకి కలిసొచ్చింది. మొన్నటికి మొన్న ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు పన్ను సడలింపు కలిసి వచ్చిందని కొందరు ఆ పార్టీ నేతలు బలంగా చెప్పారు కూడా. ఇక్కడా అలాంటి ఫలితమే పునరావృతమైందిఇక్కడ బీజేపీ గెలిచిందని చెప్పడం కంటే.. బీఆర్ఎస్ కోటకు బీటలు పడుతున్నాయని అంటున్నారు. సింపుల్‌గా చెప్పాలంటే నార్త్ తెలంగాణలో బీజేపీ తన జోరును కొనసాగించింది. అసెంబ్లీ, లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో జోరు కొనసాగించింది. ఒకప్పుడు అక్కడ బీఆర్ఎస్ చాలా బలంగా ఉండేది. ఇప్పుడు చతకిలపడిపోయింది. ఇలాంటి ఫలితాలు వస్తాయని ముందుగానే కారు పార్టీ భావించి, ఎన్నికల నుంచి తప్పుకుంది.ఎమ్మెల్సీ ఎన్నికల ముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ కీలక నేతలు సమావేశాలు నిర్వహించారు. తమ ఓటు బ్యాంకు ఈసారి బీజేపీకి వేయాలని సంకేతాలు ఇచ్చారనే వాదనలు సైతం లేకపోలేదు. ఈ క్రమంలో బీజేపీ గెలిచిందని మరోవైపు వినిపిస్తున్నమాట. టీచర్ ఎమ్మెల్సీపై అధికార కాంగ్రెస్ పెద్దగా ఫోకస్ చేసిన సందర్భం లేదు.బీఆర్ఎస్ తీసుకొచ్చిన జీవో 317 పై వ్యతిరేకంగా ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతున్నాయి. బీజేపీ గెలుపు వెనుక ఇది కూడా ఓ కారణమని అంటున్నారు. ఈ విషయంపై అధికార కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టింది. న్యాయ నిపుణులతో మంతనాలు చేస్తోంది. కొద్దిరోజుల్లో ఈ అంశం కూడా ఓ కొలిక్కి వచ్చే అవకాశముంది. జరుగుతున్న పరిణామాలు, ఫలితాలు చూస్తేంటే ఉత్తర తెలంగాణలో బీజేపీ క్రమంగా పాగా వేస్తుందనే చెప్పాలి.

# ఓపెన్ గార్బేజీల వద్ద వాయిస్ అసిస్టెన్స్ కెమెరా

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 5,** నాగార్జున హీరోగా ఆ మధ్య వచ్చిన సూపర్ సినిమాలో బ్రహ్మానందం దగ్గర అబద్ధాలు కనిపెట్టే మిషన్ ఉంటుంది. అలీని ఓ కేసులో బ్రహ్మానందం ప్రశ్నలు అడుగుతుంటాడు. ఆ సమయంలో అలీ అబద్ధం చెప్పిన ప్రతిసారి మిషన్ అరుస్తుంది. ఇలాగే, మనం రోడ్లపై చెత్త వేసిన ప్రతిసారి మిషన్ అరిస్తే ఎలా ఉంటుంది?రోడ్లపై చెత్త వేయొద్దని జీహెచ్ఎంసీ ఎంతగా చెబుతున్నా చాలా మంది వినిపించుకోరు. బస్సుల్లో నుంచి వెళ్తూ కొందరు కిటికీల్లోనుంచే పేపర్లు పడేస్తారు. రోడ్డుపక్కన దుకాణంలో కొనుక్కుని తిని రోడ్డుపైనే అందుకు సంబంధించిన చెత్తను పడేస్తుంటారు. బైకుపై వెళ్తూ రోడ్డుపైనే చెత్తను పడేస్తూ వెళ్తుంటారు కొందరు. ఇంట్లోని చెత్తను మోసుకొచ్చి ఎక్కడపడితే అక్కడ పడేస్తుంటారు.ఇటువంటి వారందరినీ పసిగట్టి ఓ మిషన్ అరిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన జీహెచ్ఎంసీ అధికారులకు కూడా వచ్చింది. అంతేకాదు, రోడ్డు మీద చెత్త వేస్తే కిస్సిక్ మంటూ ఫొటో కూడా తీస్తుంది ఈ మిషన్. దీన్ని హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేశారు. అక్కడి ఓపెన్ గార్జేజీల వద్ద వాయిస్ అసిస్టెన్స్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇది విజయవంతమైతే మరిన్ని ప్రాంతాల్లోనూ ఈ వాయిస్ అసిస్టెన్స్‌ను ఏర్పాట్లు చేయనున్నారు.బంజారా హిల్స్‌లో ఓపెన్ గార్బేజీల వద్ద ఏర్పాటు చేసిన వాయిస్ అసిస్టెన్స్ కెమెరా ఎవరైనా చెత్త వేసేందుకు వస్తే ఫొటో తీస్తోంది. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీనగర్ లో ఓపెన్ గార్బేజీ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన వాయిస్ అసిస్టెన్స్ కెమెరా సెన్సార్.. ఎవరైనా చెత్త వేస్తే వారిని గుర్తిస్తోంది. అనంతరం వాయిస్ కంట్రోల్‌కు అది సందేశం పంపుతుంది.ఆ వెంటనే అక్కడ చెత్త వేయకూడదని తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మైకు అరుస్తుంది. ఈ ప్రయోగం ద్వారా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసేవారి సంఖ్య తగ్గుతుందని అధికారులు అంటున్నారు. ఇక్కడ చేస్తున్న ఈ ప్రయోగం విజయవంతమైతే జూబ్లీహిల్స్ సర్కిల్ 18లో కూడా వీటిని ఏర్పాటు చేయనున్నారు.ప్రస్తుతం పలు ప్రాంతాల్లో వాయిస్ అసిస్టెన్స్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే వెంటనే స్థానిక ఎస్ఎఫ్ఎ, చెత్తను సేకరించే ఆటో రిక్షా కార్మికుడికి కూడా సందేశంతో పాటు వీడియో, ఫొటో వెళ్తాయని అంటున్నారు. చెత్త వేస్తున్న వారిని దీని ద్వారా గుర్తించి ఇటువంటి పనులు చేయకూడదని చెబుతారని అన్నారు.మరోవైపు, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) డంపర్‌బిన్లలో చెత్త దాదాపు 75 శాతం నిండగానే అలర్ట్ చేసేలా ఆధునిక డంపర్‌బిన్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే విధించే పెనాల్టీలకు ఇకపై ఈ చలాన్‌లను జారీ చేయనుంది. అలాగే, యూపీఐ చెల్లింపుల ద్వారానే ఆ జరిమానాలకు

# వరంగల్ కాంగ్రెస్ లో కుమ్ములాటలు

**వరంగల్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 5,** రాజకీయాల్లో ప్రత్యర్థి పార్టీల మధ్య సవాళ్లు, వార్నింగులు సహజమే.. అయితే అక్కడ పరిస్థితి డిఫరెంట్‌గా కనిపిస్తోంది. తలతిక్క వేషాలు వేస్తే ఊరుకునేది లేదు. నా అనుచరులను డిస్టర్బ్ చేస్తే సహించేది లేదు.. ఇది ఓ ఎమ్మెల్యే తన సొంత పార్టీ నేతకు బహిరంగంగా ఇచ్చిన వార్నింగ్. ఈ వార్నింగ్ తో ఆ నియోజకవర్గ రాజకీయాలు ఒక్కసారిగా హీటెక్కాయి.

దీంతో పార్టీలో ఏం జరుగుతోందో అంటూ చర్చలు మొదలయ్యాయి. ఇంతకీ ఈ మాస్ వార్నింగ్ ఇచ్చిందెవరు..? ఆయనకు ఎందుకని అంత కోపం వచ్చింది?ఓరుగల్లు రాజకీయాలలో ప్రత్యర్థి పార్టీల నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు, వివాదాలు సహజం. కానీ ఓ ఎమ్మెల్యే మాత్రం తన సొంత పార్టీ నాయకునికి బహిరంగంగా వార్నింగ్ ఇచ్చి పొలిటికల్ సర్కిల్స్ లో హీట్ పెంచారు. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే సహించేది లేదని బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. కీలక సంస్థల ప్రధాన కార్యాలయాలు , వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన అడ్మినిస్ట్రేటివ్ భవనాలు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోనే ఉన్నాయి.అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరంగల్ పశ్చిమ స్థానం నుండి పోటీ చేసేందుకు ఆశావహులు భారీ స్థాయిలో పోటీపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నుండి సుమారు 15 మంది నాయకులు టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. హనుమకొండ డీసీసీ ప్రెసిడెంట్ నాయిని రాజేందర్ రెడ్డి, జంగా రాఘవరెడ్డిల మధ్య టికెట్ పోరు రసవత్తరంగా సాగింది. వరంగల్ పశ్చిమలో తనకు టికెట్ ఇవ్వకుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని బహిరంగంగానే జంగా రాఘవరెడ్డి తన అసంతృప్తి వెళ్ళగక్కారు.అయితే చివరకు అధిష్టానం జంగా రాఘవరెడ్డిని కాదని నాయిని రాజేందర్ రెడ్డికి టికెట్ ఇచ్చింది. డీసీసీ పదవి విషయంలోనూ గతనుండే జంగా రాఘవరెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి ల మధ్య వర్గ పోరు నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలలో నాయిని రాజేందర్ రెడ్డి ఘన విజయం సాధించడంతో జంగా రాఘవరెడ్డి సైలెంట్ అయ్యారు. పార్టీకి డామేజ్ జరగద్దని భావించిన అధిష్టానం జంగా రాఘవ రెడ్డికి పామ్ ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ నామినేటెడ్ పదవి కట్టబెట్టింది.ఇన్నాళ్లు సైలెంట్ గా ఉన్న జంగా రాఘవరెడ్డి అనుచరులు గత కొద్ది రోజుల నుండి సోషల్ మీడియా వేదికగా పార్టీకి నష్టం కలిగేలా ప్రచారం సాగిస్తున్నారట. అంతేకాకుండా స్థానిక ఎమ్మెల్యే నాని రాజేందర్ రెడ్డికి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారట. గత పది ఏళ్ల కాలంలో పార్టీ అధికారంలో లేకున్నా అందరినీ కంటికి రెప్పలా కాపాడుకున్నాడని తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి పార్టీకి సేవ చేశారని మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తున్నారట. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కారణంగా జంగాకు టికెట్ ఇవ్వలేదని మరోసారి అవకాశం ఇస్తామని హైకమాండ్ బుజ్జగించిందని..అందుకే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలంటూ కాంగ్రెస్ సేవల గ్రూపులో ప్రచారం చేస్తున్నారట.ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ టికెట్ కోసం ప్రచారం చేయడమే కాకుండా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ కాంగ్రెస్ కేడర్ను రెండు వర్గాలుగా చీల్చే ప్రయత్నాలు చేస్తున్నారని నాయని అనుచరు? చెప్పుకుంటున్నారు. జంగాకి ఎమ్మెల్సీ పదవి వస్తే మళ్లీ కాంగ్రెస్ క్యాడర్ రెండుగా చీలిపోతుంది అని ఇద్దరి మధ్య ఆధిపత్య పోరులో పార్టీ మనుగడకే మోసం వస్తుందని సీనియర్ కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.గత ఎన్నికలకు ముందు సైతం జంగా రాఘవరెడ్డి టిఆర్ఎస్ నేతలకు అమ్ముడుపోయారని కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి ప్రయత్నించారని నాయని రాజేందర్ రెడ్డి వర్గం ఆరోపిస్తోంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం లో సైతం సొంత పార్టీ అభ్యర్థి అయిన నాయిని రాజేందర్ రెడ్డి ఓటమి కోసం టిఆర్ఎస్ అభ్యర్థితో చేతులు కలిపాడని ఆరోపిస్తున్నారు.

అలాంటి వ్యక్తికి ఎమ్మెల్సీ పదవి కట్టబెడితే పార్టీని సర్వనాశనం చేస్తాడని జంగా రాఘవరెడ్డి పై తీవ్ర స్థాయిలో ఫైర్ అవుతున్నారు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.కాజీపేట పరిధిలోని కొంతమంది నాయకులు జంగా రాఘవరెడ్డి అనుకూలంగా ప్రచారం చేస్తుండడంతో విషయం తెలుసుకున్న నాయని తీవ్రంగా ఫైర్ అయ్యారు. టిఆర్ఎస్ తో చేతులు కలిపి పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని కాంగ్రెస్ కేడర్ను అయోమయానికి గురి చేస్తున్నారని జంగా రాఘవరెడ్డిని తీవ్రస్థాయిలో టార్గెట్ చేశారు. అంతేకాకుండా తనకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని బీఆర్ఎస్ నేతలతో కుమ్మక్కై తన వెనుక గోతులు తీస్తున్నారని దుయ్యబట్టారు. ల్యాండ్ కబ్జాలు, సెటిల్మెంట్లు లేకుండా ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో తిరిగి దందాలు మొదలు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్నారని.. ఇలా చేస్తే సహించేది లేదని జంగా రాఘవరెడ్డి అనుచరులకు బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు.మొత్తమ్మీద ఇన్నాళ్లు సైలెంట్ గా ఉన్న జంగా రాఘవరెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి మధ్యలోని వర్గపోరు, ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చింది.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బహిరంగంగా జంగా రాఘవరెడ్డి, అతని అనుచరులకు వార్నింగ్ ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీలో ఏం జరగబోతుందోననే ఉత్కంఠ మొదలైంది. స్థానిక సంస్థలు సమీపిస్తున్న వేళ ఇద్దరి మధ్య వర్గ పోరు ఎక్కడికి దారితీస్తుందోననే చర్చ నడుస్తోంది.

## రెమ్యూనరేషన్ విషయంలో నయనతార ని దాటేసిన సాయి పల్లవి

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 5,** లేడీ సూపర్ స్టార్ అంటే మన అందరికీ గుర్తుకు వచ్చే పేరు నయనతార ఈమె స్టార్ హీరోల సరసన హీరోయిన్ గా చేసి హిట్లు అందుకోవడమే కాదు, లేడీ ఓరియెంటెడ్ చిత్రాల ద్వారా కూడా సూపర్ హిట్స్ ని అందుకుంది. అందుకే నయనతార ని లేడీ సూపర్ స్టార్ అంటారు. ఆమె తర్వాత అనుష్క ని కూడా లేడీ సూపర్ స్టార్ అని పిలుస్తుంటారు. ఎందుకంటే ఈమె చేసిన లేడీ ఓరియెంటెడ్ సినిమాలు అత్యధిక శాతం సూపర్ హిట్స్ గా నిలిచాయి. అయితే అనుష్క ఇప్పుడు రెగ్యులర్ గా సినిమాలు చేయడం లేదు, కానీ నయనతార మాత్రం రెగ్యులర్ గా సినిమాలు చేస్తూనే ఉంది. అయితే ఆమె ఇండియా లోనే అత్యధిక రెమ్యూనరేషన్ ని అందుకునే హీరోయిన్స్ లో ఒకరిగా నిల్చిన సంగతి అందరికీ తెలిసిందే. సౌత్ లో ఒక వెలుగు వెలిగిన ఈమె బాలీవుడ్ లో షారుఖ్ ఖాన్ తో కలిసి 'జవాన్' అనే చిత్రంలో నటించింది.ఈ సినిమా కమర్షియల్ గా సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ గా నిలిచి 1200 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రంలో హీరోయిన్ గా చేసినందుకు నయనతార అందుకున్న రెమ్యూనరేషన్ 12 కోట్లు. మిగిలిన సినిమాలకు కూడా ఆమె 10 కోట్ల రూపాయిల రేంజ్ లో యావరేజ్ గా రెమ్యూనరేషన్ ని అందుకుంటుంది. అయితే ఇప్పుడు నయనతార ని రెమ్యూనరేషన్ విషయం లో సాయి పల్లవి దాటేసింది అంటున్నారు బాలీవుడ్ ట్రేడ్ పండితులు. సాయి పల్లవి ప్రస్తుతం బాలీవుడ్ లో రామాయణం చిత్రం చేస్తుంది. ఇందులో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యాష్ రావణుడిగా,రకుల్ ప్రీత్ సింగ్ సూర్పనక్క గా నటిస్తున్నారు. ఈ సినిమా లో సీతగా చేయడానికి సాయి పల్లవి ఏకంగా 15 కోట్ల రూపాయిల రెమ్యూనరేషన్ ని అందుకుంటుంది అట.ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. అంటే రెండు భాగాలకు కలిపి 30 కోట్ల రూపాయిల రెమ్యూనరేషన్ ని సాయి పల్లవి అందుకోబోతుంది అన్నమాట. ఇది మామూలు విషయం కాదు. ఈ రేంజ్ రెమ్యూనరేషన్ నేటి తరం స్టార్ హీరోయిన్స్ లో ఎవ్వరూ అందుకోలేదు. ఎందుకు ఆమెకు అంత ఇస్తున్నారంటే, సౌత్ లో సాయి పల్లవి కి ఉన్న క్రేజ్ కారణంగానే అని అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. సౌత్ లో కేవలం ఈమె పేరు ని చూసి థియేటర్స్ కి కదిలే ఆడియన్స్ లక్షల సంఖ్యలో ఉంటారట. అందరూ ఈమెని లేడీ పవర్ స్టార్ అని పిలుస్తుంటారు . కేవలం ఈమె డ్యాన్స్ వేయడం వల్ల సూపర్ హిట్ అయిన సినిమాలు చాలానే ఉన్నాయి. అందుకే ఈమె క్రేజ్ సినిమాకు చాలా వరకు కలిసొస్తుందని నిర్మాతలు ఆమె ఎంత డిమాండ్ చేసిన ఇవ్వడానికి సుముఖత చూపిస్తున్నారట.

# ఆగని మల్టీ మార్కెటింగ్ మోసాలు

పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ! తక్కువ టైమ్‌లో.. ఎక్కువ ఆదాయం! ఇంట్లో నుంచే.. బీరువాల నిండా సంపాదించండి! ఇలాంటి ప్రకటనలతో.. ముందూ వెనకా ఆలోచించకుండా.. అత్యాశకు పోయి ఎంతో మంది భారీగా నష్టపోతున్నారు. నెట్‌వర్కింగ్ పేరుతో కొందరు కేటుగాళ్లు నట్టేట ముంచేస్తున్నారు. బిజినెస్, ప్రొడక్ట్, మార్కెటింగ్ అంటూ తెలివిగా మోసం చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో.. ఈ తరహా మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలు పెరిగిపోయాయ్. ఇప్పటికైనా మేలుకోని.. తేరుకోకపోతే.. భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.తక్కువ టైంలో ఎక్కువ లాభాలు ఆర్జించొచ్చు. ఎంతమంది ఏజెంట్లని చేర్పిస్తే అన్ని రివార్డులు, పాయింట్లు, రిఫర్ చేస్తే బోనస్‌లు వస్తాయని ఆశ చూపే దందాలు ఈ మధ్యకాలంలో ఎక్కువైపోయాయ్. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. ఈ దేశంలో మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలు మళ్లీ పెరుగుతున్నాయ్. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, హెర్బల్ ప్రొడక్ట్స్, హెల్త్ కేర్ ఉత్పత్తులు, క్రిప్టో కరెన్సీ, నిత్యవసర వస్తువులు, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్, ఎలక్ట్రిక్ బైకుల అమ్మకాల పేరిట అడ్డంగా మోసం చేస్తున్నారు. పిరమిడ్ మోడల్ తరహా మోసాలు చేసే కేటుగాళ్లంతా.. ఇప్పుడిదే పనిలో ఉన్నారు. తమ దగ్గర ప్రొడక్టులు కొని మార్కెట్‌లో విక్రయిస్తే.. భారీ లాభాలు వస్తాయని చెప్పి.. జనం ఆశల్ని, అమాయకత్వాన్ని క్యాష్ చేసుకునే ఏజెంట్లు ఎందరో ఉన్నారు.వి-కెన్, ఆమ్‌వే, క్యూనెట్, వెస్టీజ్, హెర్బల్ లైఫ్, సంకల్ప్ మార్ట్, ఆఐజి టెక్నాలజీస్, ఫ్రైడే అప్ కన్సల్టెన్సీస్.. ఇలా చెప్పుకుంటూ పోతే లిస్ట్ చాంతాడంత ఉంటుంది. ఈ జాబితాలోనే ఇప్పుడు చేసింది ఏడీఎంఎస్ వ-బైక్స్.. ప్రతిసారీ కంపెనీ పేరు మారుతుంది. దాని బిజినెస్ మారుతుంది. అందులోని స్కీమ్ మారుతుంది కానీ.. స్కామ్ మాత్రం మారదు. అదే స్క్రిప్ట్, అదే సినిమా. అందులో క్యారెక్టర్స్ మారతాయి కానీ.. మోడల్ మారదు.

లైఫ్‌లో సక్సెస్ అయ్యేందుకు.. దీనిని మించిన అవకాశం మరొకటి లేదు.. రాదు అని కథలు చెబుతారు. మిమ్మల్ని మోటివేట్ చేస్తారు. బ్రెయిన్ వాష్ చేస్తారు.వాళ్ల దారిలోకి తెచ్చుకుంటారు. మనల్ని మోసం చేయడమే కాదు.. మన చేత మరో నలుగురైదుగురిని మోసం చేయమని చెబుతారు. డబ్బుల మీదున్న ఆశతో.. ఎంతో మంది అమాయకులు ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీల ఏజెంట్లు చెప్పింది విని మోసపోతున్నారు. వాళ్లు చెప్పినట్లుగా చేస్తూ.. మిగతా వాళ్లు కూడా నష్టపోయేందుకు కారకులవుతున్నారు. ఇలా.. వందల కోట్లలో వసూలు చేసి.. బోర్డు తిప్పేసిన కంపెనీల లిస్టు చాలానే ఉంది. ఈజీగా మనీ వస్తుందని ఆశపడితే.. తర్వాత నష్టపోవాల్సిందే మీరేనని మార్కెట్ నిపుణులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోడల్‌లో.. కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన స్కామే.. ఏడీఎంఎస్ ఈ-బైక్స్. బైక్‌ల పేరుతో వ్యాపారం మొదలుపెట్టిన కంపెనీ.. ఆ బైకులు అమ్మకుండా.. చైన్ మార్కెటింగ్ వ్యాపారం చేస్తోంది. రిజిస్ట్రేషన్, మెంబర్‌షిప్, ఐడీ జనరేషన్ అని చెబుతూ.. జనాల నుంచి డబ్బులు వసూలు చేసి.. వారినే మార్కెటింగ్ ఏజెంట్లుగా మార్చేస్తోంది. జనం డబ్బుతో.. వాళ్లు వ్యాపారం చేస్తూ.. వేల కోట్లు వెనకేస్తున్నారు. కొద్దో గొప్ప డబ్బులకు ఆశపడి.. ఈ స్కీమ్‌లో ఏజెంట్లుగా చేరుతున్న వాళ్లెందరో ఉన్నారు.ఎప్పుడైతే.. సైబర్ మోసాలపై జనంలో అవగాహన పెరగడం మొదలైందో.. కేటుగాళ్లంతా ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌పై కన్నేశారు. చైన్ బిజినెస్ పేరుతో.. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ద్వారా ప్రకటనలు గుప్పించి.. అమాయకులను మోసగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మల్టీలెవెల్ మార్కెటింగ్ స్కీములు నడిపే కేటుగాళ్లలో.. చాలా మంది మంది విదేశాల్లోనే ఉండి ఈ పిరమిడ్ రాకెట్ నడుపుతుంటారు. భారీ లభాలతో పాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట.. ఏజెంట్ల ద్వారా అమాయకులకు వల వేస్తున్నారు.ఈ మల్టీలెవెల్ మార్కెటింగ్ మోసాలన్నీ.. స్టాలిన్ సినిమా తరహాలోనే ఉంటాయ్. నువ్వో ముగ్గురికి సాయం చెయ్.. ఆ ముగ్గురిని మరో ముగ్గురి చొప్పున సాయం చేయమని చెప్పండి లాగే ఉంటుంది వ్యవహారం. ఇలా చైన్ సిస్టమ్ ద్వారా డబ్బులు కట్టించుకోవడం, పెద్ద మొత్తంలో జమ అయ్యాక జెండా పీకేయడం ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నదే! ఇప్పుడు.. ఈ-బైక్స్ పేరుతో ఏడీఎంఎస్ చేస్తున్నది కూడా ఇదే దందా. కొన్ని కంపెనీలు తమ దగ్గర ప్రొడక్ట్స్ కొని.. మార్కెట్‌లో సేల్ చేసుకోమని చెబుతాయ్.

ఇంకొన్ని.. కచ్చితంగా ప్రతి నెలా తమ ఉత్పత్తుల్ని కొనాల్సిందే అంటాయ్. తర్వాత.. మిగతా వాళ్లని కూడా చేర్పించమని చెబుతాయ్. కానీ.. ఏడీఎంఎస్ అలా కాదు.మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయ్. ఈ కంపెనీలు.. తమ డైట్ సప్లిమెంట్ల నుంచి క్లీనింగ్ ప్రొడక్ట్స్ వరకు ఏవైనా జనం భారీగా కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తాయ్. ఆ తర్వాత వీటిని సేల్ చేయడం ద్వారా ప్రజలు ఆదాయాన్ని సంపాదించే వీలుందని చెబుతాయి. నిజానికి ఇలాంటి కొన్ని స్కీమ్‌లలో భారీగా ఏజెంట్లను నియమించుకోవడం ద్వారా కంపెనీలు డబ్బులు సంపాదిస్తూ ఉంటాయ్. కింది స్థాయిలో జనం పెట్టే డబ్బు ద్వారానే.. పైస్థాయిలో ఉండేవారికి లాభాలు వస్తుంటాయ్.అయితే.. అతి తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెబితే.. కచ్చితంగా అది మోసమేనని గ్రహించాలి. లేకపోతే.. మిమ్మల్ని ఆ స్కామ్‌లోకి దించి.. మీ డబ్బులు కొల్లగొడతారు. అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. ఈ చైన్ మార్కెటింగ్‌లో.. ముందు చేరిన వారికే లాభాలు వస్తాయి. ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. అందువల్ల.. ఇలాంటి నెట్‌వర్క్‌ల్లో ఎవరూ చేరొద్దు. ఆ కంపెనీలు పెట్టే మీటింగ్‌లకు కూడా వెళ్లొద్దు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసపూరిత ప్రకటనలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు పోలీసులు. పిరమిడ్ విధానంలో చేసే మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్‌ల్లో.. మొదట జాయిన్ అయిన వారికే డబ్బులొస్తాయని చెబుతున్నారు. కొన్నాళ్ల తర్వాత.. చివరికి జాయిన్ అయినవారు పెద్ద ఎత్తున నష్టపోతారని హెచ్చరిస్తున్నారు.ఒకప్పుడు వారం స్కీములు, నెలవారీ లాటరీలు అంటూ మోసం చేసేవారు. మాయమాటలు చెప్పి డబ్బులు కట్టించుకునేవారు. తర్వాత.. పెద్ద మొత్తంలో జమవగానే ఆ సొమ్ముతో ఉడాయించేవారు. ఇప్పుడు.. రోజులు మారాయ్. టెక్నాలజీ పెరిగింది. అంతా హైలెవెల్ మార్కెటింగ్ మోసాల ట్రెండ్ నడుస్తోంది. తక్కువ పెట్టుబడి.. ఎక్కువ సంపాదన! కూర్చున్న చోటే.. కాసుల వర్షం! లాంటి ఏదో ఒక స్కీమ్ పేరుతో.. భారీ స్కామ్‌లకు పాల్పడుతున్నారు కేటుగాళ్లు. అందువల్ల.. మల్టీ లెవెల్ మార్కెటింగ్ బిజినెస్‌ల జోలికి వెళ్లొద్దని నిపుణులు సూచిస్తున్నారుఇలా నిబంధనలకు విరుద్ధంగా నడిచే ఈ విధమైన స్కీమ్‌లకు వ్యతిరేకంగా ఎన్నో చట్టాలున్నాయ్. ప్రధానంగా.. సెమీ అర్బన్, రూరల్ ఏరియాల్లోని ప్రజల్ని ఆకర్షించి ఈ స్కీముల్లో జాయిన్ చేస్తున్నారు. హోటల్స్, ఫంక్షన్ హాల్స్‌లో మీటింగ్స్ ఏర్పాటు చేసి.. వీటి గురించి చెబుతుంటారు.

ఇలాంటి స్కీముల్లో ఎవరూ చేరొద్దు. ఒకవేళ మీ దగ్గరలో ఇలాంటి మీటింగులు జరిగితే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

# దిగొచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ




న్యూయార్క్, మార్చి 5, ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ అమెరికాతో ఖనిజాల, భద్రతా ఒప్పందంపై సంతకం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బలమైన నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శుక్రవారం శ్వేతసౌధంలో ట్రంప్‌తో తన సమావేశం నిరాశపరిచిందని వోలోడిమిర్ జెలెన్‌స్కీ అంగీకరించారు. అయితే ఆయన మరోసారి ఉక్రెయిన్ పట్ల తన నిబద్ధతను వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ జావెలిన్ క్షిపణులను ఇచ్చినందుకు ట్రంప్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సరైన సమయమని, పరిస్థితులను చక్కదిద్దేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.ఉక్రెయిన్ శాంతి కోస తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించాలనుకుంటున్నట్లు వోలోడిమిర్ జెలెన్‌స్కీ ఒక ప్రకటనలో తెలిపారు. 'మనలో ఎవరూ అంతులేని యుద్ధాన్ని కోరుకోరు. శాశ్వతంగా శాంతిని తీసుకురావడానికి ఉక్రెయిన్ త్వరలో చర్చలకు కూర్చోవడానికి సిద్ధంగా ఉంది. శత్రుత్వానికి ముగింపు పలికేందుకు సత్వర చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. మొదటి దశలో ఖైదీల విడుదల, వైమానిక దాడులను ఆపేందుకు కాల్పుల విరమణ ఉంటుంది. రష్యా కూడా అదే పని చేస్తే యుద్ధాన్ని చల్లార్చవచ్చు. తదుపరి చర్యల కోసం వేగంగా పనిచేయాలని మేం కోరుకుంటున్నాం. బలమైన తుది ఒప్పందాన్ని అంగీకరించడానికి యూఎస్‌తో కలిసి పనిచేస్తాం.' అని చెప్పారు.వోలోడిమిర్ జెలెన్‌స్కీ అమెరికా మద్దతును ప్రశంసించారు. ఉక్రెయిన్ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి యూఎస్ ఎంత దోహదం చేసిందో మేం నిజంగా అభినందిస్తున్నామన్నారు. అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్‌కు జావెలిన్ క్షిపణులను అందించినప్పుడు పరిస్థితులు మారిన క్షణాన్ని మనం మర్చిపోలేమన్నారు.వోలోడిమిర్ జెలెన్‌స్కీ ఖనిజ, భద్రతా ఒప్పందం గురించి మాట్లాడుతూ.. 'ఉక్రెయిన్ ఏ సమయంలోనైనా, ఏ సౌకర్యవంతమైన ఫార్మాట్లోనైనా దానిపై సంతకం చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ ఒప్పందాన్ని మరింత భద్రత, దృఢమైన భద్రతా హామీల దిశగా ఒక అడుగుగా మేం భావిస్తున్నాం. ఇది సమర్థవంతంగా పనిచేస్తుందని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.' అని చెప్పారు.అయితే సైనికపరంగా ఉక్రెయిన్‌కు వెళ్లాల్సిన సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. తనతో చర్చలు విఫలమైన తర్వాత ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అయితే దీని తర్వాత కొన్ని గంటల్లోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ దిగివచ్చారు. తమ దేశంలో ఖనిజాలు తవ్వుకునేందుకు ఒప్పందానికి సిద్ధమేనని చెప్పారు.

# భర్తను కొడుకు, భార్య హతమార్చేశారు

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి మార్చి 5,** సమాజంలో రోజురోజుకీ హత్యాకాండలు పెరిగిపోతున్నాయి. మనిషిని మనిషి చంపుకోవటమే దారుణం.. అలాంటిది అయినవాళ్లు తమ ఆత్మీయులను, కుటుంబసభ్యులను దారుణంగా కడతేర్చుతున్నారు. మనిషి మృగంలా మారిపోయి ఇష్టారీతిన నేరాలకు పాల్పడుతున్నాడు. తాజాగా హైదరాబాద్ మహానగరంలో జరిగిన ఓ దారుణ ఘటన ఈ విషయాన్ని మరోసారి రుజువు చేసింది. అత్యంత దారుణంగా ఓ వ్యక్తి కాళ్లు, చేతులు కట్టేసి స్వయానా కట్టుకున్న భార్య, కన్న కొడుకే ఈ హత్య చేయడం గమనార్హం.బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిరిధిలోని క్రిస్టల్ టౌన్‌లో ఈ దారుణ హత్య చోటు చేసుకుంది. వెటర్నరీ డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మసీఉద్దీన్ అనే వ్యక్తిని అతి కిరాతకంగా రెండో భార్య షబానా, అతని కొడుకు సమీర్ హతమార్చారు. కాళ్లు, చేతులు కట్టేసి చాకుతో గొంతు కోసి ఈ దారుణ ఘటనకు పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న బండ్లగూడ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా హతుడు మసీఉద్దీన్ అచేతన స్థితిలో పడి ఉన్నాడు. అయితే కుటుంబంలో కలహాలే హత్యకు దారి తీశాయనే దిశగా పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఏపీలో కూటమి దండయాత్ర...

విజయవాడ, మార్చి 5, ఏపీలో పట్టభద్రులు తెలుగుదేశం పార్టీకి జై కొట్టారు. తాజాగా జరిగిన రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో టిడిపి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. కృష్ణా- గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆలపాటి రాజా విజయం సాధించారు. ఉభయగోదావరి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపొందారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ లోని ఐదు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను టిడిపి క్లీన్ స్వీప్ చేసినట్లు అయ్యింది. రెండేళ్ల కిందట తూర్పు, పశ్చిమ రాయలసీమతో పాటు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. 2019లో అధికారంలోకి వచ్చింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అటు తరువాత వచ్చిన అన్ని ఎన్నికల్లో సత్తా చాటింది. పంచాయితీ, ప్రాదేశిక, మున్సిపల్ ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధించింది. ఇక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదన్న రీతిలో విశ్లేషణలు నడిచాయి. ఇటువంటి తరుణంలో 2023 మార్చిలో వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టుగా మారాయి. ఏకకాలంలో 3 పట్టభద్రుల ఎమ్మెల్సీ సీట్లను టిడిపి కైవసం చేసుకుంది. జగన్మోహన్ రెడ్డికి కీలకమైన రాయలసీమలో సైతం సత్తా చాటింది తెలుగుదేశం పార్టీ. అప్పటివరకు ఉన్న రాజకీయ సమీకరణలను మార్చేసింది ఆ ఎన్నిక. దాంతోపాటు ఎమ్మెల్యే కోట కింద జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో.. ఒక ఎమ్మెల్సీ ని సాధించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సవాల్ చేసింది తెలుగుదేశం. ఒక విధంగా చెప్పాలంటే అక్కడి నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభం అయ్యింది. 2023 మార్చిలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి ఘనవిజయం సాధించింది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానం నుంచి టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు ఘనవిజయం సాధించారు. అలాగే పశ్చిమ రాయలసీమ స్థానం నుంచి టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి విజయం సాధించారు. కడప,అనంతపురం, కర్నూలు జిల్లాలకు కలుపుతూ రాయలసీమ పశ్చిమ నియోజకవర్గం ఉంది. అప్పట్లో ఇక్కడ నుంచి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి గెలుపొందారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కంచర్ల శ్రీకాంత్ టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలో విస్తరించి ఉంది ఈ నియోజకవర్గం. అదే సమయంలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలతో ఉన్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ నుంచి టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు గెలిచారు. తాజాగా ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానం.. కృష్ణా-గుంటూరు జిల్లాలకు సంబంధించి పట్టభద్రుల నియోజకవర్గాన్ని సైతం టిడిపి అభ్యర్థులు సొంతం చేసుకున్నారు. దీంతో రాష్ట్రంలో ఉన్న ఐదు పట్టభద్రుల స్థానాలు టీడీపీ ఖాతాలో పడినట్టే. సాధారణంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో కేవలం.. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారికి ఓట్లు ఉంటాయి. అంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పట్టభద్రులు తెలుగుదేశం పార్టీకి ఏకపక్షంగా మద్దతు తెలిపినట్టే. ఈ ఐదు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల పరిధిలో ఉమ్మడి 13 జిల్లాలు ఉన్నాయి. అన్ని జిల్లాల్లోని పట్టభద్రులు తెలుగుదేశం అభ్యర్థులకు జై కొట్టడం నిజంగా విశేషమే.

# ఏపీకి మళ్లీ మోడీ...

విజయవాడ, మార్చి 5, ఏపీ విషయంలో ఉదారంగా వ్యవహరిస్తున్నారు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీకి ప్రత్యేక నిధులు, ప్రాజెక్టులు మంజూరు చేస్తున్నారు. గతంలో విశాఖకు వచ్చి లక్షల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. విశాఖపట్నం రైల్వే జోన్ కు శంకుస్థాపన చేశారు. అయితే ప్రధాని మరోసారి ఏపీకి వస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందింది. ఈనెల రెండో వారంలో ప్రధాని మోదీ ఏపీకి రానున్నట్లు తెలుస్తోంది. జనవరిలో విశాఖలో ప్రధాని మోదీ పర్యటించారు. రెండు నెలల తిరగకముందే.. మరోసారి ఏపీకి ప్రధాని వస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. కృష్ణా జిల్లా నాగాయలంక మండలం గొల్లలమోదలో నిర్మించ తలపెట్టిన రక్షణ శాఖకు చెందిన క్షిపణీ పరీక్ష కేంద్రానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. రక్షణ శాఖలో కీలకమైన క్షిపణి వ్యవస్థకు మోడీ సర్కార్ అత్యంత ప్రాధాన్యమిస్తూ వస్తోంది. ఈ క్రమంలో గత టిడిపి హయాంలోనే నాగాయలంకలోని గుల్లలమోదను ఎంపిక చేశారు. సమీపంలోనే తీరం ఉండడం.. భూమ్యాకర్షణ శక్తి కూడా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దీనిని ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఐదేళ్లలో ఈ ప్రాజెక్టు కోసం డిఆర్డీ 15 వేల కోట్ల నుంచి 20వేల కోట్ల వరకు ఖర్చు చేసే అవకాశం కనిపిస్తోంది. ఇక్కడ క్షిపణి పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అనుకూలమని 2011లోనే తేలింది. 2017లో భూ కేటాయింపులు జరిగినా.. మిగతా పనులు నిలిచాయి. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వంతో కేంద్రం చర్చించింది. శంకుస్థాపనకు తానే వస్తానని మోడీ స్వయంగా అంగీకరించారు. కానీ ఎందుకో అప్పటి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో సానుకూలత చూపింది. దీంతో ప్రధాని మోడీ సైతం శంకుస్థాపనకు సిద్ధపడ్డారు. అదే విషయంపై కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వపరంగా ప్రధాని మోదీ పర్యటనకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ కు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు అవుతోంది. ఇప్పటికే విశాఖ జిల్లాలో 2 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి శంకుస్థాపన చేశారు ప్రధాని మోదీ. ప్రత్యేక రైల్వే జోన్ కు సైతం శంకుస్థాపన చేసి ఏపీ పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అయితే గత రెండుసార్లు కంటే ఈసారి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు ఏపీకి. ఎన్డీఏలో టిడిపి కీలక భాగస్వామి కావడంతోనే ప్రాధాన్యత ఇస్తున్నట్లు గెలుస్తోంది. అయితే మిగతా రాష్ట్రాలు మాత్రం ఈ విషయంలో పెదవి విరుస్తున్నాయి. కేవలం ఏపీకి మాత్రమే ప్రాధాన్యం ఇస్తుండడాన్ని ప్రశ్నిస్తున్నాయి

# రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిది** తెలంగాణ వ్యాప్తంగా ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఒక్క విద్యార్థిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఎగ్జామ్స్ సెంటర్ కు పంపిస్తున్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష సమయం కాగా తప్పనిసరి పరిస్థితుల్లో ఐదు నిమిషాల ఆలస్యమైన అనుమతిస్తామని అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల అడ్రస్ విషయంలో గందరగోళానికి గురికాకుండా హాల్ టికెట్ లపై అధికారులు క్యూఆర్ కోడ్ ముద్రించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తుల కూడా అధికారులు ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేసారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఎటువంటి షాపులను సైతం తెరవకుండా చూస్తున్నారు. పరీక్షా కేంద్రం దగ్గరలో ఉన్న జిరాక్స్ షాపులు మూసివేసారు.

# జగన్ ను క్షమిస్తున్నా....

విజయవాడ, మార్చి 5 తమను ప్రతిపక్ష పార్టీగా గుర్తించి, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజు వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. 11 నిమిషాలు అసెంబ్లీలో ఆందోళనకు దిగి నినాదాలు చేసి, గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించి సభ నుంచి వాకౌట్ చేయడం తెలిసిందే. ఈ క్రమం ఏపీ అసెంబ్లీలో బుధవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారని, ఆయనను తాను క్షమించేశానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష హోదాపై వైసీపీ ఎమ్మెల్యే జగన్, ఆ పార్టీ సభ్యులు నిరాధార ఆరోపణలు, ప్రకటనలు చేయడాన్ని స్పీకర్ తప్పుపట్టారు. బుధవారం సభలో అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ.. 'ప్రతిపక్ష హోదాపై జగన్ కోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టుల విచారణ పూర్తయ్యే వరకు వేచి చూద్దాం అనుకున్న. కానీ జగన్ సహా వైసీపీ సభ్యులు ప్రతిపక్ష హోదా తమకు దక్కకపోవడంపై చేసిన తీవ్ర వ్యాఖ్యలు నా దృష్టికి వచ్చాయి. జగన్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. స్పీకర్ సీటుపై దురుద్దేశాన్ని ఆపాదించడం సభ నియమాల ఉల్లంఘన కిందకు వస్తుంది. దేవుడు తిరస్కరించిన వరాన్ని పూజారి నుంచి ఆశించడం తప్పే' అని అయ్యన్న పాత్రుడు అన్నారు. నిబంధనల ప్రకారం మొత్తం 175 మంది సభ్యులుండగా, 10 శాతం సీట్లు అంటే 18 స్థానాలు ఆ పార్టీ నెగ్గాల్సి ఉంటుందన్నారు. అలా కాని పక్షంలో ప్రతిపక్ష హోదా ఉండదని వైఎస్ జగన్ గతంలో అసెంబ్లీలో చెప్పారని అయ్యన్న పాత్రుడు గుర్తుచేశారు. కానీ ఇప్పుడు తన వరకు వచ్చేసరికి నిబంధనలు తుంగలో తొక్కి, ప్రతిపక్ష హోదా స్పీకర్ ఇవ్వడం లేదని దుష్ప్రచారం చేసిన జగన్ ను క్షమించి వదిలేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది జూన్ 24న ప్రతిపక్ష హోదా డిమాండ్ చేస్తూ, బెదిరింపులతో జగన్ తనకు లేఖ రాశారని, ఆపై హైకోర్టును సైతం ఆశ్రయించారని స్పీకర్ పేర్కొన్నారు. కోర్టులో సైతం పిటిషన్ విచారణకు తీసుకోవాలా వద్దా స్థితిలో ఉందని తెలిపారు. ప్రతిపక్ష హోదాపై వైసీపీ అధినేత జగన్ సహా ఆ పార్టీ నేతలు అసత్యాలు ప్రచారం సరికాదని స్పీకర్ అయ్యన్న పాత్రుడు హితవు పలికారు. తమ నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతారని ప్రజలు సభ్యులను గెలిపిస్తారు. కానీ వైసీపీ సభ్యులు వీటిని పట్టించుకోకుండా, ప్రతిపక్ష హోదా డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ సభ్యులు సభకు రాకపోతే వారి నియోజకవర్గాల సమస్యల్ని సభలో ఎవరు లేవనెత్తున్నారు. అందుకే వైసీపీ సభ్యులను సభకు వచ్చి, సమస్యలపై ప్రశ్నించాలని.. తమకు తోచిన సలహాలు, సూచనలు చేయాలని స్పీకర్ పిలుపునిచ్చారు. సభకు వచ్చి హుందాగా వ్యవహరించి తమ నియోజకవర్గం కోసం ప్రశ్నించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# కనగల్ లో మంత్రి కోమటిరెడ్డి పర్యటన

నల్లగొండ జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటించారు. తన సొంత నియోజకవర్గంలోని కనగల్ మండలంలో కొత్తగా నిర్మించిన ప్రైమరీ హెల్త్ సెంటర్ (పీహెచ్.సీ) ని మంత్రి ప్రారంభించారు. తరువాత సెంటర్ ఫర్ లైఫ్ సైన్సెస్ , మహీంద్రా యూనివర్సిటీ ల సహకారంతో చేపట్టిన గ్లకోమా పైలెట్ ప్రాజెక్ట్ ను సైతం ప్రారంభించారు. స్థానిక కస్తుర్భాగాంధీ బాలికా విద్యాలయాన్ని మంత్రి కోమటిరెడ్డి సందర్శించారు.

# సీఎం చంద్రబాబును కలిసిన ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీనివాసులు



అమరావతి, మార్చి 5 :-ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీగా విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. ఉండవల్లి నివాసంలో సీఎంను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన విజయానికి అన్ని విధాలా సహకరించినందుకు సీఎంకు, కూటమికి శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులును సీఎం అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు, వారిని అన్ని వేళలా గౌరవిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి మంత్రి నారా లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారని, ప్రభుత్వ పాలసీల రూపకల్పన విషయంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాకే నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నాణ్యమైన బోధనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పీఆర్టీయు రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య, ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాలజీ, ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు ఏజీఎస్ గణపతి రావు, ఎస్టీయు విశాఖ జిల్లాకార్యదర్శి ఇ.పైడి రాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎష్.సదాశివరావు, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, గుంటూరు జిల్లా పీఆర్టీయు అధ్యక్షులు జీవీఎస్ రామకృష్ణ, రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాశీ విశ్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

# పుట్టపర్తి నియోజకవర్గంలో హంద్రీనీవా ద్వారా 193 చెరువులకు,2 రిజర్వాయర్లు ఎప్పటిలోగా నీళ్లు ఇస్తారు ?

## వాటి పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారు?

## పుట్టపర్తి నియోజకవర్గ రైతాంగ సమస్యలపై అసెంబ్లీ సమావేశంలో గళం వినిపించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



పుట్టపర్తి :05 పుట్టపర్తి నియోజకవర్గంలో 6 మండలాల్లో ఉన్న 193 చెరువులు రెండు రిజర్వాయర్లు హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా ఎప్పట్లోగా పనులు పూర్తి చేసి నీరు ఇస్తారు తెలపాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం ద్వారా అసెంబ్లీలో రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని ప్రత్యేకంగా కోరారు. ఈ చెరువులు నింపి పుట్టపర్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలనే ఆలోచనతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2018 లో రూ. 3 కోట్ల 40 లక్షలతో (డి పీఆర్ )డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ కోసం నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. మా నియోజకవర్గంలోని ఈ 193 చెరువులతో పాటు రెండు రిజర్వాయర్లకు నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ద్వారా కేటాయించిన బడ్జెట్ ఎంత? ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారో తెలపాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వం ద్వారా రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారిని ఈ సందర్భంగా సమాధానం అడిగారు. వీటి పనులకు రైతుల నుంచి ఎంత భూసేకరణ చేశారు రైతులకు చెల్లించిన పరిహారం ఎంత ఇంకా ఎంతమందికి చెల్లించాల్సి ఉంది ?ఆ మిగతా పరిహారం ఎప్పటిలోగా రైతులకు చెల్లిస్తారో ప్రభుత్వం ద్వారా తెలపాలని ఎమ్మెల్యే కోరారు. ముఖ్యంగా ముఖ్య ఉద్దేశం హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా ఈ నాలుగు జిల్లాల్లో ఉన్న సుమారు ఆరు లక్షల ఐదువేల ఎకరాలకు సాగునీరు ,ప్రజలకు త్రాగునీరు అందించే ఉద్దేశంతో చేపట్టిన పథకమని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3లక్షల 25వేల ఎకరాలకు సాగునీరు ,ప్రజలకు త్రాగునీరు అందించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక గొప్ప ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టి ఆనాడు బాగా వెనుకబడిన కరువు ప్రాంతమైన ఈ పుట్టపర్తి ప్రాంతానికి ఈ హంద్రీ నీవా జలాలను అందించి సస్యశ్యామలం చేయాలనే మంచి ఉద్దేశానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి మా నియోజకవర్గ ప్రజల తరఫున ,నా తరపున ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. హెచ్ ఎన్ ఎస్ ఎస్ ద్వారా సాగునీరు త్రాగునీరు అందించాలని ఎంతో మంచి ఆలోచనలతో ముందుకు వెళ్తున్న ఈ ప్రభుత్వం ఏమైనా డిస్ట్రిబ్యూటర్ సెక్షన్ ఏర్పాటుకు డిపిఆర్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేశారా? వాటిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో సమగ్రంగా తెలపాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఈ సందర్భంగా కోరారు. అదేవిధంగా హంద్రీనీవా కాలువ చుట్టుపక్కల ప్రాంతాల్లో రైతుల పొలాలు ఉన్నాయని ఈ పొలాలకు రైతుల వెళ్లాలంటే ఐదారు కిలోమీటర్లు, సుదూరం ప్రాంతం ప్రయాణించి వెళ్లాల్సి ఉందని ఈ కాలువలపై బ్రిడ్జి నిర్మాణాలు చేపడితే రైతులకు సౌకర్యవంతంగా ఉంటుందని మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకు పోయారు. నియోజకవర్గంలోని హంద్రీనీవా కాలువలపై బ్రిడ్జిలు నిర్మించాలని చాలామంది రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని ఎమ్మెల్యే సభ దృష్టికి వెల్లడించారు. అలాంటి వాటిలో తరుగువాళ్ళపల్లి బుక్కపట్నం మండలం రాజంపల్లి మారాల కొత్తచెరువు మండలం పోతులకుంట మిర్జాపురం పాత దేవరపల్లి పుట్టపర్తి పెద్ద కమ్మవారిపల్లి ప్రాంతాల్లో హంద్రీనీవా కాలువలపై బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. అంతేకాకుండా హంద్రీనీవా ద్వారా చెరువులు నింపడానికి కాలువల్లో స్లుయిజ్ గేట్స్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారిని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సభ ద్వారా ప్రత్యేకంగా కోరారు.

# కల్పన ఆత్మహత్యకు కారణం ఏమిటీ...



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిది మార్చి 5** టాలీవుడ్ మ్యూజిక్ ఇండస్ట్రీ ఒక్కసారి షాక్‌కి గురయింది. ప్రముఖ గాయని కల్పన ఆత్మహత్యకు పాల్పడటం తెలుగు చలన చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్ అయింది. బలవన్మరణానికి పాలు పడాల్సిన అవసరం ఆమెకు ఏం వచ్చింది? ఎందుకు ఈ పని చేశారు? అనే కారణాలు తెలియాల్సి ఉంది. నిజాంపేటలో కల్పన నివాసం ఉంటున్నారు. ఒక గేటెడ్ కమ్యూనిటీలోని విల్లా తీసుకుని జీవిస్తున్నారు. ఆ విల్లాలో నిద్ర మాత్రలు మింగి ఆవిడ ఆత్మహత్యకు పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను పోలీసులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కల్పన అపస్మారక స్థితిలో ఉన్నారని తెలిసింది. ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కల్పన ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో ఆమె భర్త చెన్నైలో ఉన్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. రెండు రోజులుగా విల్లా గేట్లు ఓపెన్ చేయకపోవడంతో అసోసియేషన్ సభ్యులకు సందేహం కలిగి ఆవిడకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదట. దాంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాళ్ళు వచ్చి గేట్లు ఓపెన్ చేయగా... కల్పన అపస్మారక స్థితిలో ఉన్నారట. ప్రస్తుతం కల్పనకు వెంటిలేటర్ మీద వైద్యులు చికిత్స అందిస్తున్నారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఆవిడ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందట. కొన్ని గంటలు గడిస్తే గానీ ఏ విషయం చెప్పలేమని చెప్పారట. కల్పనా రాఘవేందర్ హైదరాబాద్ సిటీలో సెటిల్ అయినప్పటికీ ఆమె స్వస్థలం తమిళనాడు రాజధాని చెన్నై. చిన్నతనం నుంచి సంగీతం మీద ఆసక్తి ఉండేది. కర్ణాటిక్ మ్యూజిక్ నేర్చుకున్నారు. మలయాళ ఛానల్ ఏషియానెట్ నిర్వహించిన 'స్టార్ సింగర్' సీజన్ 5 విజేతగా నిలిచారు. ఆ షో 2010లో జరిగింది. దానికి 20 ఏళ్ళ ముందు నుంచి ఆవిడ పాటలు పాడుతున్నారు. తెలుగు 'బిగ్ బాస్' సీజన్ 1లో కూడా పార్టిసిపేట్ చేశారు. పలు సినిమాల్లో సూపర్ హిట్ సాంగ్స్ పాడారు. కల్పనను ఆస్పత్రికి తరలిస్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అందులో ఆవిడ ఫేస్ చూసి ఆడియన్స్ షాక్ అవుతున్నారు. కల్పన ముఖం అంతలా మారిందేమిటి? అని ఆశ్చర్యపోతున్నారు. ఆవిడ త్వరగా కోలుకోవాలని పరిశ్రమ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు. కల్పన ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో విల్లాలో ఇతరులు ఎవరైనా ఉన్నారా? ఆవిడ కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నారు? పోలీసులకు కల్పన ఆత్మహత్యకు పాల్పడిన సమాచారం ఎవరు అందించారు? అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ప్రాథమిక దర్యాప్తు జరుగుతోందని సమాచారం అందుతుంది. ఏది ఏమైనా ప్రజెంట్ ఆవిడ సూసైట్ అటెంప్ట్ న్యూస్ అందరికీ షాక్ అని చెప్పడంలో ఎటువంటి సందేహం అవసరం లేదు.

# తరాలు మారినా మారనిది స్నేహమే.....



ప్రజాబలం ప్రతినిధిభద్రాద్రి కొత్తగూడెంస్నేహం ఎంతో మధురమైనది. స్నేహానికి లింగ వయోభేదం ఉండదు. ఎన్ని తరాలు మారినా మారనిది స్నేహం ఒక్కటే. అందుకే 1990 -91 వ సంవత్సరంలో 10 వ తరగతి చదివిన మిత్ర బృందం స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం అంటూ బాల్య మిత్రుడికి అండగా నిలిచారు. వివరాల్లోనికి వెళ్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని మారుమూల గిరిజన ఉంజుపల్లి గ్రామానికి చెందిన ఇర్ప ముత్తయ్య కు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలి బూడిదయయింది. దీనికి తోడు రెండు నెలల క్రితం మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా ఒక యాక్సిడెంట్ లో కాలు విరిగింది. దాంతో అతడు పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. రేక్కాడితే గాని డొక్కాడని ఆ నిరుపేద యొక్క హీన స్థితిని చూసి చలించిన మిత్రబృందం మేమున్నామంటూ ముందుకు వచ్చారు. బాల్య మిత్రుడికి తక్షణ సాయంగా 25 వేల రూపాయలతో ఇంటి నిర్మాణానికి కావాల్సిన సిమెంటు రేకులు, సిమెంటు, సిమెంటు స్తంభాలు అందించి స్నేహమంటే ఇదేరా అంటూ 1990-91 పదవ తరగతి మిత్రబృందం ఆపదలో ఉన్న స్నేహితుడికి అండగా నిలిచారు. ఆపదలో ఉన్న మిత్రుడికి అండగా నిలిచిన ఆ మిత్ర బృందానికి గ్రామస్తులు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వర్లు పున్నం రామకృష్ణ ఎడారి సత్యనారాయణ హర్షవర్ధన్ వందే త్రిమూర్తులు గుంటుపల్లి రవి కొంగూరి వెంకటేశ్వర్లు దొమల రాజేశ్వరి సమంతకమణి తడికల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొణిదెల నాగబాబు పేరు ఖరారు చేసిన పవన్ కళ్యాణ్



విజయవాడ, మార్చి 5శాసన సభ్యుల కోటాలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల వ్యవహారంలో ఊహించని ట్విస్ట్ చోటుచేసుకుంది. నిన్నటి వరకూ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగబాబు పేరు ప్రచారం కాగా, బుధవారం ఉదయం ఆయన రాజ్యసభ స్థానం కోసం చూస్తున్నారని ప్రచారం జరిగింది. ఈ ప్రచారం ఊపందుకున్న సమయంలో జనసేన పార్టీ వదంతులకు చెక్ పెట్టింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమిలో భాగంగా జనసేన అభ్యర్థిగా కొణిదెల నాగబాబు పేరును పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఖరారు చేశారు. నాగబాబు ప్రస్తుతం జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని నాగబాబుకి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నుంచి సమాచారం వచ్చింది. దాంతో నాగబాబు నామినేషన్ కు అవసరమైన పత్రాలు సిద్ధం చేయాలని పార్టీ కార్యాలయాన్ని పవన్ కళ్యాణ్ ఆదేశించారని పి.హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

## వికాసిత్ భారత్ జాతీయ యూత్ పార్లమెంటు పోస్టర్ విడుదల.

ప్రజాబలం ప్రతినిధి గోదావరిఖని పెద్దపల్లి మరియు మంచిర్యాల జిల్లా స్థాయి "వికసిత్ భారత్ జాతీయ యూత్ పార్లమెంటు ? 2025" పోస్టర్ విడుదల కేంద్ర యువజన సర్విస్ వారు దేశ వ్యాప్తంగా 300 కాలేజీలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఉద్దేశించిన జిల్లా స్థాయి (పెద్దపల్లి ఒ మంచిర్యాల) "వికసిత్ జాతీయ యూత్ పార్లమెంటు ? 2025" కార్యక్రమం నిర్వహణలో భాగంగా అధిక సంఖ్యలో యువత పేరు నమోదు చేసుకునేందుకు వీలుగా ప్రచార పర్వంలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ డా. జై కిషన్ ఓఝా, నోడల్ ఆఫీసర్ ఏ సాంబశివ రావు, అధ్యాపక బృందం మరియు విద్యార్థులతో కలిసి తేదీ: 05 -03-2025 న కరపత్రాలను, వాల్ పోస్టర్లను మరియు బ్యానర్లను విడుదల చేశారు. జాతీయ యువ పార్లమెంటు ? 2025 నిర్వహణ లో మొదటి దశ అయిన జిల్లా స్థాయి పోటీలో పాల్గొనేందుకు పెద్దపల్లి జిల్లా నుండి మరియు మంచిర్యాల జిల్లానుండి అధిక సంఖ్యలో విద్యార్థులు మై భారత్ పోర్టల్ లో ఒక నిముషం నిడివి కలిగిన వీడియో అప్లోడు చేసి పేరు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపల్ పిలుపు నిచ్చారు. ప్రచారంలో భాగంగా విద్యార్థులలో జాతీయ యువ పార్లమెంట్ ? 2025 కార్యక్రమం పై అవహగహన కల్పించడానికి అధ్యపకులతో కూడిన రెండు ప్రచార బృందాలను ఏర్పాటు చేశారు.
నోడల్ జిల్లా పెద్దపల్లి పరిధిలో ఒక జె. ఎన్. టి. యు. కాలేజీ, ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ, ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఒక యూనివర్సిటీ పి. జి. కాలేజీ, మూడు ప్రభుత్వ డిగ్రీ కోలేజీలు, ఏడు ప్రైవేట్ డిగ్రీ కాలేజీ లని కలుపుకొని మొత్తం 14 కళాశాలల విద్యార్థులను కలిసి ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించడానికి డా. యం. నరేష్ బృందాన్ని నియమించారు.అసోసియేట్ జిల్లా మంచిర్యాల పరిధిలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఒక గురుకుల డిగ్రీ కాలేజీ, నాలుగు ప్రభుత్వ డిగ్రీ కోలేజీలు, దాదాపు ఏడు ప్రైవేట్ డిగ్రీ కాలేజీ లని కలుపుకొని మొత్తం 13 కాలేజీల విద్యార్థులను కలిసి ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించడానికి లెఫ్ట్ నెంట్ బి. తిరుపతి బృందాన్ని నియమించారు.నియమించిన రెండు ప్రచార బృందాలు వారికి చూసించిన కాలేజీలను సందర్శించి "వికసిత్ భారత్ జాతీయ యూత్ పార్లమెంటు ? 2025" కార్యక్రమంలో పాల్గొనడానికి కావలసిన అర్హతలు (18-25 సంవత్సరాలు), మై భారత్ పోర్టల్ లో నమోదు చేసుకోవడానికి చివరి తేదీ (09-03-2025, జిల్లా స్థాయిలో పాల్గొనడానికి ఎంత మందిని సెలెక్ట్ చేస్తారు (150 మంది) మరియు అందులో నుండి రాష్ట్ర స్థాయికి ఎంత మందిని (10 మంది) సెలెక్ట్ చేస్తారో వివరించి చెప్పి, జిల్లా స్థాయి పోటీలు రెండు రోజుల పాటు అనగా మార్చి నెల 16 మరియు 17 వ తేదీలలో జరుగుతాయని, అందులో పాల్గొనడానికి పేరు నమోదు పక్రియను సులువు గా అర్థం చేసుకోవడం కోసం కర పత్రాలను, పోస్టర్లను అందజేస్తారు. నమోదు ప్రక్రియలో సహాయం కోసం 83419 99701 (డా. యం. నరేష్, ఎన్. ఎస్. ఎస్. పీవో), 73868 62488 (డా. డి. కిరణ్మయి, ఎన్. ఎస్. ఎస్. పీవో), 94405 87441 (ఎన్. సీ. సీ ఆఫీసర్ బి తిరుపతి) సాయంత్రం 4:30 వరకు నందు సంప్రదించగలరని ప్రిన్సిపల్ తెలియజేశారు.

## బాకీ తీర్చలేదని హతమార్చారు



పల్నాడు జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. తీసుకున్న బాకీ తీర్చలేదని వడ్డీ వ్యాపారి ఆంజిబాబును కిడ్నాప్ చేసి ఆపై హత్య చేసారు. మృతుడు ఆంజిబాబు వడ్డీ వ్యాపారం చేస్తాడు. సత్తెనపల్లికి చెందిన సుభాని వద్ద 12 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. బాకీ తీర్చకుండా హైదరాబాద్ కి మకాం మార్చాడు. నాలుగు రోజుల క్రితం పిడుగురాళ్లలో ఉన్న తన మిత్రుడు వద్దకి ఆంజిబాబు వచ్చాడు. ఆంజిబాబు రాకని తెలుసుకొని మిత్రులతో అతని వద్దకి సుభాని వెళ్లాడు. ఆంజిబాబుని కారులో ఎక్కించుకుని మాచవరం మండలం నాగేశ్వరపురం తండాకి తీసుకెళ్లారు. అక్కడ బాకీ తీర్చాలని ఆంజిబాబుకి మద్యం తాగించి దాడి చేసారు. తరువాత నోట్లో పురుగుల మందు పోసారు. స్థానికులు అక్కడికి రావడాన్ని చూసి దుండగులు పరారయ్యారు. అంజిబాబు గుంటూరులోని ప్రయివేటు హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హత్యకు గురైన ఆంజిబాబు స్వగ్రామం సత్తెనపల్లి మండలం పాకాలపాడు.

## పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో.. రెండో ప్రాధాన్యత ఓట్లతోనే ఫలితం తేలేది?



హైదరాబాద్ మార్చి 5 పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ముగిసింది. తొలి ప్రాధాన్యతలో ఓట్లలో బిజెపి అభ్యర్థి అంజిరెడ్డికి 75, 675 ఓట్లు పడగా ప్రస్తుతం ఆయన 5,110 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి 70,565 ఓట్లు పడగా బిఎస్‌పి అభ్యర్థికి ప్రసన్న హరికృష్ణకు 60,419 ఓట్లు వచ్చాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితం తేలకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తున్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో మొత్తం చెల్లిన ఓట్లు 2, 23, 343గా ఉన్నాయని ఎన్నికల అధికారులు వెల్లడించారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో మొత్తం చెల్లని ఓట్లు 28,686 ఉన్నట్టు గుర్తించారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో1,11,672 ఓట్లు వస్తే గెలిచే అవకాశం ఉంటుంది.

## కార్పొరేటర్ కు ఎక్కువ..ఎమ్మెల్యే కు తక్కువ.. పవన్ కల్యాణ్ పై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



అమరావతి మార్చి 5 జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.పవన్ జీవితంలో ఒకేసారి ఎమ్మెల్యే అయ్యాడని, ఆయన తీరును చూస్తుంటే కార్పొరేటర్ కు ఎక్కువ.. ఎమ్మెల్యే కు తక్కువ అంటూ వ్యాఖ్యానించారు. వైసీపీ హయాంలో చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా ఇచ్చాం. టీడీపీ సభ్యులు ఐదుగురు పక్కన కూర్చుంటాం అన్నారని, 10 మంది టీడీపీ ఎమ్మెల్యేలను లాగేద్దాం అన్నారని, అయితే తాను వ్యతిరేకించి చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా నేనే ఇచ్చానని స్పష్టం చేశారు.ఇంతమంది సభ్యులుంటేనే ప్రతిపక్ష హోదా అనేది ఎక్కడా లేదని పేర్కొన్నారు. ఎక్కడైనా ప్రభుత్వంలో అధికార పక్షం, ప్రతిపక్షం అనేవి రెండూ ఉంటాయని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడూ అధికార పక్షం, ప్రతిపక్షం రెండూ మీరే చేస్తే ఎలా అంటూ ప్రశ్నించారు.

## నీట్ పరీక్షను నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల పరిశీలించిన కలెక్టర్



ప్రజాబలం ప్రతినిదిసిద్దిపేట జాతీయస్థాయిలో నిర్వహించే ఈ నీట్ పరీక్ష కోసం నేషనల్ టెస్టింగ్ కమిటీ మార్గదర్శకాల ప్రకారం పరీక్ష కేంద్రాలలో గల గదుల సంఖ్య, పార్కింగ్ సౌకర్యం, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా ఫర్నిచర్ లను జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి పరిశీలించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పలు కాలేజీలను పరిశీలించారు. వీటిలోంచి అన్ని సౌకర్యాలతో కూడిన మూడు సెంటర్లను మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్ వెంట డిఇఓ శ్రీనివాస్ రెడ్డి, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్, ఈడియం ఆనంద్ తదితరులు ఉన్నారు.

## అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్‌లోకి గోదావరి జలాలు

ప్రజాబలం ప్రతినిదిహైదరాబాద్ మార్చి 5 బుదవరం ఉదయం అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయక సాగర్‌లోకి గోదావరి జలాలు ఎత్తిపోయడం ప్రారంభించారు. ఇదిలా ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని.. ఎందుకూ పనికిరాదని విమర్శలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వమే నేడు ఇదే కాళేశ్వరం ప్రాజెక్టులోని అంతర్భాగాలైన అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్ల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తూ పంటలకు నీరందిస్తున్నారనే చర్చ జరుగుతున్నది." ఓ వైపు ఎండిపోతున్న పంటలు? మరోవైపు రంగనాయకసాగర్‌లో అడుగంటుతున్న జలాలు" ఈ పరిస్థితిని చూసి దిగాలుగా ఉన్న సిద్దిపేట నియోజకవర్గ రైతుల పక్షాన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ప్రయత్నం ఫలించింది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్ మీదుగా రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి తక్షణమే నీటిని ఎత్తిపోయాలని హరీశ్ రావు ఇటీవల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖకు స్పందన లేకపోవడంతో ఫోన్ చేసి మాట్లాడారు. రైతుల కష్టాల గురించి క్షుణ్ణంగా చర్చించారు. వెంటనే నీరు ఎత్తిపోయకుంటే 50 వేల ఎకరాల్లో పంట ఎండిపోతుందని.. రైతులంతా తీవ్రస్థాయిలో నష్టపోతారని.. క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యాసంగి పంట చేతికొచ్చేదాకా సాగునీటిని అందుబాటులో ఉంచాలని.. గడిచిన నాలుగేళ్ల పాటు సాగునీరు అందించిన తీరును వివరించారు. కనీసం 1టీఎంసీ నీటిని ఎత్తిపోయాలని కోరారు.

## అనధికార లే ఔట్ల క్రమబద్ధికరణ ఈ నెల 31వ తేదీ లోగా చేసుకుంటే 25 శాతం రాయితీ కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ ప్రజాబలం ప్రతినిది జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో (స్థానిక సంస్థల) (రెవెన్యూ )అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీరబ్రహ్మాచారి, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ అనధికార లే ఔట్ల క్రమ బద్దికరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఈ నెల 31వ తేదీ లోగా చేసుకుంటే 25 శాతం రాయితీ ఇస్తుందని జిల్లాలోని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని, క్షేత్ర స్థాయిలో ప్రజలందరికీ ఈ అవకాశం తెలిసే విధంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులతో తెలుపుతూ, ఎల్.ఆర్.ఎస్ ? 2020 క్రింద రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు వచ్చాయని. గత సెప్టెంబర్ 2024 లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని దరఖాస్తుల క్రమ బద్ధీకరణ అవ్వడం జరిగింది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుంది. ఎల్ఆర్ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. లక్షా 90 వేల వరకు ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల ఆమోదించే వాటికి మార్చి 31వ తేదీ వరకు క్రమ బద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుములో 25% మినహాయింపు ఉంటుందన్నారు.


సబ్ రిజిస్టర్ ద్వారా నిర్ణీత నమూనాలో నూతన దరఖాస్తులు సేకరించి ఎల్ ఆర్ ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి క్రమ బద్ధీకరిస్తా రన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేసుకోవాలి. ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించు కొని 25% రాయితీ పొందాలన్నారు. 2020 సంవత్సరంలో రూ 1000/- కట్టి ఎల్ఆర్ఎస్ లో దరఖాస్తు చేసుకున్న వారి అర్జీల పరిశీలన ప్రారంభ మైంది. తమ ప్లాటు రెగ్యులరైజ్ చేసుకునే వారికి ప్లాటు రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటి వాల్యుయేషన్ ప్రకారం ఎల్ఆర్ఎస్లో దరఖాస్తు ఫీజు వేస్తారు. దీంతో ఎల్ఆర్ఎస్లో దరఖాస్తు చేసుకున్న వారికి లాభం జరుగుతుంది. 2020 సంవత్సరంలో అప్లికేషన్ చేసుకున్నవారు, తమ తమ పురపాలక, సంబంధిత కార్యాలయాల్లో సంప్రదించి తమ ప్లాటును రెగ్యులైజ్ చేసుకోగలరన్నారు. అనధికార లే ఔట్ల క్రమబద్దీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఏమైనా అనుమానాలు, ఇబ్బందులు ఎదురైతే సంబందిత మునిసిపల్, గ్రామపంచాయతీ కార్యాలయాలలోని హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని, జిల్లాలోని అర్హులైన వారందరూ గడువు లోగా తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సి.ఈ.ఓ పురుషోత్తం, డి.పి.ఓ హరిప్రసాద్, జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి సాయి కిరణ్, మునిసిపాలిటీల కమిషనర్లు, మండలాల డిప్యుటీ తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంచంద్రబాబుకిమాజీ మంత్రి హరీష్ రావు సవాల్

ప్రజాబలం ప్రతినిదిసిద్దిపేట ఏపీ సీఎం చంద్రబాబుకు మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు. మీకు నిజంగా తెలంగాణపై ప్రేమ ఉంటే సమ్మక్క సారక్క, సీతమ్మ సాగర్, వార్ధా ప్రాజెక్టు, కాళేశ్వరంలో మూడో ప్రాజెక్టుకి అనుమతులు ఇవ్వమని చెప్పండి. అప్పుడు మేము మీకు నిజంగా తెలంగాణపై ప్రేమ ఉందని నమ్ముతామని అన్నారు. మీ రెండు కళ్ళ సిద్ధాంతం కరెక్ట్ అని చెబుతాం. కేంద్ర బడ్జెట్ లో మీ వాటా మీరు తీసుకున్నారు...మరి తెలంగాణకి ఎందుకు ఇవ్వలేదు అని ఎందుకు ప్రశ్నించలేదు. మీకు తెలంగాణపై ప్రేమ లేదు..మా హక్కుల కోసం ఏనాడు పోరాడలేదు. గోదావరిలో తెలంగాణకి 969 టీఎంసీల నీటిని తెలంగాణకి కేటాయించారు అవి మమ్మల్ని వాడుకొనివ్వండి. మీరు మాట్లాడుతున్నదానికి మీ చేతలకు సంబంధం లేదని అన్నారు.

# ఆకట్టుకున్న గర్రెపల్లి ఆధ్యాత్మిక ప్రవచనము

## –ఆమ్నాయవర్ధిని మిత్రబృందం వారిచే నిర్వహణ
## – 9వ తేదీ వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు
## –లోక కళ్యాణార్థం నిర్వహించే మహా కార్యక్రమం



మంథని పట్టణంలోని శ్రీ శీలేశ్వర – సిద్దేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 9వ తేది వరకు సంపూర్ణ ఋగ్వేద స్వాహాకార యజ్ఞము నిర్వహిస్తున్నారు. 3వ తేదీ పాల్గున శుద్ధ చతుర్థి నుండి 9వ తేదీ పాల్గొన శుద్ధ దశమి వరకు ఏడు రోజులపాటు ఈ కార్యక్రమం జరగనుందని శ్రీ ఆమ్నాయవర్ధిని సేవా ట్రస్ట్ సభ్యులు తెలిపారు. బుధవారం గురు వందనము నిత్య పూజ గాయత్రి జప సహిత ఋగ్వేద పారాయణ స్వాహాకారము అలాగే సాయంత్రం 5 గంటలకు సుహాసినిలచే స్తోత్ర పారాయణము, ప్రదోష పూజ రుద్రక్ర మార్చన, బ్రహ్మశ్రీ వేదమూర్తులు గర్రెపల్లి మహేశ్వర శర్మచే ఆధ్యాత్మిక ప్రవచనము, ప్రసాదన వితరణ అనంతరం మంథని గ్రామ భక్తులచే భజన కార్యక్రమం నిర్వహించినట్లు బ్రహ్మశ్రీ వేదమూర్తులు చింతలపల్లి ఉమా శంకర్ గణాపాఠి వారి బృందము, బ్రహ్మశ్రీ వేదమూర్తులు ఒజ్జల గణేష్ అవధాని, ఆమ్నాయవర్ధిని మిత్రబృందము వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తజనులు అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పునీతులు కావాలని వారు కోరారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కొలువుదీరిన మంథనిలో ఇలాంటి కార్యక్రమము నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఆలయ నిర్వాహకులు లోకే మనోహర్, లోకే శరత్ లు తెలిపారు. ఎంతో ప్రతిష్ట కలిగిన ఈ ఆలయాన్ని పునరుద్ధరించే మహాభాగ్యం కలిగినందుకు వారు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

# ముస్సిపల్ ఈ ఈ పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోండి

## బెజ్జంకి అనిల్ మాదిగ ఎం.ఆర్.పి.ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు



**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి**ఫిబ్రవరి 19న కరీంనగర్ మున్సిపాల్ కార్యాలయం లో విధులు నిర్వహిస్తున్న ఈ ఈ రొడ్డ యాదగిరిపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎం.ఆర్. పి ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు బెజ్జంకి అనిల్ మాదిగ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లలో మాదిగ ఉద్యోగులపై కక్ష సాధింపులు జరుగుతున్నవి అనడానికి ఫిబ్రవరి 19న ప్రభుత్వ విధులలో వున్నా ఈ ఈ రొడ్డ యాదగిరి పై చేయి చేసుకున్న వారిపై ఇప్పటివరకు కూడా ఎలాంటి చట్టపరమైనా చర్యలు తీసుకోలేదు అంటే కేవలం అది కులావివక్ష అనేది మాకు స్పష్టంగా అర్ధమవుతుంది. గతంలో ఒక దళిత మాజీ కార్పొరేటర్ మున్సిపాల్ ఉద్యోగి పై దురషుగా ప్రవర్తించాడని అతన్ని అరస్ట్ చేయాలనీ ఉద్యోగస్తులు అందరూ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేసారు కానీ యాదగిరి ఒక మాదిగ సామజిక వర్గానికి చెందిన వారు గనుకే మున్సిపల్ ఉద్యోగస్థులు మౌనం గా ఉండటం అంటే అది కులావివక్షగానే కనబడుతుంది అన్నారు. ఇది కరీంనగర్ జిల్లా లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మా దళిత ఉద్యోగ్యాస్తుల పరిస్థితి ఇలాగే వుంది అని మాకు స్పష్టంగా అర్ధమవుతుంది మాదిగ ఉద్యోగస్తులకు అన్యాయం జరిగితే ఒకలాగా ఇతరులకు జరిగితే ఒకలాగా వ్యవహారిస్తున్నారు అనేది మాకు స్పష్టంగా కనబడుతుంది అందుకోసం మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన ధర్నాలు చేస్తామన్నారు మున్సిపాల్ ఇంచార్జి గా వున్నా కలెక్టర్ ప్రత్యేక చొరువా తీసుకోని ఈ ఈ యాదగిరి న్యాయంచేసి వారిపై చట్టపరమైన చెర్యలు తీసుకోవాలి అన్నారు ఈ కార్యక్రమంలో బెజ్జంకి అనిల్ మాదిగ ఎం ఆర్ పి ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దండు అంజయ్య మాదిగ చెంచాల నవీన్ మాదిగ ఎం ఎస్ పి జిల్లా అధికార ప్రతినిధి నలిగంటి మల్లేశ్వరి మాదిగ దండు వరలక్ష్మి మాదిగ కొమ్ముల రాజమల్లు మాదిగ సోదిమేళ్ల వాణి మాదిగ ఓదెల శంకర్ మాదిగ బుద్దుల రమేష్ మాస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల విద్యార్ధులకు భద్రత కల్పిస్తున్న జిల్లా షీ టీమ్:

## ఎస్పి అఖిల్ మహజన్



**రాజన్న సిరిసిల్ల ప్రజాబలం ప్రతినిధి**జిల్లాలోని విద్యాసంస్థలలో మహిళలు పని చేసే ప్రదేశాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు గడిచిన నెల రోజుల వ్యవధిలో మహిళలను వేధిస్తున్న వారిపై మూడు కేసులు, 5 పెట్టి కేసులు నమోదు.

వేధింపులకు గురైతే వెంటనే షీ టీం 8712656425 పిర్యాదు చేయండి.

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లాలో మహిళల విద్యార్ధుల రక్షణయే లక్ష్యంగా ఏర్పాటు చేసిన షీ టీం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి మహిళ చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పొక్సో, ర్యాగింగ్, ఈవ్ టీసింగ్,వేధింపులకు గురైతే ఎవరిని సంప్రదించాలి అనే మొదలగు అంశాలపై అవగాహన కల్పిస్తూ మహిళల, విద్యార్థినీల భద్రతకు భరోసా కల్పించడం జరుగుతుంది.

గడిచిన నెల రోజుల వ్యవధిలో జిల్లాలో విద్యార్థిని, మహిళలను వేధిస్తున్న ఆకతాయిలపై 3 కేసులు,5 పెట్టి కేసులు నమోదు చేసి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.

విద్యార్థినులు,మహిళలు అభద్రత బావనికి గురైనప్పుడు భయపడొద్దని,ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కి లేదా పోలీస్ అక్కకు ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో మహిళల, విద్యార్థినిల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందని ప్రధానంగా మహిళలు, విద్యార్థినిలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని, ముఖ్యంగా సామాజిక మాద్యమాల్లో పరిచమయమ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం వుండాలని సూచించారు.మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లోగాని,మరేక్కడైన లైంగిక వేధింపులకు గురౌవుతున్న,ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురౌవుతున్న మహిళలు,విధ్యార్ధునులు,బాలికలు మౌనంగా ఉండకుండా, ధైర్యంగా పిర్యాదు చేయాలని సూచించారు.ఎవరైనా ఆకతయులు మహిళలను,యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యాసంస్థలల్లోఎవరైనా వేధించిన,రోడ్డుపై వెళ్లేటప్పుడు,పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100, జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపారు.

జిల్లాలో విద్యాసంస్థల వద్ద షీ టీం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి బైక్ లపై ట్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ విద్యార్థినులకు ఇబ్బందులు గురి చేస్తున్నా వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# పెరవలి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



మద్దికేర మండల పరిధిలోని గల పెరవలి గ్రామం నందు వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం రోజున పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి రవి మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా ఏపీఎఫ్ఆర్ఎస్ హోటల్ నందు తమ వివరాలను తప్పకుండా నమోదు చేసుకోవాలని ఆయన తెలియజేశారు.రైతు వివరాలను నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఆయన తెలియజేశారు.అదేవిధంగా రబీలో పంట నమోదు చేసుకున్న రైతులు తప్పకుండా ఈ కేవైసీను చేయించుకోవాలని ఆయన రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కులగణన సర్వే పత్రాలను తగలబెడితే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా' ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.



**ప్రజాబలం ప్రతినిది హైదరాబాద్ మార్చి 5** పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడున్నారనే కారణంతో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ కొద్ది రోజుల క్రితం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై మల్లన్న బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. 'కులగణన సర్వే పత్రాలను తగలబెడితే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా?' అని ఆయన ప్రశ్నించారు. రాహుల్ గాంధీ తల ఎత్తుకునేలా సర్వే జరగాలని ముఖ్యమంత్రికి సూచించిన విషయాన్ని ఆయన వెల్లడించారు. అందుకే రేవంత్ రెడ్డి తనను సస్పెండ్ చేయాలని చాలాకాలంగా అనుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసిలకు గట్టి మద్దతు లభించిందని.. భవిష్యత్తులో మరింత బలంగా పోరాడుతామని అన్నారు. తనను సస్పెండ్ చేస్తే బీసిలు ప్రశ్నించరనే భ్రమ నుంచి రేవంత్ బయటకు రావాలని అన్నారు. అంతేకాక.. సమగ్ర కుటుంబ సర్వేను కెసిఆర్ పకడ్బందీగా నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కులగణన సర్వేలో అగ్రవర్ణాలను ఎక్కువగా.. బీసిలను తక్కువ చూపించారని ఆరోపించారు. కులగణన సర్వే చేస్తానని హామీ ఇచ్చారు కాబట్టే తాను కాంగ్రెస్ చేరానని తెలిపారు. కెసిఆర్‌పై తాను పోరాటం చేసినప్పుడు కాంగ్రెస్ నేతలంతా ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి పరోక్షంగా బిజెపికి సహకరిస్తున్నారని అన్న మల్లన్న.. సంవత్సరం లోపే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఎందుకు వస్తుందో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. 2028లో బిసినే తెలంగాణ ముఖ్యమంత్రి అవుతాడని ఆయన అన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

## సిద్దిపేటఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు.



**ప్రజాబలం ప్రతినిధి** పరీక్షా కేంద్రాల వద్ద 163 బి ఎన్ ఎస్ ఎస్, 2023 అమలు. సిద్దిపేట పట్టణంలో ఉన్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష కేంద్రాలు ఎన్సాన్ పల్లి తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, బాయ్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మరియు తదితర పరీక్ష కేంద్రాలను పరిశీలించి పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు గురించి తగు సూచనలు సలహాలు చేశారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షలు జరిగే సమయంలో సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు పేపరు వచ్చేటప్పుడు తీసుకొని వెళ్లేటప్పుడు తప్పకుండా ఎస్కార్ట్ ఉండాలని సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో అధికారులు పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మిర్చి క్వింటా 25 వేల చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

## వరికపూడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ధర్నా

## పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబుకు వినతిపత్రం




నరసరావుపేట, మిర్చి క్వింటాకు 25 వేల రూపాయలు చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, మరియు పలనాడు జిల్లా ప్రజల వరప్రసాదాయని అయినటువంటి వరికపుడిశెల ప్రాజెక్టుకు బడ్జెట్లో నిధులు కేటాయించి, నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని పలనాడు జిల్లా రైతు సంఘాల మరియు ప్రజా సంఘాల సమన్వయ సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం అఖిలపక్ష రైతు సంఘాల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ అరుణ్ బాబు కి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై రాధాకృష్ణ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో సుమారు రెండున్నర లక్షల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేస్తున్నారని, రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుండి లక్షలాది రూపాయలు అప్పు తెచ్చి పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే, పంట అమ్మ బోయేసరికి గతం కంటే ధర సగానికి సగం పడిపోవడంతో రైతులు లబో,దిబోమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా ప్రభుత్వం జోక్యం చేసుకొని క్వింటాకు 25 వేల రూపాయల చొప్పున మిర్చిని కొనుగోలు చేయటం జరిగితేనే భవిష్యత్తులో రైతు వ్యవసాయం చేయడానికి ముందుకు వస్తాడని అన్నారు. లేకుంటే అప్పుల భారంతో రైతులు మరింత సంక్షోభంలో దిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా పల్నాడు జిల్లా లో 100 గ్రామాలకు తాగునీరు, లక్ష ఎకరాలకు సాగునీరు అందించే వరికపుడి శల ప్రాజెక్టు మూడుసార్లు శంకుస్థాపన జరిగిన, నేటికీ నిధులు కేటాయించక ప్రాజెక్టు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉందని అన్నారు. ఇప్పటికైనా వెనకబడిన ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, ప్రాజెక్టు కు నిధులు కేటాయించి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు రెడ్ భాషా ,రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు రాంబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి ఏమాత్రం ఉపయోగపడే విధంగా లేదన్నారు. అన్నదాత సుఖీభవ కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే 20 వేల రూపాయలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పిడిఎం రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు, కె ఎన్ పి ఎస్ రాష్ట్ర నాయకులు ఎన్ కృష్ణ మాట్లాడుతూ, ఢిల్లీలో 13 నెలల పాటు సాగిన రైతాంగ ఉద్యమం కేంద్ర ప్రభుత్వం మెడల వంచి వ్యవసాయాన్ని దెబ్బతీసే మూడు చట్టాలను వెనక్కి కొట్టారని, అయినా సరే మళ్లీ దొడ్డి దారిన అదే చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్ల పరం చేసేందుకు చేసే ప్రయత్నాలను రైతాంగం ఐక్యంగా తిప్పి కొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, ఉపాధ్యక్షులు పెండ్యాల మహేష్, పిడిఎం నాయకులు నల్లపాటి రామారావు, మస్తాన్వలి, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు కంబాల కొండలు, పుల్లారెడ్డి, వెంకట్రావు గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కోట నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తాజ్ బంజారా చెరువు దగ్గర అక్రమ డంపింగ్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆగ్రహం.





**సనత్‌నగర్ ప్రజాబలం ప్రతినిధి:**బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1 లో తాజ్ బంజారా చెరువు దగ్గర కొంతమంది ప్రైవేటు వ్యక్తులు లారీలు ద్వారా మట్టిని డంపింగ్ చేస్తున్నారని సమాచారం అందుకున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బంజారాహిల్స్ పోలీసులకి మరియు జోనల్ కమిషనర్ కి సమాచారం అందించారు. దీంతో అక్కడకు చేరుకున్న బంజారా హిల్స్ పోలీసులు దంపింగ్ చేస్తున్న రెండు ట్రిప్పర్లను స్వాదీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన రోడ్డు మీద జీ హెచ్ ఎమ్ సి పార్క్ గేట్ నుంచి లోపలకి వెళ్లి ప్రైవేట్ వ్యక్తులు ఎలా డంపింగ్ చేస్తున్నారు వారికి సహకారం అందిస్తున్న వారు ఎవరు అనే అంశంపై విచారణ చేపట్టాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జోనల్ కమిషనర్ ను ఆదేశించారు.

## కల్పిత స్టోరీ తో నిర్మించిన చావా సినిమా విడుదల నిలిపివేయాలి

## ఖమ్మం పార్లమెంట్ కంటెస్టెడ్ అభ్యర్థి మహమ్మద్ రసూల్(రఫీ)



ఖమ్మం ప్రతినిధి మార్చి 5 (ప్రజాబలం) ఖమ్మం చావా కల్పిత కథ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాలలో విడుదల నిలిపివేయాలని ఖమ్మం పార్లమెంట్ కంటెస్టెడ్ అభ్యర్థి మైనార్టీ నాయకులు మహమ్మద్ రసూల్ (రఫీ ) ప్రభుత్వాన్ని కోరారు. కల్పిత కథలతో ఒక వర్గాన్ని రెచ్చగొట్టే విధంగా సినిమా ఉన్నదని మత విద్వేషాలు చెల్లరేగే అవకాశం ఉందని ప్రశాంతంగా ఉన్న తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఇలాంటి సినిమాలు ప్రజల మధ్య వర్గాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగానే చర్యలు తీసుకొని విడుదల నిలిపివేయాలని కోరారు

# గోదావరి నీటిలో మునిగి మృతి





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మార్చి 05 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణంలోని ముల్కల్లగూడెం కు చెందిన ముల్కల్ల సత్యనారాయణ అనే 44 సంవత్సరాల వ్యక్తి ఈత రాక ప్రమాదవశాత్తు గోదావరి నీటిలో మునిగి మృతి చెందాడు.మృతుడు కాగజనగర్ ఎస్సి వసథిగృహంలో వాచ్ మెన్ గా పని చేస్తున్నాడు. మంగవారం రోజున ఉదయం గోదావరి నదికి స్నానంకోసం వెళ్లి నీటిలో మునిగి చనిపోయాడు. మృతుని భార్య సుమలత పిర్యాదు మేరకు ఎస్సై-2 రామయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుంది. లక్షెట్టిపేట ఎస్సై పి సతీష్ తెలుపారు.

## ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి మార్చి05 (ప్రజాబలం)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా లక్ష్మీదేవిపల్లిలోని నలంద జూనియర్ కళాశాల నందు గల పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ సందర్శించారు.అక్కడ విధులలో ఉన్న అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.జిల్లావ్యాప్తంగా ఉన్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు,ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు మరియు ఎస్సైలు నరేష్ రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## తెమాహడ జిల్లా అధ్యక్షునిగా పల్లె సమ్మయ్య బాబు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మార్చి 5**తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టి ఎం హెచ్ డి) మంచిర్యాల జిల్లా అధ్యక్షునిగా పల్లె సమ్మయ్య బాబును నియమిస్తు టిమాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు జన్ను కనకరాజు మాదిగ,రాష్ట్ర అధ్యక్షులు కోరిపల్లి శ్రీనివాస్, మాదిగ ఉత్తర్వులు జారీ చేశారు. తెలిపారు. జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తూ వర్గీకరణ కోసం జరిగే పోరాటంలో ముందుంటూ అగ్ర భాగాన మాదిగ జాతి విముక్తి కోసం పోరాడాలని వారన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లె సమ్మయ్య బాబు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఇంతటి బాధ్యతను అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు మాదిగ జాతి ఐక్యత కోసం వారి అభివృద్ధి కోసం పాటుపడతానని జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తూ జాతి హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని ఆయన అన్నారు.

# ఆశయం ఘనం ఆచరణ అధ్వానం

- నిరుపయోగంగా మారిన దంపింగ్ యార్డులు
- గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్న చెత్త వ్యర్థాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి 5 ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా : పల్లెలను స్వచ్ఛత వైపు నడిపించేందుకు ప్రభుత్వం లక్షల రూపాయలను వెచ్చించింది, ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ లు డంపింగ్ యార్డ్ లతోపాటు మరుగు దొడ్డి నిర్మాణం ఏర్పాటు చేసింది, కానీ ఇప్పుడు ఆ డంపింగ్ యార్డులు,నీటి వసతి లేక మరుగుదొడ్డిలు నిరుపయోగంగా మారాయి చెత్త సేకరణ నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో పల్లెలు అపరిశుభ్రత వాతావరణంలో దర్శమిస్తున్నాయి,అల్లాదుర్గం మండల కేంద్రంలో గత ప్రభుత్వం హయాంలో, చెత్తను సేకరించడానికి ట్రాక్టర్లతో పాటు డంపింగ్ యార్డులను ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టింది, తడి చెత్తను పొడి చెత్తను వేరుచేసి సేంద్రీయ ఎరువులు తయారుచేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు,ఆశయం మాత్రం ఎంతో ఘనంగా ఉన్నా ఆచరణలో మాత్రం అధ్వానంగా మారింది, ఇప్పుడున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు, గత ప్రభుత్వం అల్లాదుర్గం మండలంలోని 16,గ్రామ పంచాయతీల్లో, ఒక్కో డంపింగ్ యార్డ్ కోసం రూ. 2. 5,లక్షలను వెచ్చించింది రూ. 40. లక్షల వ్యయంతో అన్ని గ్రామాలలో నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, ట్రాక్టర్లను కేటాయించింది తడి చెత్తను పొడి చెత్తను వేరుచేసి సేంద్రీయ ఎరువుల తయారీ కోసం షెడ్లను నిర్మించింది, ఇప్పుడు ఈ నిర్వహణ సక్రమంగా లేక లక్ష్యం నీరుగారి పోతోంది, ప్రతిరోజు ఉదయం గ్రామాలలో ట్రాక్టర్ ద్వారా చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించేవారు కానీ ప్రస్తుతం అన్ని గ్రామాలలో తూతూ మంత్రంగా చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ వైపు కన్నెత్తి కూడా



చూడకుండా చెత్తను రోడ్డు పక్క గుంతల్లో సమీప వాగుల్లో ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారు, దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి లక్షల రూపాయలు ప్రజాధనం కేటాయించిన ఈ ప్రభుత్వం అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు చెత్త నిర్వహణను సక్రమంగా చేపడితే పల్లెలు స్వచ్ఛతతో మెరుగు పడడంతో పాటు మరికొంతమందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని చెబుతున్నారు, ఇప్పటికైనా ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ చూపి పారిశుద్ధ్య నిర్వహణను సక్రమంగా చేపట్టేల చర్యలు తీసుకోవాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు..

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు శుభాశీస్సులు

### - గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు జై సింగ్ నాయక్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చి5, ( ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కావడంతో, పరీక్షలు రాసే ఉమ్మడి పుల్కల్ మండలంలోని, విద్యార్థిని విద్యార్థులకు, పుల్కల్ మండల గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు, జై సింగ్ నాయక్, ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థులు, ఆత్మవిశ్వాసంతో మీరు పరీక్షలు రాయాలని, మీరు కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని, మీ మంచి భవిష్యత్తుకు ఇది పునాది లాంటిదని,పరీక్షలు బాగారాసిమీతల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చి,వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు, అదేవిధంగా మంచి ఉత్తీర్ణత సాధించి, మీ తల్లిదండ్రులకు, మీ అధ్యాపకులకు,మంచిపేరు తీసుకుని రావాలని అన్నారు..

## సింహాద్రి యాదవ్ జన్మదిన వేడుకలలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్ చిలకల వెంకట నరసయ్య కనకమేడల సత్యనారాయణ



**ఖమ్మం ప్రతినిధి మార్చి5 (ప్రజాబలం)** ఖమ్మం అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ 52వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య మరియు యాదవ సంఘం నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసి భారీ కేక్ కట్ చేసి ఆనందోత్సాహాలు జరుపుకున్నారు పాల్గొన్న ప్రతివారికి చిత్తారి సింహాద్రి కృతజ్ఞతలు తెలియజేసి కీర్తిశేషులు అన్నగారు చిత్తారు శ్రీహరి ఆశీస్సులతో అందరి అభినందనలతో ఇంత ఆనందంగా గడుపు తున్నానని హర్షం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కనకమేడల సత్యనారాయణ బండారు ప్రభాకర్, పుచ్చకాయల కృష్ణ చేతుల నాగేశ్వరరావు, బమ్మిడి శ్రీను, తెల్లబోయిన రమణ మొ రిమేకల కోటయ్య వాకదాని కోటేశ్వరరావు పొదిల సతీష్ మెడిదల మల్లేష్ కనక బండి విజయలక్ష్మి హనుమకొండ రమేష్, లాయర్ శ్రీను తోడేటి లింగరాజు, అడపా పుల్లారావు,బి ఎన్. దేవరాజు, తాళ్లూరు చలపతి ఎస్.కె రంజాన్,పసలపూడి రమేష్,కన్నెబోయిన రవి,బానోత్ సుధాకర్, చిత్తారు విశ్వనాథం, తుప్పా తి రవి వేముల శ్రీను గోసు రవి రామాచారి మంద సంజీవరావు సుందరయ్య మరియు తదితరులు పాల్గొన్నారు



# కలెక్టరేట్ లో ఉచిత మధ్యాహ్న భోజనాన్ని దివ్యాంగులు ఉపయోగించుకోవాలి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

### కలెక్టరేట్ లో దివ్యాంగ అర్జీదారులకు ఉచిత మధ్యాహ్న భోజనం

### సమీకృత జిల్లా కలెక్టరేట్ లో దివ్యాంగ అర్జీదారులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం ప్రతినిధి మార్చి 05 (ప్రజాబలం)** ఖమ్మంకలెక్టరేట్ కు వివిధ పనుల నిమిత్తం వచ్చే దివ్యాంగులకు కల్పించిన ఉచిత మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని ఉపయోగించు కోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు బుధవారం జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి కలెక్టరేట్ లో దివ్యాంగ అర్జీదారులకు కోసం ఏర్పాటు చేసిన ఉచిత మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ 40 రోజుల క్రితం ప్రజావాణి లో వచ్చిన అభ్యర్థన మేరకు జిల్లా అధికారులతో చర్చించి దివ్యాంగ అర్జీదారులకు ఉచిత మధ్యాహ్న భోజనం కల్పించాలని నిర్ణయానికి వచ్చామని అన్నారు జిల్లా కలెక్టరేట్ కు వచ్చే దివ్యాంగులకు ఇది వారి కలెక్టరేట్ అనే భావన కల్పించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు ప్రజలందరికి సేవ చేసేందుకే అధికారులు ఉన్నారని, ముఖ్యంగా సమాజంలో వెనుక బడిన వారికి, దివ్యాంగులకి, బలహీన వర్గాల వారికి సహాయం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.



ప్రజావాణి కార్యక్రమం, వివిధ పనులపై ఎప్పుడు కలెక్టరేట్ కు దివ్యాంగులు వచ్చిన క్యాంటీన్ లో ఏర్పాటు చేసిన ఉచిత మధ్యాహ్న భోజనాన్ని ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు రాబోయే 3 నెలల కాలంలో ప్రతి దివ్యాంగుడికి తప్పనిసరిగా యూ.డి.ఐ.డి. కార్డు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లా కలెక్టరేట్ లోని క్యాంటీన్ లో సదరం సర్టిఫికెట్, యూ.డి.ఐ.డి. కార్డుతో టోకెన్ పొందిన వారికి ఉచితంగా మధ్యాహ్న భోజనం కల్పిస్తామని అన్నారు. జిల్లా కలెక్టరేట్ ఖమ్మం నగరానికి కొంత దూరంలో ఉన్న నేపథ్యంలో దివ్యాంగులకు ఇబ్బందులు కలగవద్దని ఈ ఏర్పాటు చేశామని, నాణ్యమైన భోజనాన్ని క్యాంటీన్ ద్వారా అందిస్తున్నామని ఒక భోజనంపై 80 రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు దివ్యాంగులను అతిథులుగా భావించి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని విజయవంతం గా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టరేట్ కు వచ్చిన దివ్యాంగులందరికి ఉచిత భోజనం అందుతుందని, ఎవరిని తిరస్కరించడం ఉండదని అన్నారు ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు

# టేక్మాల్ మండలంలో జోరుగా అభివృద్ధి పనులు

### వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు,ప్రత్యేక కృతజ్ఞతలు

### టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 5 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా: టేక్మాల్ మండలంలో రెండో విడతగా ఒక కోటి 20.లక్షల రూపాయలు,( ఎన్ఆర్ఈజీఎస్) నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు, టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నిమ్మ రమేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు, అందులో భాగంగా 13. గ్రామాలకు 5.లక్షల చొప్పున సిసి రోడ్డు పనులు, బొడ్మట్ పల్లి హైస్కూల్ ప్రహరీ గోడకు 25. లక్షలు, దన్నూర జిల్లా పరిషత్ హైస్కూల్ కు 15. లక్షలు టేక్మాల్ మోడల్ స్కూల్ పిడబ్ల్యు రోడ్డు నుంచి మోడల్ స్కూల్ వరకు 15 లక్షల సిసి రోడ్డు,టేక్మాల్ ఎస్సీ హాస్టల్ ప్రహరీ గోడకు 5 లక్షలు, టేక్మాల్ మోడల్ స్కూల్కు సంబంధించిన 15, లక్షల సిసి రోడ్డు పనులనుప్రారంభిస్తూ, మోడల్ స్కూల్ కు సంబంధించిన, అభివృద్ధి పనులను పర్యవేక్షించి, ఇంకా జరగబోయే పనుల గురించి, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సాయిలు తో మండల కాంగ్రెస్ కమిటీ నాయకులు చర్చించడం జరిగింది, ఇంకా ఏమైనా అవసరాలు ఉంటే అట్టి విషయాల్లో మంత్రి దృష్టికి తీసుకు పోదామని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భక్తుల కిషోర్, మాజీ కో ఆప్షన్ షేక్ మజాహర్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ ఆశిలి సాగర్,మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసు న్యూట్విస్ట్

**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి:** మార్చి 5తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక నిందితులను పట్టుకునేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఓ కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. సీబీఐ ద్వారా ఇంటర్ పోల్‌కు రెడ్ కార్నర్ నోటీసు పత్రాలు చేరుకున్నాయి. నిందితుల్లో ప్రభాకర్‌రావు కెనడాకు పరారయ్యారు. మరొక నిందితుడు శ్రవణ్‌రావు బెల్జియంలో ఉన్నట్లు తెలుస్తోంది. రేపో మాపో వీరిని అరెస్ట్ చేసి హైదరాబాద్ కు తీసుకురావడం ఖాయంగా కనిపిస్తోంది. తెలంగాణలో రాజకీయంగా ప్రకంపనలు సృష్టించింది ఫోన్ ట్యాపింగ్ కేసు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కేసు నమోదు చేశారు పోలీసులు. ఇందులో కీలక నిందితులుగా భావిస్తున్న ప్రభాకర్‌రావు, శ్రవణ్ రావు జాడ తెలియరాలేదు. వీరిని పోలీసులు విచారిస్తే ఈ కేసుకు ముగింపు దశకు రానుంది. కాకపోతే వీరిద్దరు విదేశాల్లో చక్కర్లు కొడుతున్నారు. తాజాగా వీరిద్దరి గుట్టు రట్టయినట్టు తెలుస్తోంది.ఈ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో హైదరాబాద్ పోలీసులు ఇచ్చిన ఆధారాలను సీబీఐ అధికారులు పరిశీలించారు. దీంతో దర్యాప్తులో తమ వంతు సాయం అందించారు. ఈ నేపథ్యంలో ఇద్దరు నిందితులపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని సీబీఐ నిర్ణయించింది. ఈ విషయాన్ని ఇంటర్ పోల్ కు తెలిపింది. దీంతో సీబీఐ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు పత్రాలు ఇంటర్ పోల్‌కు వెళ్లాయి.ఈ కేసు గురించి తెలంగాణలో జరుగుతున్న పరిణామాలను నిందితులు తమ వేగుల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. ఇద్దరి నిందితుల చుట్టూ ఉచ్చు బిగిస్తుందని తెలుసుకున్న వీరు, అమెరికా నుంచి మకాం మార్చినట్టు వార్తలు వస్తున్నాయి. అమెరికా నుంచి ప్రభాకర్‌రావు కెనడాకు వెళ్లినట్టు తెలుస్తోంది. మరొక నిందితుడు అమెరికా నుంచి శ్రవణ్‌రావు బెల్జియం వెళ్లినట్టు పోలీసుల వర్గాల సమాచారం.సీబీఐ పంపిన రెడ్ కార్నర్ నోటీసులను ఇంటర్ పోల్ అధికారులు పరిశీలించారు.

# శివసేన హైదరాబాద్ అధ్యక్షుని గా గణేష్ గౌటే



**ఛార్మినార్ ప్రజాబలం ప్రతినిధి:**బుధవారంనాడు శివసేన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హైదరాబాదులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ ఉపాధ్యక్షులు కేశవ్ గుప్త. అవినాష్ జైస్వాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆంధ్రపు సుదర్శన్ పుస శ్రీనివాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా గణేష్ గౌటే ను నియమించారు శివసేన హైదరాబాద్ అధ్యక్షుని గా నియమించిన జాతీయ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే జాతీయ యువసేన అధ్యక్షుడు ఆదిత్య థాకరే అధ్యక్షుడు వెంకటేష్ మరియు ఆంధ్రపు సుదర్శన్ శ్రీనివాస కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు తెలంగాణలో శివసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా రాష్ట నాయకులు కార్యకర్తలు శివసేన పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా నియమించినందుకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఠాకూర్ వికాస్ సింగ్ కరణ్ ,సూర్యవంశి.పాండు మహేష్ శ్రీనివాస్ చెందర్ తదితరులు పాల్గొన్నారు.

# తాపీ మేస్త్రీ సంఘం గౌరవాధ్యక్షుడిగా బండి సదానందం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మార్చి 5** :మందమర్రి తాపీ మేస్త్రి సంఘం గౌరవ అధ్యక్షుడిగా బండి సదానందంను ఎన్నుకున్నారు. బుధవారం జరిగిన తాపీ మేస్త్రీ సంఘం సమావేశంలో బండి సదానందం యాదవ్‌ను సంఘ గౌరవాధ్యక్షుడిగా నియమించినట్లు ప్రకటించారు. అనంతరం గౌరవాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బండి సదానందం యాదవ్ మాట్లాడుతూ, తాపీ మేస్త్రీల సంక్షేమం కోసం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతో కార్మికుల హక్కులు, జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వైభవంగా క్రేజీ స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వేడుకలు

### ప్రత్యేక ఆకర్షణగా ప్రజా కవులు యూట్యూబ్ స్టార్స్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మార్చి 5**:క్రేజీ స్టార్స్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన క్రేజీ స్టార్ ఆఫ్ ది ఇయర్ - 2025 అవార్డ్స్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భేరి ఈశ్వర్, కవి గాయకులు ఓయూ జేఏసీ నేత డాక్టర్ దరువు ఎల్లన్న, కవి గాయకులు డాక్టర్ తీన్మార్ రవి, అంజనీపుత్ర డైరెక్టర్ పిల్లి రవి, కాంగ్రెస్ యువ నాయకులు మంద తిరుమల్ రెడ్డి, యూట్యూబ్ స్టార్స్ సందీప్ సక్సేనా, రౌడీ రాజేష్ , కోటి అమూల్య, మొగిలిపాక స్నేహ, దేవికా రాణి, నీతు క్వీన్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా కవి, ఓయూ జేఏసీ నేత డాక్టర్ దరువు ఎల్లన్న మాట్లాడుతూ మందమర్రి మట్టిగడ్డకు ఒక ప్రత్యేకత ఉన్నదని తెలంగాణలో జరిగిన ప్రతి ఉద్యమానికి ఈ ప్రాంతం అండగా ఉందని ఆయన అన్నారు. కళాకారులు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని తెలంగాణ ఉద్యమాన్ని గ్రామ గ్రామాన తీసుకెళ్లిన తెలంగాణ ధూమ్ ధామ్ ఇదే గడ్డపై ప్రారంభమైందన్నారు. తెలంగాణ జానపద కళాకారులు ప్రపంచమే నివ్వెరపోయేలా యూట్యూబ్ రంగాన్ని శాసిస్తున్నారని, సినిమా సినిమా పాటలతో పోటీపడి రాణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయా రంగాల్లో రాణిస్తూ సేవలందిస్తున్న 50 మంది కి క్రేజీ స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వారికి అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు వై ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో తెలంగాణ ధూమ్ ధామ్ వ్యవస్థాపకులు అంతడుపుల నాగరాజు, అకాడమీ ప్రధాన కార్యదర్శి నరేష్, అధ్యక్షులు పులిపాక శ్రీనివాస్, బండ శాంకరి, ఉప్పులేటి గోపిక, రేగుంట చంద్రశేఖర్, సీనియర్ కళాకారులు ప్రభాకర్, రాజేశ్వర్, హనుమాండ్ల మధు, రాకం సంతోష్, క్రేజీ విజయ్, ఆసం కళ్యాణ్, ఉప్పులేటి రాజమౌళి, కల్వల శ్రీనివాస్, రమేష్ రాజా తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ నాయకుని జన్మదిన వేడుకలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మార్చి 05(ప్రజాబలం)**వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలంలోని తుమ్మలపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నే పాండు పుట్టిన రోజు సందర్భంగా మర్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, గూడెం రాములు యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ పసియోదిన్, పంచాలింగల్ మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, రావులపల్లి మాజీ సర్పంచ్ అబ్రహం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచన్న,గోపాల్, మల్లికార్జున గిరి యువనాయకులు పట్నం అశోక్, బూచన్ పల్లి గ్రామ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఈశ్వర్, తదితరులు పాల్గొ నీ కేక్ తినిపించి ఆశీర్వదించారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 05 :** జిల్లాలో ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ లతో కలిసి ఎ.సి.పి.లు, తహశిల్దార్లు, సి.ఐ.లు, ఎస్.ఐ.లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన తరువాత ఈ నెల 10వ తేదీ నుండి ప్రారంభమయ్యే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి తహశిల్దార్, ఎస్.హెచ్.ఓ., మండల పంచాయతీ అధికారి, మున్సిపల్ పరిధిలో తహశిల్దార్, ఎస్.హెచ్.ఓ., మున్సిపల్ కమీషనర్ హాజరై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి కనీసం 15 రోజులు, గరిష్టంగా 21 రోజులలోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిధిలో పరిష్కారమయ్యే భూ సమస్యలను రికార్డులను సరి చూడాలని, దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించాలని తెలిపారు. డివిజన్ స్థాయిలో రాజస్వ మండల అధికారి, ఎ.సి.పి.లు, జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డి.సి.పి.లు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి అప్పటికప్పుడు పరిష్కారమయ్యే వాటిని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించి ఆయా స్థాయిలలో రిజిస్టర్ ఖచ్చితంగా నిర్వహించాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, తమ పరిధిలో లేని సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పైస్థాయికి సిఫారసు చేయాలని తెలిపారు. కోర్టులో పరిష్కారమయ్యే సమస్యలపై సంబంధిత అర్జీదారులకు అవగాహన కల్పించాలని, బెదిరింపులు, ఆందోళన చర్యలకు పాల్పడినట్లయితే సంబంధిత వ్యక్తులపై ఎఫ్.ఐ.ఆర్.నమోదు చేయాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారం కొరకు అవసరమైన సమాచారాన్ని ఆయా స్థాయిల పరిధిలోని వివిధ శాఖల నుండి పొందవచ్చని తెలిపారు.ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురి కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఆక్రమిత ప్రభుత్వ భూములను చేపట్టిన నిర్మాణాలను తొలగించి స్వాధీనపర్చుకోవాలని తెలిపారు. భూములకు సంబంధించి తప్పుడు / నకిలీ ధృవపత్రాలకు సంబంధించి జిల్లా స్థాయి అధికారులకు రిపోర్టు చేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని,దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల,జైపూర్, బెల్లంపల్లి ఎ.సి.పి.లు ప్రకాష్,వెంకటేశ్వర్లు, రవికుమార్,మండలాల తహశిల్దార్లు,సి.ఐ.లు, ఎస్.ఐ.లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మార్చి 05 :** జిల్లాలో ఈ నెల 25వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బంధీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని,మొదటి రోజు జనరల్ పరీక్షకు 5 వేల 697 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 5 వేల 472 మంది, ఒకేషనల్ పరీక్షకు 668 మంది హాజరు కావలసి ఉండగా 606 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్,త్రాగునీరు, ఫ్యాన్లు,వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని,విద్యార్థుల పరీక్ష కేంద్రంలోనికి వెళ్ళే సమయంలో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలోని మొబైల్, ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరుగదని,ప్రతి పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు,ఓ. ఆర్.ఎస్.ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో సమయానుసారంగా బస్సులు నడిపించడం జరుగుతుందని,పరీక్ష ప్రశ్నా పత్రాలు,జవాబు పత్రాలను బందోబస్తు మధ్య తరలించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచుతూ పరీక్ష సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట టు బలహార్ష రైలు తిరిగి ప్రారంభం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గం రిపోర్టర్ మార్చి 5 :**కరోనా సమయంలో నిలిచిపోయిన కాజీపేట టు బల్లర్ష రైలు నిలుపుదలతో ప్రయాణికులు, పలు వ్యాపార సంస్థలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ మరియు దక్షిణ మధ్య రైల్వే (ఎస్ సి ఆర్ ) శాఖ అధికారులను కోరిన వెంటనే స్పందించిన రైల్వే శాఖ కాజీపేట టు బల్లర్ష రైలు పునరుద్ధరణ చేపట్టిన రైల్వే శాఖ అధికారులు ఆదేశాలతో జారీ చేశారు. కాజీపేట టు బల్లర్ష రైలు పునః ప్రారంభంతో తెలంగాణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

### ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు: జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి.



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చ్ 05(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. బుధవారం సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లో ఏర్పాటుచేసిన ఇంటర్ పరీక్షల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మికతనికి నిర్వహించారు,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బుధవారం నుండి ప్రారంభమైన ఇంటర్ పరీక్షల కోసం 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రథమ,ది ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలలో 34వేల 614 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, లను ఏర్పాటు చేయడం, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలలో తాగునీటి వసతి కల్పించడంతోపాటు వైద్య ఆరోగ్య సిబ్బంది, అత్యవసర మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు,కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవిందరాం,పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు ఉన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..**నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతి నగర్ ప్రభుత్వ బాల, బాలికల జూనియర్ కళాశాలలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరీక్షల తొలిరోజు అయిన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా? లేదా? అని పరిశీలించారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏ.ఎన్,ఎం, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు.కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరశురాం, తదితరులు ఉన్నారు

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో నకిరేకల్ ఎమ్మెల్యే

**హైదరాబాద్ప్రజాబలం ప్రతినిధి: మార్చి 5** సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. ఏకంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను టార్గెట్ చేశారు. ఆయన సోసల్ మీడియా ఫ్లాట్‌ఫామ్స్ నుంచి ఫొటోలు సేకరించిన కేటుగాళ్లు.. వాటిని మార్ఫింగ్ చేసి న్యూడ్ కాల్స్ చేసినట్టు వీడియో తయారు చేశారు. ఆ వీడియోను వాట్సాప్ ద్వారా ఎమ్మెల్యే వీరేశంకు పంపి, డబ్బులు డిమాండ్ చేశారు. లేదంటే వీడియోను సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తామంటూ బ్లాక్‌మెయిల్ చేశారు. దాంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు.వివరాల్లోకి వెళ్తే.. నకిరేల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంను సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. దీంతో ఆయన కాల్ లిఫ్ట్ చేయడంతో.. అవతలి వ్యక్తి నగ్నంగా కాల్ మాట్లాడారు. ఇంతలో కేటుగాళు స్క్రీన్ రికార్డు చేసి మళ్లీ ఆయనకే పంపారు.. వీడియో విషయంపై బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. ఆయన స్పందించక పోవడంతో ఆ వీడియోను సదరు కాంగ్రెస్ నేతలకు పంపారు.ఈ నేపథ్యంలో సదరు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు వీరేశంకు ఫోన్ చేయడంతో ఖంగుతిన్నారు. దీంతో నేరగాళ్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.ఇదిలా ఉంటే.. సైబర్ క్రైమ్.. ఈ పేరు వింటేనే వణుకుపుడుతోంది. పెరుగిపోతున్న సాంకేతికతను మోసగాళ్లు ఆసరాగా తీసుకుని అందిన కాడకి డబ్బులు దండుకుంటున్నారు. సులభంగా మనీ సంపాదించడంపై ఫోకస్ చేయడమే దీనికి ప్రధాన కారణం అని తెలుస్తుంది. గతంలో చోరీలు అంటే ఇంటి కిటికీలు, తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న డబ్బును దొంగిలించేవారు. కానీ ఇప్పుడు కంప్యూటర్ల ముందు కూర్చొని కూడా కన్నాల వేయవచ్చని నిరూపిస్తున్నారు.సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథా ఎంచుకుంటున్నారు. కొంగొత్త మార్గాల్లో అమాయకులను మోసం చేస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఎన్నో రకాల మోసాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. సైబర్ నేరగాళ్ల అమాయకులనే కాదు ప్రజా ప్రతినిధులను కూడా టార్గెట్ చేస్తున్నారు. తాజాగా ఓ ఎమ్మెల్యేపై అశ్లీల వీడియో కాల్స్‌తో సైబర్ నేరగాళ్లు ఎటాక్ చేశారు.నల్లగొండ జిల్లా నక్రేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సెల్‌ఫోన్‌లోకి చొరబడి సైబర్ ఎటాక్ చేశారు. ఎమ్మెల్యే వేముల వీరేశం సోషల్ మీడియా అకౌంట్‌లో నుండి ఫోటోలను సేకరించిన సైబర్ క్రిమినల్స్.. స్క్రీన్ రికార్డు పర్సనల్ నెంబర్ వాట్సాప్ కి పంపి ఎమ్మెల్యేను బెదిరించారు. చివరికి తనపై జరుగుతున్న సైబర్ ఎటాక్‌పై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.నక్రేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తన అనుచరులతో మాట్లాడుతున్న సమయంలోనే సైబర్ నేరగాళ్ల నుంచి వీడియో కాల్ వచ్చింది. ఒక్కసారిగా నగ్నంగా ఉన్న వ్యక్తి వీడియో కాల్‌లోకి రావడంతో కాల్ కట్ చేశారు వీరేశం. వీడియో కాల్ సైబర్ మోసగాళ్లు చేస్తున్నారని వెంటనే పసిగట్టిన వీరేశం.. వెంటనే కాల్ కట్ చేశారు. అంతటితో వదలని కేటుగాళ్లు వాట్సాప్ చాటింగ్ ద్వారా మెసేజ్‌లు పంపి ఎమ్మెల్యేను బెదిరించారు సైబర్ నేరగాళ్లు. వీడియోలు ఫోటోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేయాలా లేదంటే డబ్బులు పంపిస్తావా అంటూ బ్లాక్ మెయిల్ చేశారు. అప్రమత్తమైన ఎమ్మెల్యే వీరేశం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల సలహాతో సైబర్ నేరగాళ్ల నెంబర్ ను ఎమ్మెల్యే వీరేశం బ్లాక్ చేశారు.గత ఏడాది అక్టోబర్ లో సైబర్ నేరగాళ్లు ఎమ్మెల్యే వీరేశం పేరుతో డబ్బులు కావాలంటూ ఆయన సన్నిహితులకు వాట్సాప్ మెసేజ్‌లు చేశారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రజలను కోరారు. సైబర్ నేరాలు పట్ల అవగాహన కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం సెల్ ఫోన్ రింగ్ టోన్ ను పెట్టారని ఆయన చెప్పారు. సైబర్ నేరగాళ్ల వలలో ప్రజలు పడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫైబర్ నేరగాళ్ల విషయంలో ఆన్‌లైన్ గేమింగ్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేముల వీరేశం సూచించారు. అయితే కన్నం మీ ఇంటికి కాదు.. మీకు, మీ బ్యాంకు ఖాతాకు.గతంలో ఈ మోసాలా భారినపడిన వారిలో యువకులు, మహిళలు ఉంటే.. ఇప్పుడు రాజకీయ నాయకులు, వృద్ధులు కూడా ఈ కోవకే వచ్చేశారు. అసలు సైబర్ మోసం లేని రోజు లేదు అన్నట్లు కాలం మారిపోయింది. మరి ఇందుకు గల కారణాలు ఏంటి..? మోసపోకుండా ఉండాలంటే ప్రజలు ఏవిధంగా అవగాహన చెందాలి. కాస్త కంప్యూటర్ పరిజ్ఞానం ఉండటమే అర్హత. నాలుగు ముక్కలు మాట్లాడి బురిడీ కొట్టించగలిగితే అదే ఆయుధం. ఇదీ సైబర్ నేరస్థులు అనుసరిస్తున్న పంథా.. మొన్నటి వరకు వివధ దేశాలు నగరాలకే పరిమితమైన కేటుగాళ్లు ఇప్పుడు చిన్న చిన్న పట్టణాలు, పల్లెలు, తండాలకు కూడా విస్తరించారు. ఏమరుపాటుగా ఉన్నారో సర్వ నాశనమే. ఏదైనా గుర్తు తెలియని నెంబర్‌తో మెసేజ్ కానీ, ఫోన్ కానీ వస్తే లిఫ్ట్ చేయకండి.. చేశారో.. డేంజర్‌లో పడ్డట్టే.. మీ ముబైల్‌లో డేటా మొత్తం వాళ్ల చేతికి వెళ్లిపోతుంది. ఇక న్యూడ్ వీడియోలు, మెసేజ్‌లతో డబ్బులు కోసం బెదిరించే ఛాన్స్ ఉంది. ఇలాంటివి ఏమైనా వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

## న్యూరల్ ఏఐ గవర్నెన్స్ 2025 కి రావాలంటూ మంత్రికి ఆహ్వానం

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**ఈ నెల 8వ తేదీన ట్రైడెంట్ హోటల్లో జరిగే న్యూరల్ ఏఐ గవర్నెన్స్కు రావాలంటూ మంత్రి పొన్నం ప్రభాకర్కు జినిసిస్ ఇన్ఫో ఎక్స్ అధినేత డాక్టర్ వినయ్కుమార్, న్యూరల్ ఏఐ అధినేత మోహన్కుమార్, న్యూరల్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సమన్వయకర్త జాతీయ బీసి దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామిలు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. మినిష్టర్ క్వార్టర్స్లో మంత్రిని కలిసిన అనంతరం కుమార స్వామి మాట్లాడుతూ మానవ జీవితంలో ఏఐ ప్రస్తుతం ఎంతో కీలకంగా మారిందని అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని అన్నారు. దీనికి మెషిన్ లెర్నింగ్ తోడవడం వల్ల మరిన్ని అద్భుతాలు జరుగుతున్నాయని అన్నారు. ఏఐ వల్ల సంచలనాలు సృష్టించే దేశాల్లో భారత్ కూడా భాగం కావాలని దుంద్రు కుమార స్వామి అన్నారు.ఆరోగ్య సంరక్షణ, రవాణా, రిటైల్, ఆర్థిక సేవలు, విద్య, ప్రజా భద్రతతో సహా దాదాపు అన్ని పరిశ్రమలలో అఐ వినియోగం వేగంగా పెరుగుతోందని అన్నారు.ఏఐ గవర్నెఅ? ?స గురించి అవగాహన కల్పించడానికి భారత్ లైట్ హౌస్ సంస్థ మరియు జెనిసిస్ ఇన్ఫో ఎక్స్ కీలక అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ సమ్మిట్లో పలువురు టెక్ దిగ్గజాలు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దీప్తి, రాధిక, రామారావు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com